
అక్టోబర్ '79
రూ.3/-
పోటీలో బహుమతి పొందిన కథలు

సంస్థాపకులు
శ్రీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

అక్టోబరు 1979

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 7 విషయసూచిక సంచిక 9

ఇంకా కవితలూ, కార్టూన్లూ

నవలానుబంధం

గజంమిధ్య-పలాయనం మిధ్య

రచన వంశీ

ముఖచిత్రం 'కోతలరాయుడు'లో మాధవి

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్. 423123. సంవత్సర చందా (ప్రత్యేక సచికతో రు. 42/)

మోపెడ్లలో ప్రత్యేక స్థానం-అదే సువేగా యొక్క ప్రథమస్థానం



సువేగా మొట్టమొదటిదిగా హార్డ్ క్రోమ్ అల్యూమినియం మిశ్రమసిలిండర్లతో అదనపు మన్నిక మరియు అదనపు ప్రయాణాన్ని యిస్తుంది.

SAA/MIL/433/TEL

సాధారణంగా వాడే పోతయినుము సిలిండర్లకు బదులుగా సువేగా మోపెడ్లు ఈ ప్రత్యేక రకములయిన సిలిండర్లనే ఉపయోగిస్తున్నాయి-దీని ఫలితం? ఈ సిలిండర్లు ఎక్కువకాలం పని చెయ్యటంవలన మాటిమాటికి సిలిండర్/పిస్టన్‌లను మార్చుటకయ్యే ఖర్చు నిశితంగా తగ్గింపబడుతుంది. ఎక్కువ కాలం మన్నిక అంటే మొత్తంమీద అదనపు మైళ్ళు అని చెప్పనక్కర్లేదుకదా.

ఇంకను కొన్ని ఉత్తమ గుణములు:

- చెయిన్‌డ్రైవ్ మరియు చక్కని స్థిరత్వమునకు లోవైపున దిట్టమైన బాక్స్ సెక్షన్ ఫ్రేము
- పొదుపునకు మరియు తేలిక ప్రయాణమునకు ఆటోమెటిక్ క్లచ్.
- సులభమైన కదలికకు, విడిభాగముల బహుకాల మన్నికకు నీడిల్ రోలర్ బేరింగులు.

వీటికన్నింటికి మించి సువేగాకు అమ్మకము తర్వాత విరివి అయిన అనుబంధ సర్వీసు వసతులు.

ఇండియా అంతయు విడిభాగములు లభించు వసతులు అందగా గలవు. అందుచేతనే మోపెడ్స్‌లో సువేగా నేటివరకూ ప్రథమ స్థానంలోనే ఉన్నదనటంలో ఆశ్చర్యం లేదుకదా?

మోపె
ఇండి
లిమిటె
తిరుపతి, ఆంధ్ర ప్రదే

Suvega

సువేగా సాటిలేని మోపెడ్‌కు మరొకపేరు.

తొలిమాట

జ్యోతి నిర్వహించిన కథల పోటీలో బహుమతులు పొందిన రచనల వివరాలు ఇక్కడ ఇస్తున్నాము గత సంచికలోనే ప్రచురింపబడవలసి వున్న ఈ ఫలితాలు, మొదటి మూడు బహుమతులు పొందిన కథలూ, అనుకోని కొన్ని ఇబ్బందుల కారణంగా అలా ప్రచురించలేకపోయినందుకు చింతిస్తున్నాము

బహుమతి వివరాలు

మొదటి బహుమతి రు. 750

తాజ్‌మహల్-రచన వల్లూరు శివప్రసాద్

రెండవ బహుమతి రు. 400

అడ్డొచ్చిన కన్నీటి కెరటం-రచన: ఓలేటి బుచ్చిబాబు

మూడవ బహుమతి రు. 300

చదరంగంలో చచ్చేది-రచన అనూగీత

రు. 116 చొప్పున ప్రత్యేక బహుమతి పొందిన కథలు

1 మనం మనం ఒకటి—శ్రీసుభా
2 ముసురు—తులసి బాలకృష్ణ
3 పిల్ల తెమ్మెర—నవులూరి వెంకటేశ్వరరావు
4. ఊరా - అదివా?—గోవిందు నరసింహారావు
5 సొమ్ము వాడిదే సోకూ వాడిదే—అంగర వెంకటశివప్రసాదరావు
6. ఆట—నందిని సిధారెడ్డి
7 హంసలా కలకాలం—బి. ఎ సుబ్బారావు
8. ది గ్రాండ్ కాన్యన్—దేశెట్టి కేశవరావు
9 తిరిగొచ్చిన గేదె—తల్లావఝుల సుందరం
10 లేటొచ్చిన బస్సు—వినయ్

అధిక సంఖ్యలో పాల్గొని కథల పోటీ జయప్రదం చేసిన రచయితలందరికీ కృతజ్ఞతలు. బహుమతి పొందిన రచయితల వివరాలు ఆ యా కథలు ప్రచురించిన పేజీలలోనే ప్రచురిస్తున్నాము విజేతలకు మా అభినందనలు

ఉత్తరాలు

సెప్టెంబరు సంచికలో విద్వేశ్వరిగారి నవల 'జీవనయాత్రలో స్త్రీ' చాలా బాగుంది నవలలో మధుర పాత్రను మరచిపోలేని విధంగా మల చిన రచయిత్రికి మా అభినందనలు నవలలోని పాత్రలూ, సంఘటనలు జీవితానికి దగ్గరగా, వాస్తవికంగా మలిచారు రచయిత్రి కథలలో కమ్మని కథ, అంతర్గతం, మనసు చెప్పిన కథ, కథలు బాగున్నాయి యద్దనపూడి సులోచనా రాణిగారి ప్రేమసింహాసనం, లక్ష్మిగారి మీరా సీరియల్స్ రెండూ మా కెంతో ఉత్సాహాన్ని కలుగజేస్తూ తరువాత సంచిక కోసం యెదురు చూసేలా చేస్తున్నాయి. మయసభలో నేటి విద్యా విధానాన్ని గూర్చి రామసంజీవిగారు చక్కగా వివరించారు. వారన్నట్లు ప్రగతి అంటే యెక్కువ డబ్బుకు తక్కువ చదువు కాబోలు అనుకోక తప్పటంలేదు. కార్టూన్స్ యెక్కువగా వేయండి

—డి. శ్యామల-డి. నిర్మల, కారంచేడు.

నా కసలు ఉత్తరాలు వ్రాసే అలవాటులేదు కాని "జ్యోతి" సెప్టెంబరు సంచికతో మీ రందించిన పూర్తినవల "జీవనయాత్రలో స్త్రీ" చదివాక ఈ నాలుగుముక్కలు రాసేవరకు నిద్ర పట్టలేదంటే నమ్మండి చదువు-సంధ్యలు లేని అతి సౌమ్యురాలయిన మధుర పారకుల్ని ఎక్కడ ఊపిరికూడా పీల్చనీయకుండా తనతో పాటు విదేశాలుకూడ తీసుకొని పోయి కంట నీరు కార్పించింది. "మాతృదేవో భవ" అనే పదాన్ని పునీతంచేసి అన్నీ తానై కుమారుణ్ణి దేశదేశాలు గౌరవించేటంతటివానిగా రూపొందించింది. పోతేనా కెందుకోగాని వరలక్ష్మి పాత్ర ఉదాత్తంగా ఉన్నప్పటికీ మోహన్ తన మీద నమ్మకంతో పదిలంగా తెచ్చిన డైరీలను యథాతథంగ అతని యెదుటే చదివి వుంటే బాగుండే దనిపించింది మోహన్ తండ్రిమీద ప్రతీకారం తీర్చుకుంటాడేమోననే భయంతో "కట్టె, కొట్టె, తెచ్చె" అన్నట్లు ముగించింది కళ్ళు లేకపోబట్టేగదా (అతను చదువలేడు గనుక) మిగిలిన తల్లి అనుభవించిన నర యాతనను చెప్పకుండా దాయగలిగింది? అవి తెలుసుకున్నప్పటికీ, అతి సౌమ్యుడై మోహన్ తండ్రిపై పగ సాధింపు చర్య చే డని యెవరైనా వూహించగలరు ప్రతి త తమ బిడ్డల్ని అలా తీర్చిదిద్దగలిగితే భువి స్వర్గం దిగిరాదూ? యిటువంటి మంచి న మాకు అందించిన శ్రీమతి డి విద్యేశ్వరిగా ప్రచురించిన మీకు నా హార్దికాభినందనలు ఇ ముందుకూడా యింత ఉదాత్తమైన వాటినెనో అందించగలరనే ఆశాభావంతో

—జె కామేశ్వరి, కాకినాడ

నా అభిమాన హీరో హీరోయిన్లు జయసుభ శోభన్‌బాబుతో వెలువడిన సెప్టెంబరు జ్యోతి సంచిక ముచ్చటగా, అందంగా వుంది. ప్రేమ

చందాదారులకు విజ్ఞప్తి

తమ తమ చందాలకు సంబంధించిన వివరాల కొరకు రాసేటప్పుడూ, చందా రెన్యూ చేస్తూ మనియార్డర్లూ, డ్రాఫ్టులూ పంపేటప్పుడూ తప్పక తమ చందా నంబరు ఉదహరిస్తూ రాయగోరు తున్నాము.

—మేనేజర్, జ్యోతి

సింహాసనం. మీరా సీరియల్స్ చాలా ఆసక్తికరంగా వున్నాయి ప్రేమసింహాసనం ఇంకా యెక్కువ పేజీలతో వెయ్యగలరు ఈ నెల జోక్సు యేమీ బాగాలేవు "జీవనయాత్రలో స్త్రీ" నవల బాగున్నది చివరలో మన దేశము యొక్క స్థితి చక్కగా వర్ణించారు నవలను చివరివరకూ విసిగించకుండా సాఫీగా నడిపింది రచయిత్రి. రచయిత్రికి నా కృతజ్ఞతలు

—బి. శారద, సూర్యాపేట

ఆంధ్ర అభిమాన నటుడు శోభన్‌బాబు, జయసుధ ముఖచిత్రం గల "జ్యోతి" చాలా బాగుంది.

"ప్రేమ సింహాసనం" (సీరియల్) ఇంట రెస్టుగా సాగుతోంది మిగతా కథలు అన్నీ బాగున్నాయి తరువాత సంచికకోసం యెదురు చూస్తున్నాము

—నడుపల్లి వేణుగోపాలరావు, నిడదవోలు

ఆగస్టు సంచికలోని శ్రీశ్రీగారి పదబంధ ప్రహేళిక జవాబులు సెప్టెంబరు సంచికలో చూశాను. 26 నిలువు జబ్బు మరు జన్మలోనే అన్న క్లూకి జవాబు "రుజ" అని వస్తుంది 29 అడ్డం విరాజిత వృత్తం అని క్లూ యిచ్చి జవాబుగా "కవిరాజు" అని యిచ్చారు (వారి జవాబులు కూడా అలాగే వున్నాయి మరి 26 నిలువు "రుజ" అని ఎలా వస్తుంది? ఇదెలా సాధ్యం? ఇలా పాఠకుల్ని అవకతవకలు పెట్టించడం బాగులేదు నేను పజిల్ సాల్వ్ చేసి యీ కారణంవలన పంపడం మానేశాను ఇకమీదట యిలాంటి "క్లూస్" యివ్వవద్దని శ్రీశ్రీగారిని కోరుతున్నాను

—ఎన్. లక్ష్మి, బొంబే-58.

శోభన్‌బాబు-జయసుధ ముఖచిత్రముతో వెలువడిన జ్యోతి మాసపత్రిక అత్యంత ఆకర్షణీయంగా ఉండి మమ్మల్నెంతో రంజింపజేసింది యద్దనపూడి సులోచనారాణిగారి "ప్రేమసింహాసనం" సీరియల్ చదివినకొద్దీ

చదవాలనిపించేటట్టుగా ఉంటోంది. క్యాంపు, అంతర్గతం, మనసు చెప్పిన కథ కథలు మమ్మ ల్నెంతో ఆనందపరిచాయి "జీవనయాత్రలో స్త్రీ" నవల చాల ఇంటరెసుగా ఉంది రచించిన డి విద్యేశ్వరిగార్కి మా అభినందనలు

—వల్లని సత్యనారాయణ, గోదావరిఖని

గౌరవనీయులైన సంపాదకులకి సెప్టెంబరు నెల జ్యోతి చదివిన తరువాత ఈ ఉత్తరం వ్రాయకుండ వుండలేకపోయాను. "జ్యోతి" మాస పత్రికంటే నా దృష్టిలో 16 అణాలు+4 పైసల తెలుగు పత్రిక అటువంటి పత్రికలో "మనసు చెప్పిన కథ" లాంటి తెలుగాంగ్ల (తెలుగు+ఇంగ్లీషు) కథ చదివి ఆశ్చర్య పోయాను(ము) ఆ కథలో ప్రతి నాలుగు వాక్యాల తరువాత ఒక ఇంగ్లీషు వాక్యముంది అంటే రచయితకి ఇంగ్లీషు వచ్చుని మే మను కోవాలి, ఉదా "ఐవాంట్ మెంటల్ రిలీఫ్" రాసే బదులు నాకు మానసికంగా విశ్రాంతి కావాలంటే కథకో లోపం వస్తుందా? ఇక ముందు జ్యోతిలాంటి మంచి పత్రికలో ఇటు వంటి కథలని ప్రోత్సహించవద్దని నా (మా) మనవి మిగతా కథలలో "కమ్మని కథ" పేరుకు తగ్గట్లు కమ్మగా వుంది రచయితకు నా అభివందనలు "ఓటరు నవ్వని కారణం," "అంతర్గతం" కథలు బావున్నాయి. సీరియల్స్ రెండు ఒకదాని కొకటి పోటీపడుచున్నట్లు న్నాయి కథలు ప్రచురించేముందు శ్రద్ధగా పరి శీలించి ప్రచురించండి మయసభ జ్యోతికే ఒక ఆభరణం నాలుగు నెలల క్రితం జ్యోతి పత్రిక ఒక కొత్త తరహా పత్రికలాగా వచ్చింది. దాంట్లో ఒక డిటెక్టివ్ కథ వుంది ఎప్పుడు అలాగే ఒక ప్రత్యేకమైన పత్రికగా ప్రచురిస్తా రని ఆశిస్తున్నాము.

జి. విజయ్‌మోహన్‌రెడ్డి, ప్రకాశరెడ్డిపేట.

అఖిలభారత స్థాయిలో నాటక, నాటిక పోటీలు

పాలకొల్లు సంగీత నాటక అకాడమీ అఖిల భారత స్థాయిలో నాటక, నాటిక పోటీలను 1979 డిసెంబరు నెలలో జరుపుతూంది. నాటకములలో ఉత్తమ ప్రదర్శనకు రు 1500- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రు 800-లు నాటికలలో ఉత్తమ ప్రదర్శనకు రు 1000- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రు 500- నగదు బహుమతులును, ప్రదర్శించిన ప్రతి నాటకము నకు రు 400- నాటికకు రు 200- నగదు పారితోషికము నిర్ణయించబడినది దరఖాస్తు ఫారములు డి ఆంజనేయులు—అధ్యక్షులు- పాలకొల్లు సంగీత నాటక అకాడమీ పాలకొల్లు, ప గో జిల్లా—పిన్ 534 260 నుండి పొంద వచ్చును దరఖాస్తు ఫారములు అకాడమీకు చేరు ఆఖరు తేదీ 15-9-79.

—వంగా నరసింహారావు.
సెక్రటరీ

నెఫ్జా సంగీత నృత్య కళాపరిషత్తు

నెఫ్జా ఆధ్వర్యాన అక్టోబరు 13, 14 వ తేదీలలో అఖిల భారత స్థాయిలో కూచిపూడి భరతనాట్యం, రికార్డు డాన్సులలోను, లలిత సంగీత, సినిమా పాటలు, హిందీ సినిమా పాటలలోనూ పోటీలు నిర్వహించబడును. న్యాయనిర్ణేతలుగా సినీ నృత్య దర్శకులు, సినీ సంగీత దర్శకులు వ్యవహరింతురు వివరము లకు నెఫ్జా నాటక కళాపరిషత్తు, నియర్ లీలా మహల్, నెల్లూరు-524001 కు వ్రాసి తెలిసి కొనవచ్చును


చిన్న చిన్న కథల పోటీ

జ్యోతి నిర్వహిస్తున్న విద్యార్థులకు చిన్న చిన్న కథలపోటీలో ఎన్నికైన కథలను వచ్చే సంచికనుంచీ ప్రచురిస్తున్నాము.

—ఎడిటర్

పెంట్యాల నాగాంజనేయులు

మా ఉప్పాయిగాడి భక్తి!



తిండిపుష్టి, నిద్రపుష్టిగల మా ఉప్పాయిగాడు హఠాత్తుగా ఆ రెండూ మానేశాడు. సినిమాలు మానేశాడు, క్రికెట్ మానేశాడు, గెడ్డం, స్నానం, షోకులూ మానేశాడు. ప్రతి రోజూ ఎవరితోనో ఒకరితో దేవుడు లేడని వాదించేవాడు—అదీ మానేశాడు. శరీరం కేవలం కటిక నేలమీదా, దృష్టి దూలాలమీదా పారేసి 'ఇష్' అంటూ నిట్టూర్పులు మొదలెట్టాడు. ఉన్నట్టుండి యింత మార్పేమిటో నాకూ, మా శ్రీమతికీ ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు.

ఒకరోజు మెల్లిగా దగ్గిరికెళ్ళి "ఏమైందిరా?" అనడిగాను చాలాసేపటివరకూ సమాధానం లేదు. నా సతాయింపు ఎక్కువయ్యేసరికి 'కయ్' మంటూ లేచి,

"నన్ను విసిగించకండి! నేనేదో ఆలోచించుకుంటున్నాను" అంటూ కసురుకున్నాడు.

వాడు చదువుతున్నది బి ఏ, అందులోనూ లెక్కలు వాడి సబ్జక్టు బహుశా ఏ ప్రాబ్లెమో సాల్వ్ చెయ్యడానికి మథనపడ్తున్నాడని అర్థమైంది. బెంగపడ్తున్న మా శ్రీమతికి అదే మాట చెప్పి ఓదార్చి ఆ పూట నేనే వంట చేశాను

ఓ రోజు పుదయం వాడు లావేటరీకి వెళ్ళిన సమయంలో ఇల్లు ఊడుస్తున్న మా శ్రీమతికి వాడి పెట్టెలో జొరబడ్తున్న చిమ్మెటొకటి కనబడింది. పాపం! బిడ్డ బట్టలన్నీ కొట్టేస్తుందేమోనన్న భయంతో పెట్టె తెరిచింది గుడ్డలన్నీ తీసి కిందపెట్టింది. అడుగున చిమ్మెటతో బాటు రిజిష్టరు పోస్టులో వచ్చిన కవరొకటి కనబడింది చిమ్మెటనొదిలేసి "ఇదేమిటండీ?" అంటూ ఆ కవరు నా చేతిలో పెట్టింది

ఆశ్చర్యంతో ఆత్రంగా విప్పి చూశాను.

యూనివర్శిటీ వాళ్ళు ఉప్పాయిగాడికి వ్రాసిన దబాయింపు వుత్తరం! పోయిన ఏప్రిల్లో జరిగిన యూనివర్సిటీ పరీక్షల్లో వాడి ఆన్సరుపేపరు, మరొకడి ఆన్సరుపేపరు మక్కీకి మక్కీగా వున్నాయట సంజాయిషీ అడిగారు వాళ్ళు! పది రోజుల్లోగా సంతృప్తికరమైన సమాధానం రాకపోతే డొక్క చింపేస్తామన్నారు!

"అమ్మ దొంగవెధవా! ఇదా నీ ఆలోచన!!" అనుకుంటూండగానే ఉప్పాయిగాడొచ్చాడు.

నేనూ మా యావిడ కూడా రకరకాల తిట్లు పిండివంటలూ చేసిపెట్టాం కిక్కురుమనకుండా అన్నీ తినేశాడు.

"సమాధానం రాశావురా?" అనడిగాడు.

"లేదు" అన్నాడు.

నా మేధాశక్తినంతా ఉపయోగించి, జాగ్రత్తగా ఆలోచించి యూనివర్సిటీ వాళ్ళకు సమాధానం రాయించాను.

"ఏమండీ! ఏం జరుగుతుందంటారు?" అంది మాయావిడ దిగులుగా.

"ఏముందీ! ఈ సమాధానం సంతృప్తిగా వుంటే క్షమించి, వార్నింగిచ్చి వదిలేస్తారు. లేకపోతే ఎడాది నుంచి మూడేళ్ళదాకా ఎక్కడా పరీక్షకు కూర్చునే యోగ్యతలేకుండా చేస్తారు" అన్నాన్నేను

ఆవిడకు బాధతోబాటు కోపమూ వచ్చింది. ఒక్కగానొక్క కొడుకు అనే విషయం కూడా మర్చిపోయి, "వెధవ చచ్చినాడా! కడుపూ నోరూ కట్టుకుని, అష్టకష్టాలూపడి చదువు చెప్పిస్తుంటే మాయరోగం వచ్చిందా నీకు! అసలు దైవభక్తి లేకపోబట్టే ఇంతనర్థం జరిగింది. పాపిష్టి వెధవా" అంటూ వాడి నెత్తిన మొట్టింది,

వాడిలో చైతన్యం లేదు బాధలేదు చూపులో మార్పులేదు.

ఆ మర్నాడుదయం నేను నిద్ర లేచేసరికి ఉప్పాయిగాడు లేడు. స్నానంచేసి సైకిలేసుకెళ్ళిపోయాట్ట! అడిగినా కూడా మా శ్రీమతితో చెప్పలేదట!

ఆలోచనలో పడ్డాన్నేను.

మాయావిడకు మాత్రం భయం.

"ఏమండీ! వీడేమన్నా అఘాయిత్యం చేస్తాడేమోనండీ!" అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"ఛఛ! అఘాయిత్యం చేసేవాడికి సైకిలెందుకే? పైగా స్నానంచేసి ఎందుకెళ్తాడు? చచ్చిపోవడానికి మడి కట్టుకోవాలా?" అంటూ ఆవిడ భయం కొట్టిపారేశాను.

ఇద్దరమూ రకరకాలుగా ఆలోచిస్తూ కూర్చున్నాం.

9 గంటల వేళొచ్చాడు వాడు!

ముఖాన విభూతి! నొసట కుంకుమబొట్టు!!

నాస్తికుడు ఆస్తికుడయ్యాడా?!!

మాయావిడకు నోట మాటరాలేదు.

ఏమైనా కామెంట్ చేస్తుందేమోనని, ఆవిణ్ణేమీ మాట్లాడొద్దని సంజ్ఞచేసి మెల్లిగా నేనే అడిగాను.

"ఎక్కడికెళ్ళావురా?" అని.

"మాంగాడు" అని క్లుప్తంగా సమాధానం!

ఈ 'మాంగాడు' అనే గ్రామం మద్రాసుకు పదిమైళ్ళ దూరంలో వుంది. అక్కడ 'కామాక్షి' అమ్మవారి దేవాలయముంది. వారంలో ఏదో ఒక రోజు నిర్ణయించుకుని ఆరువారాలపాటు వెళ్ళి దర్శనం చేసుకోవాలట! ఆమె చాలా సత్యమైన దేవతనీ, ఎంత జటిల సమస్యల్లో మునిగిపోతున్న వాళ్ళనైనా ఇట్టే ఒడ్డుకు చేర్చుతుందనీ రకరకాలుగా చెప్పుకుంటున్నారంతా. మా వాడి విషయంలో భయపడ్తున్న నాకూ, మాయావిడకు కూడా కొండంత ధైర్యం చిక్కింది—మావాడి చర్యవల్ల!

ఎంత ధైర్యంవున్నా కొంత మన ప్రయత్నం కూడా కావాలిగదా అని మావాణ్ని వెంటేసుకుని కనబడిన వాడికెల్లా దణ్ణంపెడ్తూ యూనివర్శిటీ చుట్టూ తిరగడం మొదలుపెట్టా. ఓ వారం తిరిగిన తర్వాత మా మొరాలకించడానికి ఒకాయన సిద్ధపడ్డాడు. విషయం వివరించి, నా శక్తి వంచన లేకుండా ఆయన చేతులు తడిపాను.

"ఓ నెల తర్వాత కనబడండి" అన్నాడాయన.

సరేనని సగం భారం ఆయన మీద కూడా వేసివచ్చేశాం.

ఉప్పాయిగాడు మరీ భక్తుడైపోయినట్లున్నాడు. నిరంతరం పెదాలు కదుల్చుతూ ధ్యానంలో మునిగిపోయాడు. ముఖాన విభూతి, కుంకుం చెరగనివ్వడంలేదు. భోజనం ఒంటిపూట కతికే నాల్గు మెతుకులూ ఉప్పూకారం లేకుండానే తింటున్నాడు. ఉల్లి, వెల్లుల్లి పూర్తిగా విసర్జించేశాడు. రాత్రులు కాస్త ఉప్పుడు పిండి, కొద్దిగా మజ్జిగ! కాలకృత్యాలు తీర్చుకున్న ప్రతిసారీ కాళ్ళు కడుక్కోవటంతో సరిపెట్టక ప్రతిసారీస్నానం చెయ్యడం మొదలుపెట్టాడు.

"కష్టాలలోగానిభగవంతుడు గుర్తుకురాడు" అని చెప్పడానికి మావాడి చరిత్ర ఒక నిదర్శన

మనిపించింది నాకు.

నెలరోజులూ గడిచాక నేనూ మావాడూ కలిసి యూనివర్సిటీకి వెళ్ళాం

ఇక మావాడికేమీ ఫర్వాలేదనీ, ఒడ్డున పడిపోయినట్లేననీ ధైర్యం చెప్పాడా ఆసామి. 'కానీ' అని నసగడం కూడా మొదలెట్టాడు

అర్థమైంది నాకు. ఈసారి మరికాస్త బాగానే తడిపి ఆయనతో మరింత ధైర్యం చెప్పించుకుని, వాణ్ని ఇంటికి పంపించి నేను వేరే పనిమీద వెళ్ళిపోయా

ఆ రాత్రి భోజనాల దగ్గర మాయావిడ చెప్పింది యూనివర్సిటీ నుంచి వచ్చిన దగ్గర్నుంచీ ఉప్పాయిగాడు చాలా హుషారుగా వున్నాడనీ, తెలుగు సినిమాపాటలు విన్నాడనీ, ఆ రోజునుంచే మొదలైన ఇండియాకి, వెస్టిండీస్ కి జరుగుతున్న క్రికెట్ మాచ్ కామెంటరీ విడవకుండా విన్నాడనీ, తర్వాత పెద్ద గొంతుతో 'పాండవోద్యోగ విజయాల్లో' పద్యాలు పాడాడనీ, పైపెచ్చు కర్ణాట కసంగీతం పాడాడని కూడా సాహసిస్తున్నాడనీ చెప్పింది

"అమ్మయ్య" అనుకుని, "మరి తిండి?" అనడిగాడు.

"అమ్మమ్మ! తిండి, నియమనిష్ఠల విషయంలో వెంట్రుకవాసి తేడా కూడా రానివ్వడం లేదండి! అమ్మవారివ్రతం యింకా పూర్తి కాలేదుగా?" అంది మాయావిడ

తర్వాత రెండురోజులు మావాడి దినచర్య జాగ్రత్తగా గమనించాను మాయావిడ చెప్పింది నిజమే!

మనసులోనే మూంగాడు తల్లికి వేయి దండాలు పెట్టాను

మూడోరోజు వుదయం ఏదో పనిమీద నెల్లూరు వెళ్ళి, నాల్గోరోజు చీకటిపడే వేళ తిరిగొచ్చాను

మా ఇంటికి ముప్ఫయి నలభయి గజాల దూరంలో వున్న ఓ చిన్నవంతెన దగ్గర మా ఉప్పాయిగాడూ, వాడి స్నేహితులూ కూర్చుని ఎందుకో గొల్లున నవ్వుతున్నారు పైగా మావాడు నున్నగా గుండు గీయించుకుని

వున్నాడు. అంటే?—ఉప్పాయిగాడు యూనివర్సిటీ వాళ్ళ చేతుల్లోనుంచి తప్పించుకోగలిగాడన్నమాట!

గబగబా ఇంట్లోకెళ్ళాను.

"ఏమే! ఉప్పాయిగాడు మాంచి హుషారుగా వున్నట్టున్నాడు. ఏమిటి కథ?" అనడిగాను ఉత్సాహంగా.

"అదేం కథో అదేం హుషారో నేను చెప్పలేను బాబూ! క్రికెట్ మ్యాచ్ కామెంటరీ వింటూండగా ఏదో కవరొచ్చింది అక్కణ్నించీ ఒకటే తిరణాలనుకోండి వీడి దుంపతెగ! నూతి పళ్ళెంలో కూర్చుని నూటెనిమిది బొక్కెన్ల నీళ్ళు స్నానం చేశాడు"

"అబ్బ!" అన్నాన్నేను ఆనందంగా.

"ఆఁ! నా బొంద తాడుతెగింది కావల్ను బొక్కెన నూతిలో తగలేశాడు."

"పోతేపోయిందిలేవే వెధవ తాడు! ఈసారి ఏకంగా ఇనపగొలుసే వేయిద్దాం సరేగాని యింకా ఏం చేశాడే!"

"మంచం విరగ్గొట్టాడు"

"ఎందుకూ?"

"దానిమీదెక్కి ఇంగ్లీషు పాటలూ ఇంగ్లీషు డాన్సులూనూ."

"శని విరగడయింది. ఎప్పటిదో మా తాతల నాటి మంచం! బయట పారేద్దామంటే వీలు కాకుండా వుంది పోతేపోయింది ఈ సారి ఇనప మంచం కొనేద్దాంలే! బెంగపడకు."

"అది సరేలెండి! సైకిలేసుకెళ్ళి రెండు టైర్లూ పగలకొట్టుకొచ్చాడు"

"ఆఁ అవి వరి చెత్తటైర్లు లెద్దూ"

"వెనక చక్రం అష్టవంకర్లూనూ"

"మనలాగే అది కూడా ఆనందం పట్టలేక అష్టవంకర్లూ తిరిగింది గావల్ను"

"రాత్రంతా నాకు నిద్దర్లేదండీ బాబు! ఒకటే సర్కసు చెయ్యడం."

"మాంగాడు తల్లి మహిమ!" అంటూ దణ్ణం పెట్టాను.

"వ్రతం పూర్తయిందిగా! ఇవాళ వాడి జిహ్వాచాపల్యం చూడాల్సింది మీరు అసలు నన్ను పొయ్యిదగ్గరకు రానీలేదండీ! వంటంతా వాడే దోసకాయపప్పు, వంకాయ కూర, మామిడికాయ పచ్చడి, గుమ్మడికాయ పులుసు ఉల్లిపాయల పకోడీలు అబ్బో ఏం చెప్పమంటారెండి"

"బాగా చేశాడే?" నోరూరుతుండగా అడిగాన్నేను

"బ్రహ్మాండంగా! నాకు సుఖపడేగీత లేదుగానీ, రేపు వచ్చే కోడలెవత్తో మహా సుఖపడిపోతుంది"

"ఊరికే వండడమేనా? సరిగ్గా తినగలిగాడా?"

"సుబ్బరంగా తిన్నాడు. నూరుగ్రాముల పచ్చిమిరపకాయలు, అరకిలో ఉల్లిపాయలూ కూడా కొరికేశాడు అన్నంలో" అంది మా శ్రీమతి మరింత హుషారుగా.

"శుభవార్తే గదా!" అని ఆత్రంగా అడిగాను.

"లేకపోతే యింత అల్లరెందుకూ వెధవ వాడంతటవాడే చెప్తాడేమోనని ఎంతసేపో ఎదురు చూశానండీ! చెప్పి చస్తేగా! వుండబట్టలేక నేనే నిన్నరాత్రి అడిగేశాను. "ఏరా! మాంగాడు కామాక్షి ఏం చేసిందీ?" అని అప్పుడు చెప్పాడు. 'సక్సెస్! గ్రాండ్ సక్సెస్ నిజంగా ఆవిడ చాలా సత్యమైన దేవత ' అంటూ ఆ దేవతను ఒకటే పొగడ్డం, ఇవాళే ఆఖరు రోజు గదా వెళ్ళడానికి! శుభ్రంగా ప్రొద్దునేలేచి వెళ్ళి ఆ తల్లికి నీళాలిచ్చేసి వచ్చాడు" అంది మాయావిడ.

"సరేగాని, ఇంతకీ ఆ కవరేదీ?" అనడిగాను.

"పెట్టెలోనే పెట్టాడనుకుంటా! వుండండి చారులో పోపెట్టి " అంటూ వంటింట్లోకి వెళ్ళిందావిడ.

ఎంతకీ మాయావిడ తెమిలి రాకపోయేసరికి నేనే ఆత్రంగా వాడి పెట్టెలోని కవరు తీసి చూశా!

నాకు దడ, నీరసం పట్టుకున్నాయి బ్లడ్ ప్రెషర్ కూడా వచ్చింది. వాడు ఇదివరకు రాసిన పరీక్షలు కాన్సిల్ చెయ్యడమే కాకుండా

నిన్ను హోటలుకు పిలిచింది నేను గదా! అందువల్ల - పిండి నేనేరుబ్బుతా !!




మరో సంవత్సరందాకా పరీక్షకూర్చోడానికి వీల్లేదని దాని సారాంశం.

కోపం పట్టలేక గబగబా వీధిలోకొచ్చాను.

మావాడు చేతులు తిప్పేస్తూ, పెద్ద గొంతుకతో హుషారుగా చెప్పేస్తున్నాడు.

"ఒరేయ్! కిందటిసారి మన ఇండియన్ క్రికెట్ టీం పాకిస్తాన్‌వాళ్ళ చేతుల్లో ఓడిపోయినప్పుడెంత బాధపడ్డానో తెలుసా? అసలు నేనెంత అవమానంగా ఫీలయ్యానో తెలుసా? వీధిలో తలెత్తుకు తిరగలేకపోయాను ఎలా ఈ అవమానం పోతుంది? ఈ సారి వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లోనైనా మన క్రికెట్ టీం గెలుస్తారా లేదా! మనవాళ్ళకి మళ్ళీ సక్సెస్ వచ్చేదెలా? ఇదే ఆలోచన నాకు! ఆ బాధలో ఎన్నో రోజులు అన్నాహారాలు మానేశాను. ఏ దిక్కూ తోచలేదు. జీవన్మరణ సమస్య ఎదురైంది. సడన్‌గా మా అమ్మ 'దైవభక్తి' అనే మాట సూచించింది. అయితే 'ఏ దైవం?' అనేది ప్రశ్న! తిరపతైతే చాలాదూరం! ఖర్చెక్కువ! శ్రమకూడా ఎక్కువే! తక్కువ ఖర్చులో ఎక్కువ ఫలితం కావాలి! అసలే పాపం మా నాన్న డబ్బుకు మహా ఇబ్బంది పడ్తున్నాడు కూడా! ఆ రాత్రంతా ఆలోచించా! మనసులో మాంగాడు తల్లి తళుక్కున మెరిసింది. వెంటనే ఆవిడకు మొక్కుకున్నా "తల్లీ! నాకేమీ అక్కర్లే. యూనివర్సిటీ గొడవ పరిష్కరించమని కోరడంలేదు! కాని, ఈ సారి వెస్టిండీస్‌తో జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లో మన భారతీయ జట్టుకు సంపూర్ణ విజయం చేకూర్చు! నాకు మనశ్శాంతి కలిగించు! భారతీయ దేవతవైనందుకు నీ దేశభక్తి చాటి చెప్పు" అని ఆ తల్లికి నా ఆవేదన అర్థమైంది నన్ను కటాక్షించింది. నిన్నటితో పూర్తయిన మ్యాచ్‌లో మనవాళ్ళే సంపూర్ణ విజయం సాధించారు. మాసిపోయిన నా మాన మర్యాదలు మళ్ళీ నేను పొందగలిగాను అందుకే ఇవాళ వుదయమే వెళ్ళి ఆ తల్లికి పీలాలు కూడా భక్తితో సమర్పించుకున్నా" అంటూ గుండు తడుముకున్నాడు.

నేను కుప్పలా కూలిపోయా! □



మయసభ

ఎలా పెట్టారోగాని ఆ చిరంజీవి తలిదండ్రులు అతగాడికి 'బాగయ్య' అని పేరు పెట్టారు నిజంగానే అతడు సార్థకనామధేయుడయి, "బాగాయె నయ్యా!" అన్పించేలా బ్రతకసాగాడు

చిన్నప్పుడే భారతం, భాగవతం, రామాయణం ఔపాసన పట్టిన బాగయ్య దుర్యోధనుడు, కీచకుడు, రావణుడు వగైరా 'కేరెక్టర్'లను చాల లోతుగా పరిశీలించాడు వాళ్ళ 'మేకప్'లో, వాళ్ళ ఎత్తుగడల్లో వున్న లోపాలను గమనించాడు. వాళ్లు చేసిన తప్పులు చేయకుండా వాళ్ళల్లా సార్వభౌముడై వెలగాలనుకున్నాడు వాళ్ళు చేసినవన్నీ చేసినా వాళ్ళలాంటి అపకీర్తి మాత్రం తనకు రాకుండా వుండాలని కట్టుదిట్టమైన ప్రణాళిక వేసుకున్నాడు కల్లు సీసా జేబులో వున్నా శంకరాచార్యులతో ఫొటో దిగడం తన 'ఇమేజి'కి పెట్టుబడి అని తెలుసుకున్నాడు నావికుడిలా రేవుకో ప్రియురాలున్నా అన్ని ఫంక్షన్లలోనూ భార్య అప్పల నరసాయమ్మతో కన్పడి, భారత నారీ గౌరవంమీద రెండు శ్లోకాలు పఠించినట్లయితే తనో యిరవయ్యో శతాబ్దపు శ్రీరామచంద్రుడిగా వెలిగి పోవచ్చని నిర్ణయించుకున్నాడు అవకాశంకోసం పొంచి కూచున్నాడు

కాలమే రంగంలో దించెన్నాయకుడిని!

అదో పెద్ద కంపెనీ. ఆరుకోట్ల షేర్లున్న పెద్ద కంపెనీ. షేర్లు కొన్నాడు బాగయ్య. కొన్నాళ్ళకు కంపెనీ డైరెక్టర్లను, ముఖ్యంగా మేనేజింగ్ డైరెక్టరును దుయ్యబట్టసాగాడు. పవర్ జనరేషన్ బాగాలేదన్నాడు షేర్ హోల్డర్ల వాటాలు సరిలేవన్నాడు పాలిసీ తప్పన్నాడు పోతన్ననూ, ఇక్బాల్‌నూ 'కోట్' చేసి షేర్ హోల్డర్ల చేత సెబాసన్పించుకున్నాడు

తన మాట వినకపోతే, తన పద్ధతులమీద నమ్మకం వున్న వాటాదార్లతో కలిసి వేరే పోటీ కంపెనీ పెడతానన్నాడు హోరాహోరి యుద్ధం చేశాడు ఊరి గోడలమీద నినాదాలేమిటి, బూతులేమిటి—అన్నీ రాయించాడు

ఆల్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్ కదా!

గెలిచాడు

అంత కంపెనీకి తానే మేనేజింగ్ డైరెక్టరయ్యాడు బాగయ్య కేపిటల్ పెరగడానికి 'సోషలిస్టు' వ్యవస్థ యిచ్చే అవకాశాలన్నీ సద్వినియోగం చేసుకోవడం ఆరంభించాడు సరికొత్త పద్ధతులను ప్రవేశపెట్టాడు మొదట నుండి తన్నాదుకున్న గ్రామదేవతకు ముడుపు కట్టాడు చేత మంత్రదండం ధరించాడు

ఏడు గుమ్మాల అంతఃపురంలో నవనవలాడే వనజాలున్న తోటలో సింహాసన

ఏ. రామసంజీవి

ఏర్పాటు చేసుకున్నాడు.

ర్ ర్ ర్

ఒక షేర్ హోల్డర్‌కు ఒక ప్రమాదం వచ్చి పడింది ఎం డి గారితో మొర పెట్టుకోవాలని హెడ్డాఫీసుకు వెళ్ళాడు "అయ్యో ఆయన కోరిల వున్నార్ గదా—" అన్నాడు భృత్యుడు

షేహో వెతికి వెతికి అంతఃపురం అడ్రెసు కనుక్కున్నాడు

కాని తలుపులు వేసివున్నాయి తలుపులకో పెద్ద తాళంకప్ప వేసివుంది ఆ ప్రక్కన ఒక నోటీసుంది

అందులో "తెరువరా! ఈ మూల వున్న "మరిదేశ్వరస్వామి దేవాలయ పునరుద్ధరణ నిధి" హుండీలో 100 రూపాయలు వేయుము రసీదు పొందుము రసీదును పువ్వులవలె చుట్టి తాళంకప్పకో వుంచుము" అని వుంది

షేహో అచ్చం అలాగే చేశాడు ఆశ్చర్యం!

'అల్లావుద్దీన్—అద్భుత దీపం'లో వలె తాళంకప్ప, తలుపులు విడిపోయాయి

వందగజాలు ముందుకు సాగాడు షేహో! అక్కడొక పెద్ద ఏనుగులాటిది దారి కడ్డంగా పడుకుని వుంది ఆ ఏనుగును దాటనిదే, ముందుకు వెళ్ళడం పడదు 'ఎం చెయ్యాలి?' అన్న సందిగ్ధంలో పడ్డ షేహో ఒక చెట్టుకు చేరగిలబడ్డాడు వెంటనే చెట్టుమీదవున్న లౌడ్ స్పీకర్ నుండి ఇట్లా విన్పించింది

"ఓయీ భారతీయుడా! వన్య ప్రాణరక్షణ అన్నది నీ విధి, దానికోసమే ఈ నిధి నూట పదహార్లకన్న తక్కువ తీసకోనంటాడీ కరిరాజు! కనుక నూటపదహారు రూపాయి నాణాలను అతడి ముందు పడవేయి! ముందుకు సాగిపో!"

షేహో ప్రపంచం పోకడలు తెలిసినవాడు గనుక, అన్నిటికీ సిద్ధమై వచ్చాడు ఆ నాణాలు పడిగానే అంత ఏనుగూ క్రిందికి దిగిపోయి తనకు దారి ఎర్పడడం చూచి సంతోషించాడు. "బొరా టెక్నాలజీ" అనుకున్నాడు

మూడవ గుమ్మందగ్గర కొచ్చాడు అక్కడ ఘోరున వాన పడుతూంది మెరుపులు, ఉరుములు, లక్షలాది ప్రజల హాహాకారాలు! చాల చక్కటి 'రూపవాణి'—లేదా 'సా—యే లూమియర్ కార్యక్రమంలా వాస్తవికత ఉట్టి పడుతూంది వోరి యీ తుఫానుసీమ దాటడం ఎట్లా?

పదిహేను నిముషాలకోసారి ఈ దృశ్యమంతా ఆగిపోగా ఒక టెలివిజన్ స్క్రీన్ లాటిది రావడం గమనించాడు అందులో ఎడమ చేతి పై మూల మందహాసంతో ఎం డి గారున్నారు ఆయన అంటారు కదా—

"చూశారా, ఈ తుపాను రక్కసి విలయ తాండవం, లక్షలాది జనులు నిరాశ్రయులయ్యారు! వారికి సాయం చేద్దాం రండి! తలొక వెయ్యి తెండి" ఆ దృశ్యం మాయం అవగానే మళ్ళీ తుఫాను చప్పుడు. షేహో జాగ్రత్తగా చూస్తే హుండీ కన్పించింది అందులోకి వెయ్యి పడెయ్యగానే వాన రక్కున ఆగింది. ముందు దారి కన్పించింది.

పావు కిలోమీటర్ తర్వాత "అంతర్జాతీయ బాలల సంవత్సరం" గుమ్మం ఎదురయింది. అక్కడ కిలకిల లాడే షోకిల్లా పిల్ల కూచుంది "బాలలు కూడా మన భవితవ్యమే" అన్న నినాదం క్రింద కూచుంది ఆమె

"పేరేవిటండీ?" అంది రసీదు పుస్తకం తీస్తూ

"ఎంత తల్లీ ?" అని పృచ్ఛించెను షేహో

"రెండు" అంది బాల కొంటెగా.

సూక్ష్మం తెలిసిన షేహో రెండువేలు చెల్లించి రసీదుకోసం చేయి జాస్తే ఆ బాల నవ్వింది.

"ఇది పోస్టులో పంపిస్తాము. అదుగో అయిదో వాకిలికి దారి తీసే కాలి బాట " అంది

ముందుకు సాగాడు విక్రమార్కుడు లాటి షేహో

ఒక బోయింగ్ విమానం అడ్డొచ్చింది. అంటే దారి కడ్డంగా ఒక బోయింగ్ విమానం లాటిది వుంది ఈపాటికే యీ దారిమొక్క కష్టసుఖాల నాకళింపు చేసుకున్న షేహోకి

'ఎక్కడ అడ్డంకి వున్నదో అదియే ఒక ద్వారము' అన్న జైన్ బౌద్ధ సూత్రం లాంటిది బాగా కరతలామలక మయింది చేత నున్న తోలుసంచిని దించాడు.

"ఎందుకు?" అని అడగదలచుకోలేదు అది అప్రస్తుతం కదా: "ఎంత?"అని మాత్రమే అను కున్నాడు అంతే ఆ ఆలోచనా తరంగం తాలూకు విద్యుత్తు వెళ్ళి ఒక మీటను తాకింది ఆ విమానానికి వున్న ఎన్నో కిటికీలలో ఒకటి తెరుచుకుంది దానిలోంచి ఒక 'హవాయి సుందరి' పలికింది

"చూడండి! మన దేశంలో చాలమంది బీద వారు విమాన ప్రయాణాలు చేస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు బ్రీఫ్ కేసుల్లో పెట్టి సీట్లక్రింద మరిచి కిందకు దూకి వెళ్ళిపోతుం టారు. తర్వాత వాపోతుంటారు. ఇట్లా ప్రమాదాలకు గురయిన అమాయకులను రక్షించడం మనందరి బాధ్యతంటారా కాదా? చెప్పండి ప్లీజ్!" అని ప్రాధేయ పడింది "ఇది ఫ్లయిట్ నెంబర్ ఆరువేల మూడు!" అని అనౌన్స్‌మెంట్ ముగించింది

ఆరువేల మూడురూపాయలను లెక్క పెట్టాడు షేహో. ఆ పక్క కిటికీలో ఒక దీపం వెల్గింది, "ఇక్కడ చెల్లించు" అన్న అక్షరాలు వెలిగాయి చెల్లించాడు

బోయింగ్ విమానం పక్కకు జరిగింది. "ప్లీజ్ బి గోయింగ్" — అని సూచన విన్పించింది,

"థాంక్స్!" అన్నాడు చకచక నడిచాడు షేహో.

ఆరో గుమ్మందగ్గర ఉప్పెన అడ్డొచ్చింది సౌండ్ ఎఫెక్ట్స్ బ్రహ్మాండంగా గుండెలాగి పోయేలా వున్నాయి అబాలగోపాలం, వాళ్ళ పిల్లలూ వగైరా ఆక్రందనలన్నీ స్టీరియోలో దీనా౽ దీనంగా విన్పిస్తున్నాయి.

"అన్యాయానికయినా ఒక పద్ధతివుండొద్దూ? లేకపోతే మళ్ళీ రెండోసారి తుఫానేమిటీ? మరీ బొత్తిగా అయిడియాలక్కరువయిన ట్లుంది దేశంలో—" అని జనాంతికంగా విసు క్కున్నాడు షేహో.

"అపరాధం చిట్టితండ్రీ, అపరాధం!లెంపలు వేసుకోమ్మా ఈ తోటలో చెట్లకు చెవులుం టాయి. రాళ్ళకు నోళ్లుంటాయి తలుపులకు చేతులుంటాయి.అయినా తుఫానులన్నవి ప్రకృతి సిద్ధంగా వస్తుంటాయి ఏడాది కెన్నిసార్లు రావాలో వాటి కెవరు చెప్పగలరు? అంతా'వాడి' లీల" అంటుండగానే—"పరేనండీ లీలగారూ? అపరాధం జరిగిపోయింది! ఇదుగో నా సంచి కావలసింది తీసుకుని దారి చూపించండి-" అన్నాడు షేహో.

"అమ్మమ్మ! మాకూ మడీ ఆచారం వుంది శిష్టాచార సంపన్నులం అలా ఒకళ్ళ సంచులూ అవీ ముట్టుకుంటామా? ఇది ఆరో గుమ్మం అంతకన్నా నీవంటి జ్ఞాననిధికి చెప్పాల్సిందేముంది?" అంది 'లీలా' మాత్ర మైన ఆ వాణి

ఆరువేలు సమర్పించి గుమ్మం దాటాక ఏడో గుమ్మందగ్గర ఖాదీ కబంధుడు కూర్చొని రాట్నం వడుకుతున్నాడు. అతడివెనకా ఎత్తైన గోడ వుంది దాని కెక్కడా తలుపులు లేవు.

"ఇదేవి టబ్బా ఇంత అభేద్యంగా వుంది" అని అంత షేర్‌హోల్డరూ నీరు గారిపోయాడు.

"హరే గాంధి! హరే నెహ్రూ! ఏం కావా లండి? ట్రాన్స్‌ఫరా? వాటాలా? షేర్లు కొనాలా? రిటైల్ కౌంటర్ తెరవడానికి లైసెన్సా? వాట్ ఈజ్ యువర్ బిజినెస్? ఇదుగో రేటు లిస్టు పుస్తకం దీనిలో చూడండి అన్నీ వివరంగా ఉంటాయి ఇది డీలక్స్ ఎడిషన్ ఒక్క ప్రతి వెల పదివేలు మాత్రమే జంక కండి! ఇది చదివితే రూపాయికి పది రూపా యలు వస్తాయని గ్యారంటీ! హరే గాంధీ! హరే నెహ్రూ!" అన్నాడు ఖాదీ కబంధుడు

"సార్! ఇక్కడ పెట్రోలు దొరుకు తుందా?" అని అడిగాడు షేహో


"ఎందుకు?" అని అడిగాడు ఖాక

"నా దగ్గర అగ్గిపెట్టె వుంది లెండి—" అన్నాడు షేహో అతని కళ్ళే అగ్గిపెట్టె లయ్యాయి. చూపులే అగ్గిపుల్ల లయ్యాయి.

ఇంక ఇంక ??? □

సీరియల్

ప్రేమ సింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

13

స్వప్న-సుధీర్ ముఖాముఖీ ఎదురెదురుపడి మాట్లాడే సమయాలు ఎక్కువ లేనిమాట నిజమే। కానీ ఒకరి ఆలోచనల్లో మరొకరు వుండటం తరచుగా జరుగుతూ వుండేది।

సిటీలో ఎప్పుడూ, ఏదో ఒక విధమైన వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతూనే వుంటాయి। సుధీర్‌కి చాలా వాటితో పరిచయం వుండేది। అక్కడ జరిగే ప్రోగ్రామ్స్‌కి తనకి వచ్చిన ఇన్విటేషన్స్ స్వప్నకి పంపేవాడు. స్వప్నకి వెళ్ళాలని వున్నా ఒంటరిగా వెళ్ళటం సమస్య అయేది। సాధారణంగా మరియం హాస్పిటల్ వర్క్‌తోనే బిజీగా వుంటుంది। మిగతా సమయాల్లో చర్చికి సంబంధించిన కార్యక్రమాలు విరివిగా వుంటాయి। ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూంటారు। ఆదివారం వస్తే చాలు। క్రిష్టియన్ పిల్లలందరూ ఆ యింటికి వస్తారు। మరియం వారితో దైవ ప్రార్థనలు భజనలు చేయిస్తుంది। ఆ తర్వాత. వాళ్ళందరినీ తీసుకుని చర్చికి వెడుతుంది। స్వప్న ఒంటరిగా, యింట్లో మిగిలిపోయేది।

సుధీర్ టైపిస్ట్ శంకు, పుస్తకాలు తీసుకుని తరచుగా ఆ యింటికి వచ్చేవాడు। మరియమ్ లేకపోతే శంకు కొద్దిసేపు కూర్చుని కబుర్లు చెప్పి నవ్వించేవాడు। శంకు చెప్పే ఆ కబుర్ల ద్వారానే, స్వప్నకి సుధీర్ కోర్టుల్లో కేసులు గెలవటంలో ఎంత

ప్రతిభావంతుడో, తల్లికి ఎంత గారాలపుత్రుడో, మేనమామకి ఎంత అపురూపమో అర్థంకాసాగినాయ్। విమల అతనికి కాబోయే భార్య అని, త్వరలోనే వారిద్దరికీ వివాహం అవుతుందని తెలిసింది।

మరియం ఆదివారాల్లో చర్చికి వెళ్ళిపోతే శంకు స్వప్నని ఏ సినిమాకో, మ్యాజిక్ షోకో, సంగీత సభకో తీసుకువెళ్ళటానికి హాజరయేవాడు

సుధీర్ యీ మధ్య డ్రైవర్‌ని పెట్టుకున్నాడు చాలాసార్లు సుధీర్ స్వప్న వెళ్ళటానికి కారు యిచ్చి శంకుని పంపేవాడు। డ్రైవర్ వాళ్ళని వెళ్ళాలి అనుకున్న చోట దింపేసి వెళ్ళిపోయేవాడు. మళ్ళీ సినిమా అయిపోయి. స్వప్న హాలుపైటకి వచ్చేసరికి, కారు అక్కడ వేచి వుండేది।

ఒకసారి శంకు వస్తూ వెంట మోయలేనట్లుగా మోస్తూ పాకెట్ ఒకటి తీసుకు వచ్చాడు. స్వప్న అలవాటు ప్రకారం ఆ పుస్తకాల పాకెట్‌ని ఆత్రంగా విప్పి చూసింది. కానీ అవి పత్రికలు కావు. బి ఎ పరీక్షకి చదవటానికి కావాల్సిన పుస్తకాలు, టెస్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, గైడ్స్ అన్నీ వున్నాయి। అవి క్షుణ్ణంగా ఏకాగ్రతగా చదివితే చాలు। వేరే టీచర్ అవసరం లేదు.

శంకు పరీక్ష ఫీజు కట్టాల్సిన ఫారాలు తీసి ఆమె ముందు పరిచి 'ఊ। సంతకం పెట్టండి' అన్నాడు స్వప్న సంతకం పెట్టింది. జేబులో నుంచి ఒక కవరు తీసి యిచ్చాడు. స్వప్న ఆతురతగా ఆ కవరు చింపి అందులో వుత్తరం తీసి చదివింది. అందులో యిలా వుంది: "స్వప్నా। మీరున్న యింటికి మూడో యిల్లు నా క్లయింట్ బావమరిదిది। ఆయన రెండో కూతురు కోమలి బి. ఎ ప్రయివేట్‌గా చదువుతోంది। నేను ఆయనతో మాట్లాడాను। కోమలి నీ దగ్గరకి వచ్చి పరిచయం చేసుకుంటుంది। వీలయితే యిద్దరూ కలిసి చదువుకోండి। నువ్వు ఒక్క క్షణంకూడా ఒంటరిదాన్ని అనే భావన రాకుండా వుండటానికి యీ పని చేస్తున్నాను. నా మన సేమిటో నీకు అర్థం అవుతుందనే ఆశిస్తున్నాను.

—సుధీర్."

ఆ వుత్తరం చదువుతుంటే స్వప్న కళ్ళు చెమ్మగిల్లినాయి.

శంకు వెళ్ళిపోయిన తర్వాత కూడా చాలాసేపు మంచంమీద పడుకుని, ఆ వుత్తరాన్ని చదివింది మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లు చదివినా తనివితీరటంలేదు। స్వప్న మనసులో ఎల్లవేళలా ముసురుకుని వుండే విషాదఛాయలు, తెలిమబ్బుల్లా తేలిపో సాగినాయి। సుధీర్ లేకపోయినట్టయితే తన జీవితం ఎలా వుండేది। అతను తనకి ఎంత సాయం చేస్తున్నాడు। ఏమిస్తే అతని ఋణం తీరుతుంది। స్వప్నకి కళ్ళలో గిఱ్ఱున నీళ్ళు వూరినాయి। సుధీర్ తన దగ్గరగా లేని మాట నిజమే। అతను నెలకో, పదిహేను రోజులకో పదినిముషాలు వచ్చి వెళ్తాడు నిజమే। కానీ - కానీ - అతను

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందును సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్ మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదే[illegible] సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామ[illegible] వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్టు గలి[illegible] సుధీర్.

తన దగ్గరగా, తనకి, తోడూ, నీడగ వున్నంత నిశ్చింత।

మర్నాడు కోమలి వచ్చి పరిచయం చేసుకుంది। ఇద్దరి గ్రూపూ ఒకటే। 'ఎప్పుడైనా మా యింటికి రండి' అంటూ పిలిచింది.

స్వప్నకి ఎంతో సంతోషం వేసింది। ఇద్దరూ దాదాపు ఒకటే వయసు అవటంతో, త్వరలోనే స్నేహితులయిపోయారు।

స్వప్న ఎప్పుడైనా, అక్కడికి చదువుకోవటానికి వెళ్ళేది।

స్వప్నకి చదువులో లీనమైనకొద్దీ శక్తి, వుత్సాహం వచ్చినట్టయింది.

ఒకసారి సుధీర్ శంకుచేత చీటీ వ్రాసి పంపాడు.

"స్వప్నా। బాగా చదువుకుంటున్నావా। నాకు రావటానికే తీరిక చిక్కలేదు. నువ్వు బాగా వున్నావు కదా।

—సుధీర్."

స్వప్న జవాబు పంపింది. "నేను చాలా బాగున్నాను। బాగా చదువుకుంటు

న్నాను. త్వరగా చదువుకుని, పరీక్షలు పాసయి, ఉద్యోగం సంపాయించి, మీ ఋణం తీర్చుకోవాలని అనిపిస్తోంది

—స్వప్న."

సుధీర్ ఆ చీటీ చూసి నవ్వుకున్నాడు. అతను తర్వాతి వుత్తరం శంకుచేత పంపలేదు. పోస్ట్‌లోనే వేసాడు.

స్వప్న పోస్ట్‌మన్ వుత్తరం తెచ్చియిస్తే, నాకు వ్రాసే నాధుడెవరా అని ఆశ్చర్యపోతూ కవరు చించింది. అది సుధీర్ వ్రాసిన వుత్తరం "స్వప్నా! నువ్వు ఎన్నటికీ తీర్చలేనంతగా ఋణపడేట్టు సాయంచేయాలని వుంది

—సుధీర్."

స్వప్న నవ్వుకుంది! రోజులు యిట్టే గడిచిపోతున్నాయి!

మరియం హాస్పిటల్‌కి వెళ్ళగానే కోమలి వస్తుంది! ఇద్దరూ చదువులో పడ్డారంటే, కాలమే యిక తెలియదు!

ఆ రోజు - సుధీర్ వచ్చాడు. అతను వచ్చేసరికి మరియం యింట్లోనే వుంది! తలుపులు తీసే వున్నాయి! అతను సరాసరి యింట్లోకి వచ్చి, గదిలో అడుగుపెట్టి ఎంతసేపయిందీ స్వప్నకి తెలియనే తెలియదు!

మంచంమీద కోమలి పక్కన కూర్చుని, హిస్టరీ చదివి కోమలికి చెప్పటంలో మునిగిపోయిన తను, మధ్యలో ఎందుకో తలెత్తి చూస్తే, కోమలి పయిట చెంగు నోటికి అడ్డంపెట్టుకుని నవ్వు ఆపుకుంటూ చూస్తోంది!

స్వప్న చెప్పటం ఆపి ప్రశ్నార్థకంగా చూపింది!

కోమలి చూపులు గుమ్మంవైపు రెపరెపలాడుతున్నట్టు చూస్తున్నాయి!

"ఏమిటి?"—స్వప్న చిరుకోపంగా వెనక్కి తిరిగింది వెంటనే నిర్విణ్ణురాలయింది!


అక్కడ సుధీర్ నిలబడి ముగ్ధుడైనట్టు చూస్తున్నాడు.

పక్కన మరియమ్ నిలబడి వుంది. అలవాటుగా తల పక్కకు వాల్చి చూస్తోంది!

సుధీర్‌ని చూడగానే స్వప్న పెదవులు క్షణంసేపు ఆశ్చర్యంగా విడివడినాయి. మరునిముషమే కళ్ళు ఆనందంతో తళుక్కుమన్నాయి! కానీ అంతలోనే అది నిగ్రహించుకొంటూ చటుక్కున లేచి నిలబడి, "సారీ! నేను నేను మిమ్మల్ని చూడలేదు" అంది

"స్వప్న లెక్చరర్‌గా బాగా పనికివస్తుంది కదూ సర్?" అంది మరియమ్ నవ్వుతూ.

అతను అంగీకరిస్తున్నట్టు తల వూపాడు.



"కూర్చోండి సర్." మరియమ్ కుర్చీ లాగింది. "నేను యిప్పుడే మీకు టీ తెస్తాను." అని లోపలకి వెళ్ళింది.

సుధీర్ కూర్చున్నాడు.

స్వప్న కూర్చోలేదు. పుస్తకం రెండు చేతులతో గట్టిగా పట్టుకుని, గుండెలకి ఆనించుకుని అలాగే చూస్తోంది.

"చదువు బాగానే సాగుతోందని తెలుస్తోంది నాకు." అతను చిరునవ్వుతో అన్నాడు.

స్వప్న తల వూపింది. పుస్తకం మంచంమీద పడేసి, చటుక్కున పనివున్న దానిలా, వేగంగా, లోపలకి వెళ్ళిపోయింది.

రెండు నిముషాల తర్వాత మరియమ్ చేతులు తుడుచుకుంటూ వచ్చింది. "చూసారా! స్వప్న నన్ను టీ కలపనీయలేదు తనే కలుపుతుందిట." అంది మంచం మీద కూర్చుంటూ

సుధీర్‌కి ఆ మాట సంతోషం కలిగించింది. కానీ నిరుత్సాహంగా కూడా అనిపించింది. అతను స్వప్న కోసం వచ్చాడు. ఇలా వీలుకల్పించుకుని రావాలంటే. అతను ఎంత కారణం వెతుక్కుని టైమ్ సంపాయించుకుని రావాలి. ఈ కాస్త వ్యవధిలో స్వప్న అతనికి ఎదురుగా వుండకుండా, లోపలకి వెళ్ళటం బాగాలేదు. కానీ, తన మనసు స్వప్నకి తెలియదు. తెలియచేసే అవకాశం తనకి లేదు.

కోమలిని అతను చదువుగురించి ప్రశ్నలు వేసాడు.

స్వప్న, ఆ అమ్మాయి కలిసి, చదువుమీద ఏకాగ్రత పెంచుకున్నట్టుగా అతనికి అర్థమైంది.

"ఏదో మీ దయవల్ల యీ పరీక్ష పాసయితే, స్వప్నకి ఏదో ఒక వుద్యోగం దొరుకుతుంది। తన జీవితానికి ఒక ఆధారం ఏర్పడుతుంది" అంటోంది మరియమ్. తర్వాత - మరియమ్, అతను డాక్టరుగారిని గురించిన సంభాషణలో పడ్డారు. సుధీర్ మాటలమధ్య స్వప్న చదువుతూ మంచంమీద పడేసి వెళ్ళిన హిస్టరీ బుక్ చేతుల్లోకి తీసుకున్నాడు. మరియమ్ డాక్టరుగారు యింకోచోట క్లినిక్ తెరవాలనుకుంటున్న సంగతి చెబుతోంది। అతను వింటూ, యథాలాపంగా, ఆ పుస్తకం పేజీలు తిరగ వేసాడు। దాని కవరుమీద స్వప్న అని పేరు వుంది। కానీ, లోపల పేజీల్లో, చాలా వాటిమీద సుధీర్, సుధీర్, సుధీర్ అంటూ, ఇంగ్లీషులో, తెలుగులో, హిందీలో వుంది।

స్వప్న దస్తూరితో వ్రాసివున్న తనపేరు చూడగానే అతనికి, అది ఎన్నడూ లేనంత అందంగా అనిపించింది. ఆ పేరు మాటిమాటికీ, పేజి, పేజీలో చూస్తున్న కొద్దీ అతని మనసంతా అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోయింది।

పుస్తకం పై కవరుమీద మాత్రం. ఆ పుస్తకంయొక్క యజమాని ఎవరో తెలియచేస్తున్నట్టుగా స్వప్న అనివుంది। లోపల పేజీల్లో చాలాచోట్ల సుధీర్ అని వుంది। అంటే, స్వప్న గుండెల్లో సుధీర్ వున్నట్టా।

ఇంతలో పాదాల అలికిడి అయింది। అతను గభాల్న పుస్తకం మూసేసి మంచంమీద యథాస్థానంలో వుంచేశాడు –

స్వప్న టీ తెచ్చింది।

మరియం యింకా, డాక్టర్‌గారి క్లినిక్‌గురించి ఏదో చెబుతూనే వుంది। కానీ, ఆ మాటలేవీ అతని చెవికి ఎక్కటంలేదు।

దగ్గరకు వచ్చి టీ అందిస్తున్న స్వప్న కళ్ళలోకి క్షణంసేపు తదేకంగా చూశాడు.

"థ్యాంక్‌యూ।" అన్నాడు.

స్వప్న నవ్వింది.

"మీరు టీ తీసుకోకుండానే చెప్పేస్తున్నారే।" అంది.


అతనుకూడా నవ్వాడు।

అందరూ తాగుతుండగా మరియమ్ కోసం ఎవరో వస్తే 'యిప్పుడే వస్తాను' అంటూ లేచి వెళ్ళింది కోమలికూడా 'పని వుంది' అని చెప్పి వెళ్ళిపోయింది.

గదిలో యిద్దరూ ఒంటరిగా మిగిలారు.

స్వప్న మంచం దగ్గర క్రిందకి చూస్తూ నిలబడి వుంది.

సుధీర్‌కి స్వప్నని చెయిపట్టి లాగి తన ఒడిలో కూర్చోపెట్టుకుని, ఆ హిస్టరీ



బుక్ తీసి తన పేరు చూపించి 'దీని అర్థం ఏమిటి?' అని అడగాలని ఎంతగానో అనిపించింది. కానీ, ఏదో శక్తి అడ్డుపడుతున్నట్లుగా అతను ఆ పనిచేయలేక పోతున్నాడు.

"నువ్వు ఏ టైములో కోమలి యింటికి వెళ్తావు?" అతనడిగాడు.

"మరియమ్ క్లినిక్ నుంచి వచ్చిన తర్వాత-మధ్యాహ్నం 1 గం. 2 గం మధ్య"

అతను విని వూరుకున్నాడు

ఇంతలో మరియం తిరిగి వచ్చింది. 'చందాల వాళ్ళు చంపేస్తున్నారంటే నమ్మండి.'" అంది

సుధీర్ ఆ తర్వాత ఎక్కువసేపు కూర్చోలేదు. వెళ్ళటానికి లేచాడు మరియం వాకిటివరకూ వచ్చి సాగనంపింది. స్వప్న గుమ్మంలో నిలబడింది. సుధీర్ కారులో కూర్చుని స్టార్ట్ చేయబోతూ స్వప్నవైపు చూసాడు. మళ్ళీ అతనిలో అదే భావం. స్వప్నని చేయిపట్టి లాక్కువచ్చి, కారులో కూర్చోబెట్టి ఎక్కడికైనా తీసుకెళ్ళాలి అని కానీ అది సంభవమా? ఏమో? కాలమే చెప్పాలి. మొన్న ఘర్షణ జరిగినప్పటినుంచీ మామయ్య తనమీద నిఘా యింకా కట్టుదిట్టంచేసాడు.

అతను జాగ్రత్తగా వుండటంకోసమే నెల రోజులయినా స్వప్నని చూడటానికి రాలేదు.

మర్నాడు స్వప్న మధ్యాహ్నం వేళ కోమలి యింట్లో కూర్చుని చదువుకుంటూంది. ఇద్దరూ మిగతా ప్రపంచం అంతా మర్చిపోయినట్లుగా చదువులో లీనమై పోయారు.

ఇంతలో ఫోన్ మోగింది కోమలి వెళ్ళి తీసింది. వెంటనే వెనక్కి తిరిగి 'స్వప్నా! నీకే సుధీర్ చేసారు' అంది.

స్వప్న కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి

"నాకా" అంది.

"ఊ! నీకే! త్వరగా మాట్లాడిరా! ఏం పనో ఏమిటో" అంది.

స్వప్న లేచి వెళ్ళింది. రిసీవర్ తీసుకుని, 'హలో' అంది.

"హలో స్వప్నా! నేను సుధీర్‌ని మాట్లాడుతున్నాను."

స్వప్నకి ఎంతో సంతోషంగా వుంది. కానీ ఏం మాట్లాడాలో తోచలేదు!

"ఎలా వున్నావు!" అతనడిగాడు.

"బాగున్నాను!"

"ఎందుకు ఫోన్ చేశానో తెలుసునా?"

"ఎందుకు?"

"నీకు ఒకమాట చెప్పటానికి"

"ఏమిటది!"

"నేను నీకు ఎప్పుడూ గుర్తుంటాను అని తెలిసిన క్షణంనుంచీ చాలా సంతోషంగా వుంది"

"ఎవరు చెప్పారు" ఆశ్చర్యంగా అడిగింది.

"నీ హిస్టరీ బుక్. అందులో పేజి పేజీమీద వున్న నా పేరు చెప్పింది."

"మైగాడ్!"

"నా సంతోషం నీకెలా చెప్పాలి."

స్వప్న మాట్లాడలేదు.

"సాయంత్రం వస్తున్నాను! నిన్ను నాతో బైటకి తీసుకువెళ్తాను. అప్పుడు చెబుతాను. సరేనా! ఏమిటి? మాట్లాడవేం?"

"సరే!" ఖంగారుగా అనేసింది.

"పెట్టేస్తున్నా!"

"సరే!"


"వుంటాను!"

"సరే!"

అతను నవ్వాడు. పెట్టేసాడు. స్వప్న స్వప్నావిష్టురాలిలా పుస్తకాలున్న టేబిల్ దగ్గరకు తిరిగి వచ్చింది! ఆ తర్వాత స్వప్నకి పుస్తకాలలో వున్న వాక్యాలు తలకి ఎక్కలేదు.

"నీ మనసు బాగా లేనట్లుంది. రేపు చదువుకుందాంలే!" అంది కోమలి పుస్తకాలు తీసేస్తూ.

స్వప్న నాలుగ్గంటల నుంచీ యెదురుచూస్తోంది సుధీర్ రాకకోసం! మనసంతా



కళ్ళుచేసుకుని ఎదురుచూస్తున్నట్లుగా వుంది! అతను అడిగిన దానికి ఏం జవాబు చెప్పాలో ఆలోచించుకొంది.

"మీరంటే నాకు యిష్టం. ఎందుకో చెప్పనా!" అంటూ మోహన్‌ని చంపిన కారణం, తల్లిపోవటం, ఆత్మహత్య చేసుకోబోవటం, పల్లెటూరు కెళ్ళడం, పెళ్ళినుంచి పారిపోవటం, వీటన్నిటినుంచి తప్పించుకోవటానికి అతను చేసిన సాయం గుర్తుకు వచ్చింది. అయిదు గంటలయింది! ఆరు గంటలు కొట్టింది గడియారం!

ఏడు! ఎనిమిది! తొమ్మిది!

సుధీర్ రానేలేదు!

హిస్టరీ బుక్ గుండెలకి ఆనించుకొని మంచంమీద పక్కకి ఒరిగి నిద్రపోతున్న స్వప్నని మరియం వచ్చి లేపింది 'ఏమిటా నిద్ర! చదువుతూ చదువుతూ, అలాగే నిద్రపోయినట్టున్నావు! లే, లేచి అన్నంతిని పడుకో!'

స్వప్న లేచి అన్నానికి వచ్చింది. అన్నం కెలుకుతూ కూర్చుంది సుధీర్ వస్తావని అనగానే తను అంత ఆనంద పడకుండా వుండాల్సింది. ఎప్పుడూ అత్యాశ దుఃఖానికి చేటు అని తల్లి చెబుతూవుండేది.

స్వప్న మంచంమీద పడుకుంది! సుధీర్‌మీద యిష్టం అతన్ని గురించిన తీయటి వూహల్లోకి తోస్తుంటే స్వప్నలో వున్న విచక్షణాజ్ఞానం, పగటికలలు కంటున్నావు సుమా అని హెచ్చరిస్తున్నట్లుగా వుంది

మర్నాడు శంకు వుత్తరం తెచ్చాడు. "సారీ స్వప్నా! రాలేకపోయాను! ఏమీ అనుకోకు! సుధీర్."

ఆ వుత్తరంలో మళ్ళీ యెప్పుడతను వస్తాడో లేకపోవటంచూసి స్వప్నకి నిరుత్సాహం కలిగింది! ఈసారి అతను వచ్చి నా యెదురుగా నిలబడినా 'నేనేమీ ఆనంద పడను' అనుకుంది.

(సశేషం)

నీవూ - నేనూ

నీవు ప్రకృతివైతే, నేను నీ కృతిని
నీ చిత్రసృష్టికి, ప్రతీకనైన ఆకృతిని
నీ వడిలో పొరాడుతూ, ఆడుతూ, ఆడుతూ,
యిన్ని వసంతాలు దాటించినా,
నీ వర్ధంకాలేదు నా కింతవరకు
సమస్యల విలయతాండవంలో,
కల్లోల కశ్మల భరిత వాతావరణంలో,
తప్పనిసరిగా 'బాధలు' ఊపిరిగా పీల్చి,
తిరిగి ఊపిరి తిత్తులు వాటిని,
వేడి నిశ్వాసలుగా ఉద్వృత్తింప జేస్తే
ఆ సెగకు గుండె కమిలి,
యిహ భరించలేక, జీవితం నుంచి,
దూరంగా పారిపోయి, నేను
నిశ్శబ్ద స్తబ్దార్ణవంలో మునిగేట్లు చేశావు నువ్వు.
అంతటితో ఆగావా మరి నీవు :
జడత్వంతో బయటి ప్రపంచాన్ని మరచి,
కలల కుటీరంలో బ్రతికే నా మనసుకు,
క్షీణంక ప్రవృత్తి నాపాదించి,
దానిముందు అందమైన జీవిత హర్మ్యాన్ని,
దాన్ని వెలిగించి ప్రజ్వలింపజేస్తున్న.
ఆశల జ్వాలా తోరణాల్ని ప్రదర్శించి,
నన్ను తిరిగి మాయాప్రలోభంలో పడేశావు
నేను మలయమారుతా స్వాదనలో నున్నప్పుడు
వెంటనే ప్రళయ ప్రభంజనంతో చెంపపెట్టు పెడతావు.
అందుకే నే నంటాను నీవు
'బ్రతుకు'కు భాష్యం చెప్పే వ్యాఖ్యాతవు.
నేను జీవితాంతం, జీవితాన్ని
తెలుసుకొనగోరే శ్రోతను.

—నారపరాజు రాఘవరావ్

జ్యోతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

తాజ్ మహల్

వల్లూరు శివప్రసాద్

బొకారో ఎక్స్‌ప్రెస్ చీకటిని చీల్చుకుంటూ వేగంగా దూసుకెళ్తోంది ఇంజన్ రొద, పట్టాల శబ్దం కలగాపులగమై వింతగా ధ్వనిస్తూ నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. కిటికీ అద్దాలనుండి బయటపడుతున్న కాంతి దూరంగా పడుతూ బండిని వెంబడిస్తున్నట్లుగా పరిగెడుతూంది.

నేనున్నది రిజర్వుడు కంపార్ట్‌మెంట్ అయినా అది రద్దీగానేవుంది సీట్లమీద, క్రింద జనం నిద్రలో తూగుతున్నారు అసౌకర్యంగా వుండటంవలన ఎవరూ పూర్తిగా నిద్రపోలేక పోతున్నారు. తూలు వచ్చినప్పుడల్లా సర్దుకు కూర్చుని, తమ సామాను పరిశీలనగా చూసుకొని తిరిగి నిద్ర కుపక్రమిస్తున్నారు

అదృష్టంకొలదీ నేను బెర్త్ సంపాదించుకోగలిగినా నిద్రరావటంలేదు గరగరమని తిరుగుతున్న ఫాన్‌రెక్కల శబ్దం మినహా కంపార్ట్‌మెంట్‌లో మరే శబ్దం లేదు.

వారంక్రితమే రాఘవను కలిసిన నేను, వాడ్ని కలసుకోవటానికి తిరిగి ఇంత త్వరగా వెళ్ళాల్సి వస్తుందనుకోలేదు. రాఘవ వుత్తరం చూసిన వెంటనే రెండురోజులు ఆఫీసుకు శలవు పెట్టి బయలుదేరాల్సివచ్చింది.

తెల్లవారుజాము నాలుగుగంటలైంది బండి గంట లేటుతో నడుస్తుండటంవలన కావలి చేరటానికి ఇంకా మూడుగంటలు పడుతుంది.

క్రింద ఎవరో గురకపెడ్తున్న శబ్దం మెల్లగా వినిపిస్తుంది. ఏమీ తోచక రాఘవ రాసిన వుత్తరం బయటకు తీశాను. ఆ వుత్తరం అప్పటికే ఎన్నోసార్లు చదివాను అయినా ప్రతిసారి క్రొత్తగా చదువుతున్నట్లే వుంది.

స్నేహితుడు సుందరానికి,

ఈ లోకంలో ఎన్నో సౌఖ్యాలనుభవిస్తూ సుఖపడేవారికంటే సమస్యల్ని, కష్టాల్ని ఎదుర్కొంటూ మనోవేదన ననుభవించేవారే ఎక్కువన్నది నువ్వు కాదనవనుకొంటాను. అంతటి దుఃఖాన్ననుభవిస్తూ ఎందరో బ్రతక గలుగుతున్నారంటే, కాస్తో కూస్తో ఎదుటివారి నుండి లభించే సానుభూతి, ఓదార్పే కొంత కారణమని నేను నమ్ముతాను.

కాని, నేను నీ నుండి సానుభూతి కోరుతూ మాత్రం ఇంతటి సుదీర్ఘమైన లేఖను రాయడంలేదు. అనవసరపు సోదంతా రాసి విసిగిస్తున్నానని నువ్వు భావించవనే నా వూహ. నమ్మకం కూడా.

సరిగ్గా మూడురోజుల క్రితం నువ్వు చంద్రపడియ నుండి రాజమండ్రి వెళ్తూ కావలిలో నన్ను వెతుక్కుంటూ ఇంటికొచ్చావు. చిన్ననాటి స్నేహితుడ్ని ఎన్నో సంవత్సరాల తర్వాత చూడగలిగానని ఎంతో సంతోషం వేసింది.

కాని, నన్ను చూడాలన్న ఉద్దేశంతో మాత్రమే నా కోసం రాలేదన్న సంగతి నిజమేనని నువ్వూ అంగీకరిస్తావనుకొంటాను. మనం బండికోసం ప్లాట్‌ఫాం మీద వేచివున్న సమయంలో నువ్వు, చావుబ్రతుకుల్లో వున్న నాతల్లి గూర్చి చెప్పి ఏమీ సహాయం చెయ్యనందుకు కోపగించుకొన్నావు నా అసమర్థతను వేలెత్తి

చూపావు. నా అసమర్థతను సమర్థించుకోవా లన్న ప్రయత్నంగా యీ లేఖను రాస్తున్నానని అనుకోవద్దు, దయచేసి.

ఏ మాత్రం ఆదరవులేక, ఆకులు రాలి ఎండి నానాటికి మోడులా వాడిపోతున్న నా తల్లిగూర్చి నీ కున్న ఆవేదనలో కనీసం ఒక వంతయినా కన్నకొడుకైన నాకు లేనందుకు నువ్వు ఆశ్చర్యపడివుంటావు. ఒక విధంగా అసహ్యించుకొంటున్నావనే అనుకొంటాను.

"రాఘవా! తల్లిదండ్రుల కష్టసుఖాలను పట్టించుకోనంత స్వార్థం మన జీవితం గురించి పెంచుకోవడం సహృతయతనిపించుకోదు. మన భావి జీవితంకోసం వాళ్ళు వేసిన పునాదుల్ని మర్చిపోవడం కృతజ్ఞతనిపించుకోదు" అని నువ్వంటే నా మనసు విలవిలలాడింది

నా సంసారం గురించి నేను పెంచుకొన్న స్వార్థమే నా తల్లిని నాకు దూరం చేసిందని నువ్వనుకొని వుంటావు నువ్వేకాదు, నా తల్లి దీనపరిస్థితిని కళ్ళారా చూసిన ఏ వ్యక్తయినా నీలానే నన్ను చీదరించుకొంటాడు అది సర్వ సాధారణం

నిజమే! నా లాంటి దౌర్భాగ్యుడైన కొడుకును కన్న ఏ తల్లి మనసుకూడా హిమాలయాలంతటి వున్నతంగా ఎదగకుంటేగాని ఆమెకు మనశ్శాంతి లభించదు. ఆ హిమవన్నగము పాదాలచెంత సెలయేరులా పుట్టిన నేను పల్లాన్ని వెతుక్కుంటూ పాకేవాడ్నేగాని, ఎంత ప్రయత్నించినా శిఖరాన్ని అందుకోలేని నిర్భాగ్యుడ్ని.

అమ్మ మనసు హిమాలయాన్ని మించి వున్నతమైంది. అంతకంటే శీతలమైంది. నా జీవితం కోసం తనలోవున్న ఎంతటి శీతలాన్ని కరిగించి ధారపోసిందో గదా!

ఆ సెలయేరు తప్పటడుగులు వేస్తూ నదిలో కలసింది. అయినప్పటికీ నా తల్లి ప్రభావం నాలో వుంది గనుకనే నా యావ్వనదశ ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా గడిచిపోయింది.

ఆ కొద్ది సంవత్సరాల జీవితం నది నీటిలా తియ్యగా, స్వచ్ఛంగా, ప్రశాంతంగా, రమ్యంగా సాగిపోయింది. అది తిరిగిరాని జీవితం!

మరిప్పుడో—నది సాగి సాగి ప్రయాణించి సముద్రంలో కలిసిపోయింది. ఆ సముద్రం—ఉప్పగా, ఉవ్వెత్తునా ఎగసే కెరటాల హోరుతో భయంకరమైన జలచరాలతో అల్లకల్లోలంగా వుండి భయకంపితుడ్ని చేస్తూంది.

ఈ జీవితంలో అనేకసార్లు వీచిన ప్రభంజనాల ప్రభావంతో, నా అనుభవాల కెరటాలు ఈడ్చిఈడ్చి మనసును తాకి దాని ఆకృతినే మార్చివేశాయి. ఆ నాటి నా ప్రశాంతజీవితం యిప్పుడు ఎంతో కల్లోలితమై వుంది

సముద్రానికి,నదికీ వున్నంత తేడా ఆ నాటికి, ఈ నాటికి నా జీవితంలో ఏర్పడింది.

ఆ నాటి స్వచ్ఛతపోయి ఎంతో కృత్రిమత్వం నాలో వుప్పగా పేరుకుపోయింది సముద్రంలో పడిన నదినీరు ఎదురుప్రవహించి తన తల్లి పాదాలను ఎలా తాకలేదో, అలాగే నా చుట్టూ ఎన్నో సమస్యలూ, బాధ్యతలు అడ్డుగా పేరుకొని నా తల్లికి నన్ను దూరం చేస్తున్నాయి.

పల్లానికి ప్రవహించే ప్రవృత్తి నీటికెలా వుందో, పరిస్థితులకు బానిసగా మారే స్వభావం మనిషికలా వుంది.

జబ్బుపడ్డ నా తల్లి మొదలు నరకబడుతున్న వృక్షంలా కూలడానికి సిద్ధపడుతుంటే ఏమీ చెయ్యలేక నాలో నేనే ఎంతగానో కుమిలిపోతున్నాను. చంద్రపడియ వెళ్ళి వారిద్దరికి ముఖం చూపాలంటేనే భయంవేసి తప్పుకొంటున్నాను

బిడ్డజీవితంకోసం తల్లిపడే కష్టాన్ని, చేసే త్యాగాన్ని సృష్టిలో మరెవ్వరూ చెయ్యలేరనే నా ఉద్దేశం.

ఒక అద్భుత దృశ్యం చిత్రించబడాలంటే కుంచెకు ఎంతటి ప్రాధాన్యత వుందో, ఒక జీవితాన్ని తీర్చిదిద్దగలిగే తల్లికంతే ప్రాధాన్యత వుంది. అలాంటి తల్లిని రక్షించుకోలేని నా అసమర్థతకు ఏ శిక్ష విధించినా యెలా చాలుతుంది?

ఎన్నో రాత్రులు భూమిని తాకి, నిండు వెన్నెల చల్లదనంతో సేద తీర్చే చంద్రునిలా, నా జీవితాన్ని అడుగడుగున స్పృశిస్తూ, నా



కోసం ఎన్ని చల్లని వెలుగుకిరణాలు నా కోసం వెచ్చించిందో చెప్పలేను.

ఇప్పటికీ వెన్నెల వెలుగులో మంచం వేసుకు పడుకొని, తెల్లని మేలిముసుగు కప్పిన ఆకాశదేవత నుదుటి బొట్టులావున్న పౌర్ణమి చంద్రుడ్ని చూస్తుంటే, అమ్మను చూస్తున్నట్లే వుంటుంది చంద్రునిచుట్టూ మినుకు మినుకు మంటూ వెలిగే నక్షత్రాలు మధురజ్ఞాపకాల్లా నన్ను ఉత్తేజితుడ్ని చేస్తూనేవుంటాయి.

మూగసైగలు మాని మొదటిగా నే పిలిచిన పిలుపు కూడా "అమ్మ"నే.

నా ప్రతిపిలుపుకు సూర్యకిరణం తాకిన కమలంలా పరవశించి ప్రేమతో నా చిన్నారి ముఖాన్ని తన హృదయానికి హత్తుకొని పొంగి

పోయేది అమ్మ.

ఆ నాడు తన ఒడిలో యిముడ్చుకొని జోకొడుతుంటే, ఏ శక్తీ అమ్మనుంచి నన్ను విడదీయలేదన్నంత నిర్భయంగా ఆదమరచి నిద్రపోయేవాడ్ని అమ్మ నా నమ్మకాన్ని కాపాడటానికి ఎన్ని రాత్రులు కంటిమీద కునుకు లేకుండా నన్ను కాచుకొని నిద్ర! పుచ్చిందో.

ఎలాంటి బాధ్యతలు, బాదరబందీలు లేని ఆ వయసులో కమ్మని కలలు కనేవాడ్ని. నేడు-ఎదురౌతున్న సమస్యలు, బాధలు, నా కంట్లో ములుకుల్లా గుచ్చుతుంటే నే నెలా హాయిగా నిద్రపోగలను? కన్ను మూసిన ప్రతి క్షణం భవిష్యత్తనే పీడకలలు నన్ను నిద్రకు దూరం చేస్తున్నాయి.

ఆ నాడు చల్లని నా తల్లి ఒడలోవున్న నిశ్చలత్వం, ఈ నాడు పరిస్థితుల సుడిలో మునిగి తేలుతూ గిర్రున తిరిగే నాకు ఎలా లభిస్తుందంటావు?

చూసినదల్లా కావాలన్న పంతంలో విసిగిస్తుంటే బుజ్జగించి, అవన్నీ సమకూర్చి నా కళ్ళలో వెలిగే ఆనందజ్యోతుల్ని చూసుకోవటానికి అమ్మ ఎంత ఆరాటపడేదో మరువలేను. మరచిపోలేదు కూడా.

తుంటరితనంతో ఎంతగా ఏడ్పించినా భరించేదేగాని ఎన్నడూ హింసించేది కాదు. నా చిన్నారి చేష్టలు వీణారావంలా తన హృదయాన్ని మీటుతుంటే యెంతగా పరవశించి పోయేదో.

నాకు పదమూడేళ్ళ వయసప్పుడనుకొంటాను, నెలరోజులు విషజ్వరం సోకి చావు బ్రతుకుల మధ్య కొట్టుకులాడుతుంటే గుండె పగిలేలా ఏడ్చిందట. నిద్రాహారాలు మాని రేయింబవళ్ళు నన్ను కంటిరెప్పలా కాచుకొని బ్రతికించింది.

దేవుని దయవలననే నేను బ్రతికానని పొంగిపోయి, కానుకగా నా తలనీలాలు సమర్పించి, నాచే చేతులు జోడింపజేసి, తొలిసారిగా నాకు భగవంతుడ్ని పరిచయం చేసింది

ప్రేమపూరితమైన స్పర్శతో ఆప్యాయంగా స్పృశిస్తూ, కంటిరెప్పలా కాచుకొంటూ, బిడ్డల ప్రతికష్టానికి చలించి, భవిష్యత్తుకోసం కొవ్వొత్తిలా కరిగి వెలిగిచ్చే అమ్మను మించిన వేరేదైవం వుందనుకోవడం ఆత్మ వంచన కాక మరేమౌతుందంటావు? రాగమయి అయిన అమ్మతో పోలిస్తే ఆ భగవంతుడు కూడా వెలిగే ఒక చిరుదీపమే.

ఇప్పుడాలోచిస్తుంటే, ఆ నాటి మా పేదరికపు ముద్ర నా మనసుమీద పడకుండా అపురూపంగా నన్ను, పెంచడానికి అమ్మా వాళ్ళెన్ని పూటలు పస్తులున్నారోనన్న తలంపు నా హృదయాన్ని ముక్కలుగా కోస్తుంది.

ఓ సారి—

ఢిల్లీలో వుద్యోగం చేస్తున్న మావయ్య ఇంటికొస్తూ ఆగ్రానుండి తాజ్ మహల్ మోడల్ ను తెచ్చి నాకు కానుకగా యిచ్చాడు.

అందంగా, తెల్లగా నిగనిగలాడుతున్న ఆ తాజ్ చూసి నేనెంతో మురిసిపోయాను. మావయ్య ఆ తాజ్ నా చేతికిస్తూ దీన్ని షాజహాన్ తన భార్య ముంతాజ్ స్మృతి చిహ్నంగా ఆగ్రాలో కట్టించాడని, అది ప్రపంచ ప్రసిద్ధి చెందిన కట్టడంగా పేరుగాంచినదని చెప్పినప్పుడు నాకో అనుమానం వచ్చింది

"మావయ్యా! షాజహాన్ కు తల్లి వుందిగదా! మరి ఆ తల్లి పేరున కూడా మరోటి యెందుకని కట్టించలే"దని నేనంటే వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ వయసులో నాలో వున్నతంగా ఎదిగిన నా తల్లిరూపమే షాజహాన్ తల్లిపక్షాన నన్ను న్యాయం అడిగేలా చేసిందని యిప్పుడనిపిస్తుంది.

"అమ్మా! పెద్దవాడ్నై డబ్బు సంపాదించి నీ పేరుతో యిలాంటిదే కట్టిస్తాను" అని అమాయకంగా నేనంటే, అమ్మ నన్ను ఆనందంగా తన ఒడిలోనికి తీసుకొని ముద్దాడింది.

ఆ తర్వాత ఆ తాజ్ మోడల్ ను భద్రంగా ఇంట్లో దాచి, రోజూ యెంతోసేపు దానికేసి చూస్తూ గడిపేవాడ్ని. దాన్ని చూస్తున్నప్పుడల్లా

అందులో అమ్మే నాకు కనిపించేది

ఇప్పటికీ అది నా యింట్లో భద్రంగానే వుంది కాని శాస్త్రను చూడాలంటేనే నాకు భయం నీ తల్లికోసం ఈ నాడు నువ్వు చేసిన త్యాగం ఏమిటి? అని నన్ను నిలదీసి ప్రశ్నిస్తున్నట్లుగా కలవరపడ్తాను


నిజమే! నా తల్లి నా కోసం చేసిన త్యాగానికి బదులుగా నేనెంతో ఋణపడ్డాను ఈ నాడు నా కాళ్ళమీద నేసీమాత్రమైనా నిలబడగలిగానంటే అది అమ్మ త్యాగఫలితమే

కాలేజీలో చదివించడానికి నాన్న అంగీకరించకపోతే ఎలాగైనా చదివించాలని పట్టుబట్టి తనకున్న బంగారు నగలన్నీ అమ్మి పెట్టమని చిన్నాన్న చేతిలో పెట్టింది

వదినా! వున్నదంతా వాడికోసం ఖర్చుచేసి రేపు మీ కోసం ఏం మిగుల్చుకొంటారు? ఏ రోజు ఎలా వుంటుందో ఎవరు చెప్పగలరు? కష్టాల్లో వుంటే మిమ్మల్ని ఆదుకొంటాడని నమ్మకం ఏమిటి? మీ గురించి కూడా ఆలోచించుకోండి అని చిన్నాన్నంటే నా కేసి చూస్తూ అమ్మ నవ్వింది

అమ్మపై నాకున్న అభిమానాన్ని శంకిస్తుంటే చిన్నాన్నమీద కోపం వచ్చిందిగాని అప్పటి చిన్నాన్న మాటల వెనుక ఎందరి జీవి

రచయిత గురించి



స్వగ్రామం-తెనాలి తాలూకా కొలకలూరు

చదివింది బి యస్సీ తెనాలి వి యస్ ఆర్, అమరావతి ఆర్ వి వి యన్ కళాశాలలలో విద్యాభ్యాసం

"గవర్నమెంట్ లెప్రసీ కంట్రోల్ యూనిట్"—కావలిలో మొన్నీమధ్యనే ఉద్యోగం తద్వారా కుష్ఠురోగులకు సేవ చేసే అవకాశం

పాఠశాలనుండి కళాశాల స్థాయివరకు క్రీడారంగంలోను, సాంస్కృతిక రంగంలోను ఎన్నో బహుమతులు నాటికలు, నాటకాలు వ్రాసి ప్రదర్శిస్తూ ఉత్తమ నటుడిగా ప్రశంస

రచయితగా చెప్పుకోదగ్గ 'రచనలు ఇంతవరకు లేవనే చెప్పాలి. సాహిత్యం నా ప్రాణం. చిన్నతనం నుండి సాహిత్యంతో కుస్తీ పడుతూనే, ఎన్నో కథలు తిరిగొస్తున్నా, ఆ స్థాయికి ఎదగలేదని నన్ను విమర్శించుకొంటూ నిరాశచెందక కృషిచేస్తూ వచ్చాను.

"చక్రవర్తి" మాసపత్రిక డిసెంబర్ 78లో ప్రచురితమైన నా మొదటి కథ "సశేషం"కు ఆ పత్రిక నిర్వహించిన పోటీలలో బహుమతి వచ్చింది. "తాజ్ మహల్!" నా రెండవ కథ.

ఆర్థికలేమి వలన బిడ్డల ప్రేమానురాగాలకు దూరమవుతున్న ఎందరో మధ్యతరగతి తల్లిదండ్రులను పరిశీలించిన అనుభవమే ఈ కథకు ప్రేరేపణ.

తాలను పరిశీలించిన అనుభవం దాగుందో యిప్పుడు బోధపడుతుంది.

ఆ నాడు అమ్మ గనుక తన స్వార్థం గురించే ఆలోచించివుంటే, ఈ నాడు నా సహాయం మీద ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడేది కాదు. మందులు కొనుక్కోలేక అనారోగ్యంతో నరకయాతన అనుభవించేది కాదు.

నా చదువు ఖర్చులకు, ఇంటి ఖర్చులకు యిబ్బంది పడుతుంటే అమ్మ నూలు వడకటం నేర్చుకొంది. సెలవలకు ఇంటికెళ్ళినప్పుడు చరకాచక్రాల శబ్దం బరబరమంటూ ఇల్లంతా ప్రతిధ్వనిస్తూ మోగుతుండేది.

రాత్రిళ్ళు అమ్మ చరకా తిప్పేశబ్దం నన్ను నిద్రకు దూరంచేసేది. నా కోసం అమ్మ కష్ట పడుతుంటే నిద్రపోవాలనిపించక వెళ్ళి అమ్మ ఎదురుగా కూర్చునేవాణ్ని.

నిద్రతో కళ్ళు తూగుతున్నా, అలసటను లెక్కించకుండా యంత్రంలా పనిచేసే అమ్మను చూస్తుంటే నా కళ్ళల్లో నీళ్ళు నిలిచేవి. పైట కొంగు అందుకొని ముఖంపైవున్న చెమటను అద్దేవాడ్ని. ఆ క్షణాల్లో, తనంతవరకు పడిన శ్రమనంతా మర్చిపోయి నాకేసి ప్రేమగా చూసే అమ్మకళ్ళల్లో రెండు చంద్రబింబాలు వెలుగుతున్నట్లనిపించేది.

"అమ్మా! ఇంత రాత్రివరకు నిద్ర మేల్కొంటే నీ ఆరోగ్యం ఏమవుతుంది? ఇక విశ్రాంతి తీసుకోమ్మా!" అంటూంటే, ఏమీ శ్రమ ఎరుగనట్లు హాయిగా నవ్వగలిగే అమ్మను చూస్తుంటే సకల చరాచర జగతిని భరించే భూగోళం గుర్తొచ్చేది.

కదలకుండా తన ఎదురుగా కూర్చున్న నా కోసం అమ్మ చరకా ప్రక్కనపెట్టి, నన్ను నిద్రపొమ్మని తనూ పడుకొనేది. ఇంకా చీకటి విచ్చుకొనకముందే మెలకువ వచ్చి బరబరా తిరుగుతున్న చరకాశబ్దం వింటున్నప్పుడు, నా కంటినుండి నీరు జలలా వూరుతూ దిండులో యింకిపోతుండేది.

పువ్వు యితరులకోసం వాసన నూనెగా మారాలంటే రెకురేకును అర్పించి, ఆకృతినే కోల్పోయి తననే అర్పించుకోవాలి. అలానే అమ్మ నా కోసం తన ఆరోగ్యపు అణువణువును హరింపజేసుకొని అనారోగ్యాన్ని తెచ్చుకొంది.

సముద్రంలా విశాలంగావున్న అమ్మప్రేమ స్వరూపాన్ని బిందువు బిందువుగా విడదీసి ఎన్నని లెక్కబెట్టి చెప్పగలను? నా చూపు కందనంతగావున్న అనురాగపు లోతును పరిశీలించి అర్థంచేసుకోవటానికి బలహీనమైన నా దృష్టిని యెన్ని యుగాలని నిలిపివేచి వుండగలను?

తల్లిదండ్రులను నా దగ్గరే వుంచుకొని ఏ లోటు రాకుండా చూసుకోవాలనే ఆలోచన ఓ చిన్న గుమస్తాగా జీవితంలో ఇరుక్కొన్న నాకు ఎంత కష్టమైనదో—పెళ్ళిచేసుకొని, పిల్లలు పుట్టిన తర్వాతగాని తెలిసిరాలేదు.


మూడువందల ఆదాయంమీద ముగ్గురు పిల్లలతో ఒక పట్నంలో బ్రతకటం ఎంత కష్టసాధ్యమో నీకు తెలియంది కాదు.

నాన్నగారు రిటైర్ అయినాక వచ్చే పెన్షన్ డబ్బు చాలక యిబ్బంది పడ్తున్నారని గ్రహించి, వాళ్ళకేమీ సహాయం చెయ్యలేకపోతున్నందుకు వేదనపడేవాణ్ని.

ఏనాటి కానాడు సమస్యలు సాలెగూడులా అల్లుకొని వాళ్ళకు నన్ను దూరం చేస్తూనే వచ్చాయి. ఆ దూరం నానాటికి అంతరిక్షంలో తరగని దూరంలా పెరిగిందేకాని మమ్మల్ని ఒకటిగా చెయ్యలేదు.

వాళ్ళిద్దర్నీ మనదగ్గరే వుంచుకొందామని అనేకసార్లు కళ్యాణికి నచ్చజెప్పజూస్తే ఎంతో గొడవచేసింది. మన బ్రతుకులే మనకు భారంగా ఏడుస్తుంటే వాళ్ళ బరువు మనమెక్కడ మొయ్యగలమని కసురుకొనే కళ్యాణిని రాక్షసిగా వూహించుకొన్నాను. కాని ఆలోచిస్తే, తన సంసారంపట్ల పెంచుకొన్న అభిమానమే తన చేత అలా మాట్లాడిస్తుందనిపించేది.

నన్ను కన్నవారిపై నాకున్న ప్రేమను అర్థంచేసుకొని కష్టాల్ని ఎదుర్కోగల ధైర్యం కళ్యాణికి లేదు. నా బాధను, బాధ్యతను



భార్యగా ఏ మాత్రం అర్థంచేసుకోలేక పోయింది.

స్త్రీ తల్లిగా తన బాధ్యతను నిర్వర్తించగలిగినంత వున్నతంగా, న్యాయంగా భార్యగా నిర్వర్తించలేదేమోనని కళ్యాణిని పరిశీలిస్తుంటే నా కనిపించింది. స్త్రీలో భార్యరూపంకన్నా తల్లి రూపమే వున్నతమైనది.

కళ్యాణి ఒక విధంగా పిచ్చిదే సుందరం!

నా మీద అమ్మయితే ఆశలు పెట్టుకొందో లేదో చెప్పలేనుగాని, తన సంతానంమీద కళ్యాణి మాత్రం ఆశలు పెంచుకొంటుందేమోననిపిస్తుంది. కొడుకుగా, నేను అమ్మకు ఎంత ఆదరణ, ఆశ్రయం కల్పించాలో రేపు తన కొడుకులూ అంతే ఆశ్రయం కల్పిస్తారని కళ్యాణి గ్రహించలేకపోవటం పిచ్చిగాక మరేమిటంటావు?

ప్రేమను పంచుకోవాలన్నా, దూరం చెసుకోవాలన్నా మన మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక స్థితి ఎంతో ప్రాముఖ్యం వహిస్తుంది. మధ్యస్థ కుటుంబాల్లో ఆశలు పెట్టుకొని సంతానాన్ని తీర్చిదిద్దుకొనే తల్లిదండ్రులకు ఇలాంటి సమస్యలు ఎంతో క్షోభను కలిగిస్తాయి.

అమ్మ ఆరోగ్యం బాగోలేదని నాన్న వుత్తరం రాస్తే చార్జీలకు అప్పుచేసి చంద్రపడియ వెళ్ళాను.

పచ్చనిమ్రాను నేలకూలితే శుష్కించినట్లుగా శరీరం వాడిపోయివుంది. ఎముకల గూడులా మంచాని కంటుకొనివున్న అమ్మను చూస్తుంటే నా హృదయం నీరైపోయింది.

డాక్టర్ ఆపరేషన్ చెయ్యాలన్నాడని, అందుకు కనీసం వెయ్యిరూపాయలు ఖర్చవుతుందని నాన్నంటే నేను మౌనంగా వూరుకొన్నాను. అంత డబ్బు నా దగ్గరెక్కడిది? ఒక్కసారిగా ఎక్కడ తేగలను?

నా అశక్తతను అర్థంచేసుకొన్న అమ్మ ఏమందో తెలుసా! "ఏవండీ! పండుటాకు ఏ నాటికైనా రాలిపోక తప్పదు. నాలుగు రోజులు నన్నెక్కువ బ్రతికించాలన్న తాపత్రయంతో వాడ్ని అప్పులపాలు చెయ్యకండి. వాడి తాహతు ఎంతో మనకు తెలియదా?"

అంటే, అమ్మ పాదాలమీదపడి భోరున ఏడవా లనిపించింది.

అమ్మను రక్షించుకొనే శక్తిలేక పిరికి వాడిలా పారిపోయి తిరిగొస్తూ వెళ్ళొస్తానని అమ్మతో చెప్పినప్పుడు, కడసారిగా అన్నట్లు నన్నుఆపాదమస్తకం తడిమిన అమ్మచూపులో దీవెనను, వాత్సల్యాన్నే చూడగలిగాను కాని నా చేతగానితనం ఎడల ఏవగింపును ఏమాత్రం చూడలేదు.

చంద్రవడియ నుండి తిరిగొచ్చి డబ్బుకోసం ఎంతో ప్రయత్నించాను. సంసారం కోసం అంతకుముందే చేసిన అప్పులు తీర్చలేని నాకు తిరిగి ఎవరు అప్పిస్తారు? ఎంతమంది నడిగినా మొండిచేతులు చూపించారు. నా తల్లికోసం ఏమీ చెయ్యలేక నాలో నేనే కుమిలిపోవటం మినహా ఏం చెయ్యగలను?

ఇప్పటికే చాలా రాశాను కదూ! నీకు విసు గనిపించడంలేదు గదా! నీ స్నేహ హృదయం నా వేదనను ఇముడ్చుకోగలుగుతుందనే నా దృఢనమ్మకం. ఇక కొద్దిలోనే ముగిస్తాను.

షాజహాన్ తాజ్‌మహల్‌ను నిర్మించి భార్యపై తనకున్న ప్రేమను వ్యక్తంచేసి, వారిద్దరి ప్రేమను చరితార్థంచేసి కృతార్థు డయ్యాడు.

షాజహాన్ నాలా పేదవాడై వుంటే ఏం చేసేవాడు? ప్రేమవుండి తల్లిని కోల్పోబోతున్న నేను ఏడుస్తున్నట్లే, భార్యను పోగొట్టుకొన్న అతనూ దుఃఖిస్తాడు. అప్పుడు అతని ప్రేమను ఈ ప్రపంచంలో ఎందరు గుర్తించగలిగేవాళ్ళు?

తాజ్‌ను నిర్మింపజేసింది కేవలం అతని ప్రేమైక హృదయమేకాదు, అతనికందు బాటులో వున్న అంతులేని సంపద కూడా.

షాజహాన్‌లా తనవారి యెడల ప్రగాఢమైన ప్రేమను కలిగివున్న వారెందరో ఈ సృష్టిలో వున్నారన్నది యదార్థం. అయితే ఈ షాజహాన్ లెవ్వరూ తమ ప్రేమను వ్యక్తం చెయ్యగలిగే తాజ్‌మహల్‌ను నిర్మించలేకపోయారు.

వారి ప్రేమకు లోపించిన ఆర్థిక దుర్బలత్వమే అందుకు కారణం కాదని ఎవరైనా అనగలరా? వారందరూ సంపన్నులై వుంటే, తొలిగా ప్రేమ చిహ్నం నిర్మించిన షాజహాన్ ఈ చరిత్రలో మొదటి వాడయ్యేవాడే కాని, ఒక్కడుగా మాత్రమే గుర్తింపు పొందేవాడు కాదు.

నా లాంటి నిర్భాగ్యుడ్ని కన్నతల్లి-కనీసం తన ఆరోగ్యాన్నయినా రక్షించుకోలేని దౌర్భా గ్యాన్ని ఎలా పొందిందో, అంతటి షాజహాన్ చక్రవర్తిని కొడుకుగా కన్న తల్లి-తన పేరున ఏ స్మృతిచిహ్నాన్ని నిలుపుకోలేక అంతటి దౌర్భాగ్యాన్నే పొందింది.

చరిత్రలో షాజహాన్ కాదు, మరే చక్రవర్తి తల్లికోసం స్మృతిచిహ్నం నిర్మించి తల్లిని గౌరవించలేకపోయారు. చిన్నతనంలో నేనన్నట్లుగా, అమ్మకోసం మరో తాజ్ మహల్‌ను నిర్మించే శక్తి నాకు లేకున్నా, కనీసం బ్రతికించుకొనే శక్తికూడా లేని పేద వాడినయ్యాను.

భార్యకోసం స్మృతిచిహ్నం కట్టలేక పోవడం ఎవరైనా క్షమించగలరేమోగాని, తల్లిని బ్రతికించుకోలేని నా అసమర్థతను ఎవరూ క్షమించకూడదనే భావిస్తాను.

ఈ జన్మలో అమ్మను ఆదుకోలేకపోయిన నేరానికి శిక్షను నాకూ, కళ్యాణికి మా బిడ్డలు తప్పక విధిస్తారు. ఎందుకంటే నా బిడ్డలు నా కంటే వున్నతంగా, సంపన్నంగా బ్రతికే స్థాయి ఈ సమాజంలో, ఈ వ్యవస్థలో వారికి లభించదు గనుక.

మరో జన్మంటూ వుంది, నేను సంపన్ను డిగా పుడితే మాత్రం మొదటిగా నా తల్లినే గౌరవిస్తాను. తల్లియొక్క ప్రేమ స్వరూపాన్ని ఈ ప్రపంచం గుర్తించేలా చేస్తాను.

నా మనసులోని భావాలు నీతో యిలా చెప్పుకోగలిగినందుకు మాత్రం కొంత తృప్తిగా వుంది.

—రాఘవ

ఉత్తరం చదవడం ముగించి కవర్లో పెట్టి సూట్‌కేస్‌లో పడేశాను. నా హృదయం బాధతో బరువెక్కింది. తన తల్లిపై రాఘవకున్న

ప్రేమ ఎవరెస్ట్ శిఖరమంత వున్నతంగా నా మనసులో నిలిచింది.

"రాఘవ తల్లిని బ్రతికించాలి? రాఘవ పేదరికం ఆమెను బలితీసుకోకూడదు" ఆలోచనలతో నా బుర్ర వేడెక్కింది.

ఏదో స్టేషను దగ్గరపడుతున్నందువలన బండి వేగం తగ్గింది. లోపలవున్న ప్రయాణీకులు కొందరు ఆదుర్దాగాలేచి సామాను సర్దుకొంటున్నారు.

ఎక్స్‌ప్రెస్ కావలి చేరాల్సిన సమయం అయిదుగంటల నలభై అయిదు నిమిషాలే అయినా, బండి స్టేషన్‌లో ఆగేసరికి ఏడుగంటలైంది. రాఘవతో చంద్రపడియ వెళ్ళి రాఘవ తల్లిని తీసుకొచ్చి హాస్పటల్లో చేర్చాలని నా ఉద్దేశం.

రిక్షా చేసుకొని రాఘవ యింటికి వెళ్ళాను. వాకిట్లో అడుగుపెట్టగానే కనపడ్డ దృశ్యం నన్ను నిలబెట్టింది. రాఘవ అరుస్తూ తన కొడుకును గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు. మిగతా యిద్దరు పిల్లలు, వాడి భార్య రాతిబొమ్మల్లా నిలబడి చూస్తున్నారు.

"రాఘవా!" అరిచాను గట్టిగా.

నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. దెబ్బలు తింటున్న రాఘవకొడుకు భయంగా తల్లిని చుట్టేసుకొని వెక్కిళ్ళుపెడ్తూ ఏడుస్తున్నాడు.

గడ్డం బాగా మాసిన రాఘవముఖం కళాకాంతులు లేకుండా దీనంగా వుంది. వాడి కళ్ళనుండి స్రవించే కన్నీటి జాలు అనంతంగా తోచింది నాకు.

"ఎందుకురా వాడ్నలా కొడ్తున్నావ్?" మందలింపుగా అన్నాను.

"సుందరం! తాజ్ నా ప్రాణం. నీకు తెలుసుగదా! వాడు దాన్ని క్రిందపడేసి ముక్కలు ముక్కలు చేసేశాడు. చూడరా! నా హృదయం క్రిందపడి ఎలా చితికిపోయిందో" దుఃఖంతో రాఘవ గొంతు బిగుసుకుపోయింది.

ఆకృతిలేకుండా చిన్నాభిన్నమైన తెల్లని తాజ్ ముక్కలు, దండనుండి రాలినపూసల్లా వున్నాయి. నా మనసు చివుక్కుమంది.

"బాధపడకు రాఘవా! పిల్లలు పొరపాట్లు చేయరా? మనం వెంటనే చంద్రపడియ వెళ్ళి అమ్మను తీసుకొచ్చి హాస్పటల్లో చేరుద్దాం. ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బు నేను తెచ్చాను. అమ్మ తప్పక బ్రతుకుతుంది" తొందర చేస్తున్నట్లుగా అన్నాను.

రాఘవ ముఖంలో రంగులు మారాయి. వాడి పెదాలు బలవంతంగా విచ్చుకొంటే అది నవ్వో, ఏడుపో నా కర్థంకాలేదు. ఓ నిమిషం తర్వాత ఏడుస్తూ కుప్పలా కుర్చీలో కూలబడ్డాడు.

వాడు జేబునుంచి తీసిచ్చిన ఎర్రటి టెలిగ్రాం కాగితాన్ని అందుకొంటుంటే నా చేతులు వణికాయి.

"టెలిగ్రాం వచ్చి గంటన్నేపైనా అందరం వెళ్ళటానికి చార్జీ డబ్బులేక అయోమయంగా ఏడుస్తున్నానురా. నువ్వు తెచ్చిన డబ్బు ఇప్పుడు అమ్మను బ్రతికించలేదు. జీవంలేని ఆమె శరీరాన్ని కాలుస్తుంది" నా చేతుల్లో ముఖాన్ని దాచుకొని చిన్నపిల్లవాడిలా వలవలా ఏడవసాగాడు రాఘవ.

అంకితం

తప్పటడుగులు వేసే నాటినుండి నేటివరకు నాకు చేయూతనిస్తూ నా జీవితానికి వెలుగుబాట వేసిన

అమ్మ
శ్రీమతి సరోజినిదేవి

నాన్న
శ్రీ వెంకటేశ్వరరావు లకు

ప్రేమతో —

సీరియల్



మీరా టానిక్కు సీసా తీసుకుని డబ్బు ఇస్తోంటే వెనకనించి "అక్కా!" అని వినిపించింది

తనని కాదని మీరా మొదట చూడలేదు

మళ్ళీ, "అక్కా! మిమ్మల్నే" అని వినిపించి వెనుదిరిగింది పన్నెండు పదమూడేళ్ళ

కుర్రాడు తనకేసే చూస్తూ నిలబడి వుండటంతో "ఎవరు" అంది.

ఆ కుర్రాడు నిక్కరు జేబులోంచి చిన్న కాగితం మడతతీసి మీరాకి ఇస్తూ "అరుణక్కయ్య మీ కిమ్మంది" అన్నాడు.

"ఏమిటి" అంటూనే కాగితం అందుకుని మడత విప్పింది మీరా.

"అరుణక్కయ్యకి జ్వరం. మిమ్మల్ని రమ్మని చెప్పింది" అన్నాడా కుర్రాడు.

ఇంకా నలుగురైదుగురు కొట్లోకి రావటంతో మీరా ఆ అబ్బాయి బయటకి వచ్చేరు.

మీరా కూడబలుక్కుంటూ చదివింది. పెద్ద పెద్ద అక్షరాలే రాసినా అలుక్కు పోయి నట్టుగా వున్నాయి.

అందులో ఇలా వుంది.

"మీరా! ఆ రోజునుంచీ జ్వరం తగ్గలేదు—ఇంట్లో ఎవరూ లేరు. ఒక్కదానికే పిచ్చెక్కేట్టుగా వుంది. ఒకసారి వచ్చి వెళ్లు."

మీరా తలెత్తి అడిగింది "నిన్నెప్పుడూ చూసినట్టు లేదే!"

"చూడకపోవటం ఏమిటి? ఏం కావాలన్నా అరుణక్కయ్య నాచేతే తెప్పించుకుంటుంది. మిమ్మల్ని చాలాసార్లు చూశాను" అని వెనుదిరిగాడా అబ్బాయి.

"ఇదిగో బాబూ! ఇలారా" అని పిలిచింది మీరా.

వాడు వచ్చి ఏమిటన్నట్టు చూశాడు.

"నీ పేరేమిటి?"

"ఇప్పుడు పిల్చేరుగా!" అన్నాడు చమత్కారంగా.

"నీ పేరు తెలియక అలా పిలిచాను" అంది నవ్వుతూ మీరా.

"అదే నా పేరు" అని మళ్ళీ వెళ్ళబోయాడు.

"ఇదిగో బాబూ!"

మళ్ళీ ఏమిటన్నట్టు చూశాడు.

"మా ఇల్లు నీకు తెలుసా!" అని అడిగింది.

"అరుణక్కయ్య బస్సు ఎక్కడ దిగాలో చెప్పింది ఏవో మందులు కొనాల్సివచ్చి ఇలా వచ్చేను నువు కనిపించేవు—సరే ఇచ్చేశాను" అని మళ్ళీ వెళ్ళబోతూ వెనక్కి తిరిగి చూశాడు మళ్లా పిలుస్తుందేమోనని.

మీరా నవ్వుకుంది.

వాడు వెళ్ళిపోయాడు.

మీరా కూడా దారాలు కొందామని వెళ్ళింది.

మళ్లా ఆ కుర్రాడు వగర్చుకొంటూ మీరా దగ్గరకి వచ్చేడు.

"అక్కా!" అన్నాడు పరుగెత్తడంవల్ల ఆయాసపడుతూ.

"ఏమిటి" అంది మీరా.

"అరుణక్కకి ఎప్పుడొస్తావని చెప్పాలి. ఇప్పుడు ఇంటికే వెళ్తున్నావా?" అన్నాడు.

"ఊహుం! ఇంకా బజార్లో పనుంది! మళ్ళా వచ్చే వెందుకు?"

"అదే అరుణక్క అడుగుతుంది గదా ఎప్పుడొస్తావని. అందుకని మళ్లా వచ్చేను."

"పనయిపోగానే వచ్చేస్తానని చెప్పు" అంది మీరా.

ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

మీరా తల్లి రంగుదారాలేవో తీసుకురమ్మంది. మీరా అవన్నీ తీసుకుని ఇప్పుడే అరుణ దగ్గరకి వెళ్దామా అనుంది. మళ్ళీ ఆలస్యం అయితే తల్లి తనేమయిపోయిందోనని ఖంగారు పడుతుంది. తల్లితో చెప్పివెళ్తే అరుణ దగ్గర సాయంత్రం వరకూ కూర్చోవచ్చు అనుకుంది.

మీరా మేడ మెట్లు రెండు మూడు మెట్లు ఎక్కేసరికి శేఖరం షర్టు చేతులు పైకి మడుచుకుంటూ హడావిడిగా కిందకి వస్తున్నాడు.

మీరా టక్కున ఆగిపోయింది.

ఊపిరి బిగబట్టి నిలబడ్డ మీరా పక్కగా ఆగిన శేఖరం అన్నాడు. "అరుణకి జ్వరం. నేను డాక్టర్ని తీసుకురావటానికి వెడుతున్నాను—అరుణ పైనవుంది వెళ్ళండి" అనేసి హడావిడిగా వెళ్ళిపోయాడు.

అతనంత సౌమ్యంగా చెప్పడం మీరాకి ఆశ్చర్యమేసింది.

మీరా ఏమాత్రం శ్రద్ధగా శేఖరం ముఖంలోకి చూసినా ఒక్క అడుగు కూడా ముందుకి వేసేది కాదు.

మీరా ఒక్క అంగకి రెండేసిమెట్లు చొప్పున ఎక్కుతూ పైకి వెళ్ళింది.

మీరా ఆదుర్దాగా అరుణ గదిలో అడుగుపెట్టింది.

అరుణ మంచంమీద లేదు.

'బాత్రూంలోకి కాస్త వెళ్ళిందా' అనుకుంది మీరా.

వెనక పాదాల సవ్వడికి అరుణే వస్తోందనుకుంది మీరా.

ఏదో అనబోతూ వెనక్కి తిరిగిన మీరా గుండె కొట్టుకోవడం మానేసింది.

కళ్లల్లో ప్రతీకారవాంఛ మెరుస్తోంటే కసితో కూడిన చిరునవ్వు పెదాలమీధ నాట్యం చేస్తోంటే "సు-స్వాగతం" అని వున్న రంగు రంగుల అందమైన బోర్డు చేత్తో పట్టుకుని అందంగా ఠీవిగా నిలబడ్డాడు శేఖరం.

మీరా తేరుకోవటానికి రెండు మూడు క్షణాలు పట్టింది.

తేరుకున్న వెంటనే చప్పున ముందుకివచ్చి గది తలుపులు మూయబోయింది.

మెరుపులా వచ్చిన శేఖరం తలుపు సందున బూటుకాలు అడ్డంపెట్టేడు.

నిప్పులు కురిపిస్తున్న మీరా కళ్ళల్లోకి కొంటెగా చూశాడు శేఖరం.

"ఏమిటిది! ఏమిటి మీ వుద్దేశం" రోషంతో పెదాలు అదురుతుండగా కోపంగా అడిగింది మీరా.

"సు-స్వాగతం పలికితే ఎవరేనా అంతకోపం తెచ్చుకుంటారా!" అలా అంటూనే తలుపులు బలంగాతోసి లోపలకొచ్చేడు శేఖరం.


మీరా వెనక్కి రెండడుగులువేసి, శేఖరం లోపలకి రాగానే గది బయటకి వెళ్ళిపోవాలని ముందుకి ఖంగారుగా కదిలింది.

శేఖరం చెయి అడ్డు పెట్టేశాడు.

"ఏమిటిది! నన్ను వెళ్ళనియ్యండి—లేకపోతే "

"లేకపోతే!" కొంటెగా నవ్వుతూ అన్నాడు. మీరా అలా ఖంగారుగా కనిపించడం అతనికి వినోదంగా వుంది.

"అరుస్తాను. అరిచి అందర్నీ పోగుచేస్తాను."



"ఏదీ, చెయ్యి చూద్దాం."

మీరాకి ఏదో భయంలాంటిది వణుకు పుట్టించినా బింకంగా నిలబడింది. తను ఖంగారు పడినట్టు అతనేమాత్రం గ్రహించకూడదనుకుంది.

"ఏదీ! అరుస్తానన్నావుగా, అరూ!" అన్నాడు శేఖరం ఒకడుగు మీరాకేసి వేస్తూ. మీరా శేఖరాన్ని తప్పించుకుని విసురుగా వెళ్ళబోయింది.

శేఖరం మీరా చెయిపట్టి వెళ్ళకుండా ఆపేశాడు.

మీరా రెండోచేయి ఎత్తబోయింది.

అది ముందే వూహించిన శేఖరం రెండో చేయిని కూడా బంధించేసేడు.

"ఛీ! సిగ్గులేదూ!" కస్సుమంది మీరా.

"సిగ్గా!" శేఖరం తమాషాగా నవ్వుతూ అన్నాడు: "సిగ్గా! అదంటే నాకు చచ్చేభయం! దానిజోలికి నేనుపోను-నా ఛాయలకి దాన్ని రానీయను" క్షణం ఆగి అన్నాడు మళ్ళీ "అయినా ఆడపిల్లలకే లేని సిగ్గు నా కెందుకూ?"

మీరా మాట్లాడలేదు. ఎంత మోసపోయింది తను.

అతన్నుండి యెలా తప్పించుకోవాలా అని చూస్తోంది మీరా.

శేఖరం మీరా చేతులు వదిలేస్తూ అన్నాడు. "తప్పించుకు పారిపోవాలని చూశావా? .. జాగ్రత్త! ఇంట్లో ఎవరూ లేదు—ఏ అర్ధరాత్రికో కాని రారు. నేను నీతో మాట్లాడాలి—బుద్ధిగా కూర్చో!"

"... "

"చెవుడు కాని లేదుగదా! నేను చెప్పింది వినపడిందా? కూర్చో!"

ఏడుపొచ్చినంత పనయింది మీరాకి. ఎలాగో నిగ్రహించుకుంది.

"నేనేం వినను—కూర్చోను" రోషంగా అంది.

"ఇంటికొచ్చిన వాళ్ళని నిలబెట్టి మాట్లాడ్డం—మా ఇంటా వంటా లేదు. అందులోనూ పిలిపించి "

చివ్వున తలెత్తింది మీరా.

అతని కళ్ళు గర్వంతో తళతళ మెరుస్తున్నాయి.

మీరా కంపరంగా మొఖం తిప్పేసుకుంది.

శేఖరం మీరాని చేయి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టబోయాడు.

మీరా అతని చెయ్యి విదిల్చినట్టుగా తోసేసి వెళ్ళి సోఫాలో కూర్చుంది.

శేఖరం కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

మీరా వెళ్ళాలంటే అతన్ని దాటి వెళ్ళాలి.

అదంత తేలికయిన పని కాదని మీరాకి తెలుసు.

అయిదు నిముషాలు నిశ్శబ్దంగా గడిచినాయి.

కొద్దిగా మెడ తిప్పి మీరాకేసి చూశాడు శేఖరం.

రెండు చేతులూ గడ్డంక్రింద పెట్టుకుని కూర్చుంది.

కొద్దిగా వంచుకున్న గుండ్రని తల, చక్కని పాపిడి, సగం వాల్చిన అందమైన కనురెప్పలు—

ఏదో తీవ్రంగా వాదించి వాదించి అలసిపోయినదానిలా కూర్చున్నట్లుగా వుందా మూర్తి.

కాని, అదేం కాదు.

ఇక్కడ—బందీగా అయి తనవల్లేం కానప్పుడు ఆవరించే నిస్సహాయత—నిర్లిప్తత.

శేఖరానికి జాలేసింది. ఎంతయినా ఆడపిల్ల ఆడపిల్లే

మీరా దగ్గరగా వెళ్ళి "నిన్ను పిలిపించటంలో నా కెటువంటి దురుద్దేశం లేదు—వెళ్ళిపో" అని వీధి గేటువరకూ దిగబెట్టి రావాలనిపించింది శేఖరానికి. మళ్ళా అంతలోనే అ(! ఇంతా పిలిపించి అలా వదిలేయటమే! పెద్దగా కాకపోయినా చిన్నగా వార్నింగివ్వాలి. కాస్త ఏడిపించి వదిలితే ఎప్పటికీ గుర్తుంటుందనే చిలిపి వూహ కూడా కలగక పోలేదు.

మనిషి జీవితంలో మంచి చెడులు నిర్ణయించడానికి రోజులే అక్కర్లేదు.

క్షణాలు గడియలే చాలు. వాటికంత విలువుంది మరి.

ముందేం జరుగుతుందో లీలామాత్రంగా యేమాత్రం తెలిసినా మానవుడు జాగ్రత్తపడతాడు. కనీసం తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు.

నిజంగా కొన్ని కొని అస్సలు తెలియవు. అదృష్టఘడియలు మనముందు నిలుచున్నా గుర్తించం. వాటి టైము అయిపోయి నిరాసక్తిగా వెళ్ళిపోతాయి. దుష్ట ఘడియల్లో మనం తీసుకున్న నిర్ణయం—భూతంలా మారి మన సహనాన్ని అంతు చూస్తుంది.

శేఖరం పాంటు జేబులోంచి సిగరెట్టు తీసుకుని వెలిగించుకున్నాడు.

కొద్దిగా కళ్ళు వాల్చి మీరాకేసి చూశాడు.

ఇందాకటిలాగే కూర్చునుంది.

శేఖరం నెమ్మదిగా వచ్చి మీరా పక్కన కూర్చున్నాడు.

చివ్వున తలెత్తిన మీరా లేవబోయింది.

శేఖరం చేయి అడ్డు పెట్టేశాడు. "నీతో మాట్లాడాలి కూర్చో! అంత ఖంగారు పడిపోతే ఎలా?" అన్నాడు.

అతని చేయి తనకి తగలకుండా సోఫాలో ఒదిగి కూర్చుంది.

శేఖరం కొద్దిగా చేయి యివతలగా జరుపుతూ అన్నాడు. "నీకు చిన్న బహుమానం ఇవ్వా

లని వుంది. ఈ సిగరెట్‌తో యెప్పుడూ గుర్తుండేట్టుగా ముంజేతి మీదివ్వనా—లేక అద్దంలో చూసుకోగానే ముచ్చటగా కనిపించేట్టు ఈ బుగ్గమీ దివ్వనా!"

మీరా కళ్ళు వెడల్పు చేసుకుని చూడసాగింది. అలా వెడల్పయిన కళ్ళల్లో భయం భయంభయంగా తొంగి చూస్తోంది.

అది గ్రహించినట్టుగా అన్నాడతను. "ఏం చెయ్యను? ఈ వాచీ నీకు బాగుండదు—ఈ వుంగరం నీకు లూజవుతుంది. ఇంతకన్న నా దగ్గరేం లేదు."

మీరా మాట్లాడలేదు. మీరా గొంతు తడారిపోయినట్టుగా వుంది.

"లేవంటే అసలు నా దగ్గరేం లేవని కాదు. విలువయినవి చాలా వున్నాయి. కానీ, అన్నీ నా గదిలో వున్నాయి. వెళ్ళి తీసుకొద్దామంటే నువ్వు పారిపోతావేమోనని నా భయం."

మీరా పళ్ళ బిగువున చూస్తూండిపోయింది.

"అదేమిటి అన్ని కబుర్లు చెప్పి అన్ని తమాషాలు చేసే అమ్మాయిగారు మూగనోము పట్టేశారు! లేకపోతే రెండో చెంప యెలా పగలగొట్టాలా అనా?" మీరా కొట్టిన చెంపని చేత్తో రాసుకుంటూ అన్నాడు.

మీరా ముఖం తిప్పేసుకుంది.

"ముఖం అటు తిప్పుకుంటే కాదు ఇటు తిరిగి ఏదేనా కబుర్లు చెప్పు" అంటూ ముఖం ఇటు తిప్పబోయాడు.

మీరా విసురుగా అతని చేయి తోసేసింది.

శేఖరం తమాషాగా నవ్వుతూ అన్నాడు. "ఇప్పటికయినా నే నెవరో తెలిసిందా?"

చాలా ఈసడింపుగా చూసింది మీరా.

"ఊహుఁ! రోషం ఏం దిగలేదు—ఏమాత్రం తిక్కగా ప్రవర్తించినా ఏం చేస్తానో తెలుసా? ఈపాటికి తెలిసే వుండాలే "

ఇంక మీరాకి సహనం చచ్చిపోయింది ఎలాగయినా అతన్ని ఎదిరించందే ఇక్కడనుండి కదిలే మార్గం లేదనుకుంది.

మీరా లేవబోయింది. శేఖరం లేవనీయలేదు.

"మర్యాదగా లేవనీ—లేకపోతే నే నెవరో నీకు తెలుస్తుంది" రోషంగా అంటూ అతన్ని పిచ్చిబలంతో తోసి లేచి నిలబడింది.

అతను పడిపోతున్నట్టు నటించి, "అబ్బా! నా కన్నా నీకే బలం ఎక్కువుంది" మీరా భుజంమీద చేయి వేస్తూ అడిగాడు. "నువ్వెవరవో నాకు తెలియాలి! నీ పేరు?"

"ఛీ." అతని చేతిని విసురుగా తోసేసింది.

"ఆఁ! చిత్రంగా వుందే! వూరు?" మీరా వేళ్ళచివర పట్టుకుంటూ అడిగాడు.

"షటప్!" పెదాలు అదురుతుండగా అతని చేయి కొట్టినట్టుగా విదిల్చేస్తూ అంది

మీరా ఎదురుగా నిలబడి రెప్పపాటు కాలం మీరాని పైనించి కిందివరకూ చూస్తూ "నీ వయస్సెంత?" అన్నాడు.

మీరా చెయ్యి గాలిలో లేచింది. శేఖరం మధ్యలోనే పట్టి ఆపేశాడు.

"నోరు ముయ్యి—నీ వాగుడికి అంతూ పొంతూ లేదు" చీదరింపుగా అంది.

"బాగుంది! పేరు 'ఛీ!' అంటే నీది సిసింద్రీలాంటి పేరని—నువ్వు చిచ్చుబుడ్డిలాంటి

వానివన్న మాట! వయసు 'నోరుముయ్' ఆడవాళ్ళు వయస్సెప్పుడూ చెప్పుకోరు. కాబట్టి వయసు నోరు మూసెయ్యాలి. ఇక పోతే వూరు 'పటప్' అదే అర్థం కావటం లేదు."

"అర్థమౌతుంది—కాస్త వాళ్ళు దగ్గర పెట్టుకుంటే!"

"ఆహా! అదెలా?" ఆశ్చర్యంగా కనుబొమ లెత్తాడు.

మీరాకి రాను రాను సహనం చచ్చిపోతోంది. ఇక్కడనుంచి యెలా బయటపడాలో అంతు తోచటం లేదు. అతన్ని మాటలతోనన్నా బాధించి యిక్కడనుండి దాటాలని చూస్తోంది.

మళ్ళీ అడిగాడు శేఖరం సిగరెట్ కిందపడేసి బూటు కాలితో రాసేస్తూ. "ఎలా అర్థ మౌతుంది?"

"నాకు తెలియదు—జ్యోతి నడుగుతే తెలుస్తుంది."

"అహా!" అలా 'అహా' అనటంలో నిప్పు సెగలాంటి శగలు వెడలి గ్రక్కాడు. కళ్ళల్లో నిప్పులు కురిశాయి.

"మీ గురువుగారి విద్యలన్నీ నీకు వచ్చే వుండాలే! నువ్వే చెప్పు."

"నాకేం గురువుకాదు—మీకేమన్నా గురువేమో—అందుకే అందుకే అంత భయపడు తున్నారు "

శేఖరం ముందుకి అడుగు వేయటంతో అతన్నుండి తప్పించుకోవటానికి సోఫా వెనకా లకి తప్పుకుంటూ అంది మళ్ళీ. "నే నెందుకు భయపడాలి మీకు. మీరంటే ఏమిటో అంతా జ్యోతి చెప్పింది నాకు. అవన్నీ అవన్నీ నేను అరుణకి చెప్తానసీ—ఇంట్లో అందరికీ తెలుస్తా యని మీ భయం అందుకే నా నోరు కట్టేయాలనీ—నన్ను రానీయకుండా చేయాలని చూస్తు న్నారు " మీరా మాటలు పూర్తి కాకుండానే శేఖరం చాలా నేర్పుగా మీరా చేయిని అంది పుచ్చుకున్నాడు.

అతన్నుండి పట్టు తప్పించుకోవడానికి అతను కెవ్వుమనేంత గట్టిగా ముంజేతిమీద బలంగా కరిచింది.

వెంటనే మీరా చేయి వదిలేశాడు. అతని ముఖం రాయికన్న కఠినంగా మారింది.

ఎలాగయినా అతన్నుండి తప్పించుకోవాలని మీరా—మీరాని యెలాగయినా వదలకూడ దని శేఖరం.

ఇద్దరూ చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

మీరా టేబుల్ దగ్గరగా వుంది. అతను ముందుకు వచ్చేడంటే ఆ పుస్తకాలన్నీ అతని మీద విసురుతూ యెలాగయినా బయటపడాలని చూస్తూంది.

"చెప్పు! నిజం చెప్పు. నేనంటే ఏమని చెప్పింది జ్యోతి?"

"ఆవిణ్ణే అడగండి."

"ఇప్పు డన్నావుగా యేదో చెప్పిందని" అలా అంటూ అతను ముందుకి కదిలేడు.

టప్ టప్మని వరసగా వచ్చి ఒక్కొక్క పుస్తకమే అతనిమీద వర్షంలా వచ్చి పడ సాగాయి.

శేఖరంఎంత కఠినంగా వారించినా మీరా ఏదో ఆవహించినట్లుగా విసురుతూనే వుంది.

ఆ పక్కనే వున్న షెల్ఫ్‌లో పుస్తకాలు కూడా విసిరేస్తోంది.

చివరగా మీరా చేతిలో పేపర్‌వెయిట్ మిగిలింది.

"నన్ను వెళ్ళనియ్యకపోతే దీంతో నీ తల పగుల్తుంది—అడ్డు లే!" పిచ్చిదానిలా అరిచింది మీరా.

అతనూ చాలా ఆవేశంలోనే వున్నాడు. అలాంటి మనిషి ఆ దెబ్బకి భయపడి తొలుగుతాడా "మర్యాదగా అది అక్కడ పెట్టు" ఉరిమినట్టుగా అన్నాడు.

అతనికేసే గురిపెట్టినట్టు పట్టుకుంది. "అడ్డు లేవందే పెట్టను" అంది.

అతను మెరుపులా మీరా దగ్గరకి రెండంగల్లో వచ్చేడు.

మీరా చప్పున ఆ పేపర్ వెయిట్ ని విసురుగా అతనికేసి కొట్టింది.

శేఖరం నుదుటికి కుడిపక్క తగిలి కిందపడి ముక్కలయింది.

ఎడంచేత్తో మీరా చెల్యాని గట్టిగా పట్టుకుని కుడిచేత్తో నుదురు రాసుకున్నాడు. చేతికి వెచ్చగా—తడిగా తగిలింది.

చేయి చూసుకున్నాడు. రక్తం—

ఆ నెత్తురు చేయి మీరా నుదుటికి అద్దేడు శేఖరం

మీరా యెంత గుంజుకున్నా తప్పించుకోవడానికి వీలులేని విధంగా బంధించేశాడు.

మీరా నుదుట అద్దిన రక్తం అమ్మవారి బొట్టులా పెద్దగా కనిపిస్తోంది.

సన్నగా తీగలా పొడుగ్గా వున్న మీరా శేఖరం చెవులుదాకా వుంది.

"ఇప్పుడు? న్యూసెన్సు కేసు పెడ్తావా—పరువు నష్టం దావా వేస్తావా!" కసిగా అన్నాడు శే ...రం.

"మీలాంటి మూర్ఖులకి బలం వుంటే—పశువు "

ఆపైన మీరాని మాట్లాడనీయకుండా తన పెదాలతో మూసేశాడు శేఖరం

శేఖరంలో కలిగిన వుద్రేకం వివేకాన్ని ఒక్క తోపు తోసినట్టు పక్కకి నెట్టింది—

గదిలో పర్చుకున్న వెల్తురు కాంతిని కోల్పోయినట్లు వెలవెల బోయింది.

బయటనించి దూసుకొస్తున్న గాలి—స్థంభించినట్లు ఆగిపోయింది—

కాంతిని కోల్పోయిన వెల్తురు—చీకటిని చిందిస్తే—స్థంభించిన గాలి ఊపిరి ఆడనీయకుండా ఉక్కిరి బిక్కిరి చేసింది—

వుద్రేకం వివేకాన్ని గెంటేస్తే—అంతరాత్మ మంచి చెడుల విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయినట్లు—పశుత్వాన్ని జయించేలా చేసింది—

* *

స్పృహలో వుందో లేదో తెలియని పరిస్థితిలో పడివుంది మీరా.

మీరాని మాట్లాడించాలని శేఖరం చాలా ప్రయత్నం చేశాడు.

మీరా కళ్ళు కూడా తెరవలేదు.

కొన్ని క్షణాల్లో—జబ్బు పడ్డ మనిషిలా పడివుంది మీరా.

మతిపోయిన వాడిలా అలాగే చూస్తూండి పోయాడు శేఖరం.

* *

మూడు రోజుల తర్వాత—

రాత్రి ఎనిమిది గంటలు కావస్తుండగా వచ్చేడు శేఖరం.

అతను వస్తూనే తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అతను వచ్చిన అయిదు నిమిషాలకి అరుణ అక్కడకు వచ్చింది.

వస్తూనే అన్నగారు ఎదురు పడటంతో అతను సంతోషించేడు—ఇప్పుడే అరుణ వచ్చేయటం అతనికి ఇబ్బందిగా వుంది. తను ఏదేనా ముభావంగా సమాధానం చెప్తే రాజేంద్ర వదిలిపెట్టినంత తేలిగ్గా అరుణ వదిలిపెట్టదని అతనికి తెలుసు.

కాస్సేపు విశ్రాంతిగా ఈజీచైర్‌లో పడుకుందామనుకున్న శేఖరం షర్టు విప్పి స్టాండుమీద పడేసి ఏదో పనున్నవాడిలా పాంటు జేబులో కాగితాలు వెతుకుతున్నట్లు వుండిపోయాడు.

"అన్నయ్యా! ఎక్కడకెళ్ళావ్ ఈ మూడు రోజులూ?" అని అడిగింది అరుణ.

"నాగార్జునసాగర్ వెళ్ళాను" ఇటు తిరక్కుండానే జవాబిచ్చాడు.

"నాగార్జున సాగరా! ..." ఆశ్చర్యంగా అడిగింది. "పోనీ, చెప్పి వెళ్ళవచ్చుగా" అంది మళ్ళా...

శేఖరం నవ్వేడు. "ఎం ..నేనేం ఆడపిల్లను కానుగా—" అతని గొంతు అదోలా మారటం అరుణ గ్రహించలేదు.

"బావుంది! ఆడపిల్ల అయితేనేనా? ఎంత ఖంగారుపడ్డామో తెలుసా?"

అరుణతో యింక మాటలు పెంచటం యిష్టంలేనివాడిలా "వాళ్ళు బజార్లో కనపడితే లాక్కుపోయారు—నేను స్నానం చేయాలి. చిరాగ్గా వుంది" అంటూ తువ్వాలు తీసుకుని అక్కడనించి వెళ్ళిపోయాడు.

కాని, శేఖరం వచ్చేవరకూ అరుణ అక్కడే వుంది.

అతను తీరిగ్గా చేసే ప్రతి పనినీ శ్రద్ధగా చూస్తున్నదానిలా అలాగే చూస్తూ కూర్చుంది అరుణ.

శేఖరం కుర్చీలో కూర్చుంటూ, "ఏమి టరుణా!" అని అడిగాడు.

"రా, అన్నయ్యా, భోజనం చేద్దాం" అంది.

"నా కాకలిలేదు—భోజనం చేయను."

"అదేమిటి? ఆకలి లేకపోవటం ఏమిటి? ఎప్పుడు బయలుదేరేరేమిటి రక్కడ?"

"మధ్యాహ్నం అన్నాలు తిని బయలుదేరేము! వచ్చేముందే టిఫిన్ తిన్నాం. నా కసలు ఆకలి లేదు. నువ్వెళ్ళి భోజనం చేసెయ్యి" అని పుస్తకం చూడ్డంలో నిమగ్నుడయ్యాడు.

ఇంకోసారి అడిగి అరుణ వెళ్ళిపోయింది.

శేఖరానికి పుస్తకం చూడ బుద్ధికాక అక్కడ పడేసి లేచి అక్కడ కిటికీదగ్గరకి వచ్చి నిలబడ్డాడు.

వారం రోజులు గడిచిపోయినాయి.

ఏదేనా—మొదట్లో బాధపడినంత యిదిగా తర్వాత వుండదు.

ఆ బాధ పూర్తిగా తగ్గకపోయినప్పటికీ కొంతవరకూ ఉపశమనం పొందుతారు.

ఇందులో మూడువంతులకి పైగా యెంత తీవ్రంగా ఆలోచించినా తమ తప్పు ఏం లేదనే భావిస్తారు. ఏదేనా కాస్త వేలెత్తిచూపినట్టుగా తమవల్ల పొరపాటుగా అనిపించినా అలాంటి పరిస్థితిలోకి ఎదుటివాళ్ళు—తీసుకొచ్చారనే అనిపిస్తుంది.

శేఖరం మొదట చాలా భయపడ్డాడు—గుక్క తిప్పుకోలేని విధంగా వ్యథ చెందాడు. అరుణ వాళ్ళు రాకుండానే అతను బయటకి వెళ్ళిపోయాడు. మూడురోజులూ అతను స్నేహితుడి రూములోనే గడిపేడు

తర్వాత అక్కడా విసుగ్గానే అనిపించి యింటికొచ్చేశాడు.

మెల్ల మెల్లగా తేరుకున్న శేఖరం మీరా తనని బాగా రెచ్చగొట్టిందని తన మనసుకి నచ్చ చెప్పుకొన్నాడు.

అరుణకి యిప్పుడు కాస్త కాలక్షేపం అవుతోంది. పిల్లల సంరక్షణా—ఇంకా వంట మనిషి కుసుమకి నచ్చిన మనిషి దొరకక పోవటంతో యింట్లో పనితో బాగానే కాలక్షేపం అవు తోంది.

ఇంకో నాలుగురోజులు పోయాక మీరా రాలేదు, వచ్చి చాలా రోజులయిందని అనుకో సాగింది అరుణ. రెండురోజుల క్రితం జ్యోతీ, వాళ్ళమ్మగారూ వచ్చినప్పుడు మీరా యింటికి వెడదామనుకుంది అరుణ. జ్యోతీ వాళ్ళతో వెడితే అన్నగారికి యెక్కడ కోపం వస్తుందోనని వూరుకుంది.

ఆ రాత్రి శేఖరం వచ్చేక జ్యోతీ, వాళ్ళమ్మగారు వచ్చి వెళ్ళినట్టు చెప్పింది అరుణ.

"వాళ్ళ సంగతి నాకు చెప్పకు" విసుక్కున్నాడు శేఖరం.

'నయం వెళ్ళాను కాను' అనుకుంది అరుణ. అయినా వాళ్ళతో వెళ్తే వాళ్ళింటికెళ్ళాలి.

కుసుమా రాజేంద్రా పిల్లల్ని తీసుకుని పార్కుకి వెళ్ళారు. కుసుమ అక్కకొడుకు శర్మ యింట్లో వుండమని చెప్పినా వాళ్ళు వెళ్ళగానే ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఇంట్లో అరుణ ఒక్కత్తే వుంది.

ఒక్కదానికీ అలా కూర్చోవటం చాలా విసుగనిపించింది అరుణకి. ఈమధ్య పిల్లలతో బాగా అలవాటయింది. మీరా వచ్చి చాలా రోజులయింది. ఎందుచేత రాలేదో! ఒంట్లోగాని బాగుండ లేదా? అనుకుంది.

వంట చేద్దామని వంటగదిలోకి వెళ్ళింది.

అరుణ వంట చేస్తూంటే శేఖరం వచ్చేడు. అతను వస్తూనే "యెవరూ లేరా?" అని అడిగాడు.

అరుణ చెప్పింది.

"శర్మ ఏడీ?"

"ఏమో! ఎక్కడికి వెళ్ళాడో!"

"ఎంతసేపయింది వెళ్ళి?" అని మళ్ళీ అడిగాడు.

"అన్నయ్యా, వదినా వాళ్ళు వెళ్ళిన పావుగంట ఇరవై నిముషాలకే వెళ్ళిపోయాడు— గంట దాటింది. ఏం, అలా అడుగుతున్నావ్?"

వెంటనే శేఖరం యేం అనలేదు. తర్వాత అన్నాడు. "చార్మినార్ దగ్గర సందులోకి చాలా హడావిడిగా వెడుతూ కనిపించేడు. వెళ్ళి చూద్దామంటే నా కూడా మూర్తీ, చలపతీ ఇంకో ఫ్రెండూ ఉన్నారు."

"ఏమోమరి! నాతో యిప్పుడే వచ్చేస్తానని చెప్పి వెళ్ళేడు."

అరుణ వంట పూర్తిచేసి వచ్చి కూర్చుంది.

అరుణ రత్నకి స్వెట్టరు అల్లుతోంది. అది తెచ్చుకుని కూర్చుంది.

శేఖరం ఒళ్ళో పుస్తకం పెట్టుకొని అరుణ అల్లుతోంటే చూస్తూ కూర్చున్నాడు.

అల్లుకుంటున్న అరుణ అంది. "మీరా వచ్చి చాలా రోజులయింది. ఎందుచేత రాలేదో యేమో!"

FREE !!

ఉచితం !!

ప్రనుకూల సమయం

లోకంలో చాలామంది వారి చెడు అలవాట్లను మార్చుకోవటానికి కాలాన్ని వాయిదా వేస్తుంటారు. మాకు ఆధ్యాత్మిక సంగతులను గూర్చి చింతించుటకు చాలా సమయం ఉందని కాలాన్ని వాయిదా వేస్తుంటారు.

చేతి కందిన కాలాన్ని విడవకుండా ఉపయోగించుకోవలసిందే గాని కాలం ఎవరికోసమూ వేచివుండదు. ఈ లోకంనుండి విరమించే కాలం' సంభవించినపుడు కొద్ది క్షణాలకోసం కోట్ల రూపాయలు వెచ్చించినా ఎవ్వరూ దానిని ఆపలేరు

"ఆధ్యాత్మిక చింతకు దేవుణ్ణి వెదుకుటకు ఇంకా సమయం ఉంది." అని సైతాను మానవుల్ని మోసగిస్తుంటాడు. నూటికి తొంభైమంది వాడి మాటనే విశ్వసిస్తారు. ఇంకా చాలా సమయం ఉందనే ధీమాతో జీవిస్తుండగానే అకస్మికంగా మృత్యువు వారిని కబళిస్తుంది. ఎందుకంటే మరణ మనేది ఎవ్వరికి కబురంపి రాదు. అది ఎవ్వరినీ గౌరవించదు. దాని దృష్టిలో పండితులనీ, పామరులనీ, రాజులనీ, పేదలనీ, బలవంతులనీ, బలహీనులనీ వ్యత్యాసం లేదు. దాని వలనుండి విడిపించుకొన్న ధీరు లెవ్వరూ ఇంతవరకూ పుట్టలేదు. ఈ లోకంలో కొంతకాలం అనుభవించి వీడిపోయే వాటికోసం వెయ్యి విధాల ప్రయాసపడే మానవులకు, మరణానంతరం జీవించబోయే స్థలంకోసం పిసరంత ప్రయాసలేదు. నిజముగా మరణించిన పిమ్మట కూడా సుఖ సంతోషములతో కూడిన స్వర్గములో నివసించాలంటే మీ ఆత్మీయ రక్షణకోసం కాలం వాయిదా వేయకండి. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయము. ఇదిగో ఇదియే రక్షణ దినము" ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేయక క్రీస్తు ప్రభుగూర్చి ఈనాడే తెలుసుకోండి.


ఉచితం !! ఉచితం !!!

దైవస్వరూపుడైన యేసుక్రీస్తు జీవితచరిత్ర, ఆయన అమృతవాక్కులు తెలియజేసే 300 పేజీల అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే ఈ రోజే మీ చిరునామా మాకు వ్రాయండి. పోస్టు ఖర్చులు మావే.

ఇదీ అడ్రస్:

ఎస్. జాన్ డేవిడ్ A.M.G.
పోస్టు బాక్సు-12
చిలకలూరిపేట
గుంటూరు జిల్లా.

Gospel Message
Inserted by A.M.G
Chilakaluripet.



పరధ్యాన్నంగా వున్న శేఖరం ఉలిక్కిపడ్డాడు. అతడు అరుణకేసి చూసి, మళ్ళీ ముఖం తిప్పేసుకున్నాడు.

తర్వాత అరుణ మీరా గురించి యేదో చెప్తోంటే శేఖరం పుస్తకంలోకి దృష్టిని నిలిపి అప్పుడప్పుడు "ఊఁ—ఆఁ" అంటున్నాడు.

కుసుమా వాళ్ళు యింకో అర్ధగంటకి వస్తారనగా శర్మ వచ్చేడు.

శర్మ వస్తూనే తలొంచుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం—

అరుణ రమేష్‌కి రత్నకి నీళ్ళుపోసి బట్టలేసి పంపింది.

కుసుమ యిద్దరికీ టిఫిన్ పెట్టి మంచినీళ్ళు యిద్దామని గ్లాసులకోసం చూస్తే రమేష్‌గ్లాసు లేదు. రమేష్ రత్న వచ్చేకా యిద్దరికీ ఒకే రకం వెండి గ్లాసులూ, ప్లేట్లు తీసుకుంది కుసుమ. ఇప్పుడు రమేష్ వెండగ్లాసు కనపడలేదు.

కుసుమ యిల్లంతా వెతికింది. ఎక్కడా కనిపించలేదు. అరుణతో కూడా అంది. అరుణ కూడా వెతికింది ఎక్కడా కనిపించలేదు.

కుసుమ అనుమానం తొందరగా పనిమనిషిమీదకి వెళ్ళింది.

ఇంకోసారి యిల్లంతా వెదికి రాజేంద్ర వారిస్తున్నా వినకుండా పనిమనిషిని అడిగేసింది.

పనిమనిషి గౌరి మొదట కుసుమ యేం అడుగుతోందో అర్థంకాక తెల్లబోయి చూసింది. తర్వాత కుసుమ అడిగింది అర్థం అవగానే యింతెత్తు యెగిరిపడింది. అదసలే చిన్నమాటకూడా పడదు.

అప్పుడే గౌరి అత్త వచ్చింది గౌరికి పిల్లాడిని యిద్దామని. వాడికి ఆరు నెలలు. వాడు బాగా ఏడ్చినప్పుడు గౌరి యెక్కడుంటే అక్కడికి తీసుకొచ్చి పాలిచ్చాక మళ్ళీ తీసుకెళ్ళిపోతుంది.

కోడలు గట్టిగా ఆవేశంగా కేకలు వేయటంతో యేం అర్థంకాకపోయినా ఏదో కుసుమా గౌరీ మాటా మాటా అనుకుంటున్నారని గ్రహించింది.

అత్త యెంత వారించినా గౌరి శాంతించలేదు. దాని నోటికొచ్చినట్టు మాట్లాడసాగింది. కుసుమా గట్టిగా కేకలు వేయసాగింది.

వాళ్ళ కేకలతో గౌరి అత్తకి అసలు సంగతి అర్థమయింది.

గౌరికి చెబుదామంటే గౌరి వినదు. కుసుమని బ్రతిమాలితే కుసుమ వినిపించుకోదు. ఆఖరికి గౌరి నోటిమీద చేయివేసి మూసేస్తూ రెక్క పట్టుకొని ఇవతలకి గుంజింది. అవతల పిల్లాడు గోలెత్తిపోతున్నాడు.

అత్తని ఒక్క విదిలింపు విదిలించింది. "ఏహేః నువ్వుండు. ఆ యమ్మ యెట్టా మాటందో తెల్సా? తింటానికి లేకపోతే ముష్టెత్తుకు తింటాంకొని—గాజుపోతే అది నేను తీసి నట్టేనా? "

"ముందు బిడ్డని చూడేః కక్కటిల్లి పోతుండు" పిల్లాడిని గౌరి చేతుల్లో వుంచింది గౌరి అత్త.

అంత కోపం ఏమయిందో ఏమోః పిల్లాడిని గుండెలకి గట్టిగా అదుముకుంది గౌరి.

అది చూసిన కుసుమ ముఖం తిప్పుకొంది.

ఇది గ్రహించిన గౌరి కసిగా అంది. "అమ్మోః ఈ యమ్మే బిడ్డల్ని సాకుతోంది. ఇంకా బిడ్డల్ని కంటే "

"ఆఁ, ఆఁః దానికీ దీనికీ ఏటే సంబంధం—నువ్వు నోరు ముయ్యే" కసురుకొంది గౌరి అత్త.

"మరి ఆ యమ్మ యేమంటుందో చూసినావా? తన బిడ్డకి ముచ్చటపడి కొన్నదంట. అందుకు బాధపడుతోందంట—యింకోటేదన్నా తీసుకుంటే అడక్కపోనంట "

"నువ్వూరుకోయే గౌరీః ముందు బిడ్డకి పాలియ్యి" అని కుసుమకి ఏదో సర్ది చెప్ప బోయింది.

కాని, కుసుమ ఖచ్చితంగా చెప్పేసింది. "రేపట్నుంచి పనికి రానక్కరలేదు—ఇంక నాకేం చెప్పకు."

'ఇంకా బిడ్డల్ని కంటే' అని గౌరి అన్న మాట కుసుమకి కళ్ళల్లో నీళ్ళు తెప్పించినాయి. ఛీః దీనిచేత పని చేయించుకోకూడదు—ఎంత మాటంది అని బాధ పడింది,

గౌరి అత్త మళ్ళా సర్ది చెప్పబోయింది. కాని కుసుమ వినలేదు.

"మనకేం ఇళ్ళు దొరకవా?" చాలా నిర్లక్ష్యంగా అంది గౌరి.

లోపల కొచ్చేక భార్యతో అన్నాడు రాజేంద్ర, "వాళ్ళతో యెందుకూ, గొడవః అసహ్యంగా."

"ఉన్నమాట అడగడం అసహ్యమా?"

"చూడనిదాని కెందుకూ అడగటంః ఇంట్లో ఎక్కడేనాపెట్టి మర్చిపోయావేమోః"

"ఇంట్లో ఎక్కడా లేదు. అది తియ్యకపోతే ఎవరు తీసేరంటారు?" కస్సుమంది కుసుమ. అసలే గౌరి అన్న మాటకి ఏడ్పొచ్చేట్టుగా వుంది.


ఇంకేమన్నా లాభం లేదని రాజేంద్ర వూరుకున్నాడు.

నాలుగు రోజుల తర్వాత—

రాజేంద్రా కుసుమా గంటనించీ వాదించుకుంటున్నారు.

"ఏభై రూపాయలు యిక్కడ పెట్టాను. నేను బాత్రూంలోకి వెడుతూ నిన్ను తీయమని చెప్పి మరీ వెళ్లాను" అంటాడు రాజేంద్ర.

"ఏమోః మీరెవరికి యిచ్చి మర్చిపోయారోః మీరు మర్చిపోనిదెప్పుడు? మీరు వెళ్ళగానే చూశాను. కాయితాలే వున్నాయి. అవి డ్రాయరు సొరుగులో పడేశాను. మీతో అందామని నేను మర్చిపోయాను" కుసుమ వాదన.



ఇందులో యిద్దరి మాటా నిజమే!

రాజేంద్ర కాయితాలతోపాటు డబ్బు కూడా పెట్టేడు——

కుసుమ వచ్చేసరికి కాయితాలే వున్నాయి——అవి జాగ్రత్త చేసింది.

వీళ్ళిద్దరి వాదనా శేఖరం, అరుణా కూడా విన్నారు.

అరుణ హడలిపోయింది.

తొందరగా వెళ్ళి యేదో ఒక కూర తీసుకురా అని శర్మని పంపితే తీరిగ్గా గంటకు వచ్చాడు.

"ఇదేమిట్రా! ఓ కూర తీసుకురావటానికి గంటసేపా!" అంది కుసుమ.

"అక్కడ చాలామంది జనం వున్నారు" అన్నాడు.

కుసుమ ఎక్కడికో వెళ్లాలి. పని కాలేదని హడావిడి పడిపోతోంది.

అరుణ వచ్చి, "నేను చేస్తాలే వదినా! నీకు టైము అయితే వెళ్ళు" అంది.

"అన్నం పడేశాలే——కాస్త కూరచేసి చారు పెట్టు——అన్నట్టు రెండు దోసకాయ లున్నాయి. పాడైపోతాయేమో పచ్చడి చేసెయ్" అని పురమాయించేసి తను తయారవట్టానికి హడావిడిగా వెళ్ళిపోయింది కుసుమ.

కుసుమ వెళ్తూ "శర్మా! పిల్లల్ని చూస్తూండు. ఎక్కడికీ వెళ్ళకు" అని చెప్పింది. శర్మ సరేనన్నాడు.

అరుణ పిల్లల్ని యిద్దర్నీ తయారుచేసి వెళ్ళి ఆడుకోమంది.

శర్మ ఆడిస్తున్నాడు గదాని అరుణ తన గదిలోకి వెళ్ళి కూర్చుంది.

అరుణకి ఏం తోచటంలేదు. ఏమిటో బెంగా దిగులుగా అన్పిస్తోంది. తల్లి దగ్గర నించి వుత్తరం వచ్చి చాలా రోజులయింది. మీరా యెందుకు రావటంలేదో! ఒంట్లో కాని బాగుండ

లేదేమో! లేకపోతే యిన్నాళ్ళు యెప్పుడేనా రాకుండా వుందా! వెడదామంటే మీరా యిల్లు యెక్కడో తెలియదు. "మీ యింటికి ఓసారి తీసుకెళ్ళు మీరా" అని తను రెండు మూడుసార్లు అంది. మీరా తీసుకెళ్ళలేదు. ఎప్పుడో రాజీతో ఒకసారి వెళ్ళింది. వాళ్ళు మొదట బజారుకి తీసుకెళ్ళి తర్వాత మీరా యింటికి తీసుకెళ్ళారు తొందరై సందులు తిప్పి తన కా దారి గుర్తులేదు.

శేఖరం అక్కడికి వస్తూ అన్నాడు. "అలా వెళ్ళొద్దాం వస్తావా అరుణా!"

రానని తలూపింది అరుణ.

"పనయిపోయిందిగా! అన్నపూర్ణమ్మగారు నిన్నోసారి తీసుకురమ్మన్నారు. మాదురి కూడా చాలాసార్లు చెప్పింది నిన్నోసారి తీసుకురమ్మని."

"నా కెక్కడికీ రావాలని లేదన్నయ్యా!" అంది అరుణ దిగులుగా.

"ఏం? ఎప్పుడూ యింట్లో కూర్చుంటే యేం తోస్తుంది! అలా వెళ్ళొద్దాం రా అన్నాడు శేఖరం అక్కడే వున్న కుర్చీలో కూర్చుంటూ.

"బాగుంది' ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళను. అప్పుడు తోచలేదూ! కానయితే మీరా నాలుగయిదు రోజులకోసారి వస్తూండేది—వంట్లో బాగుండలేదో, ఏమో! ఇన్నాళ్ళు రాకుండా ఎప్పుడూ లేదు."

శేఖరం అనుకున్నాడు మీరా వచ్చినట్టు అరుణ చెప్పకపోవటంతో అతను కాస్సేపుండి నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు "నీ ఫ్రెండుకి నీమీద కోపం వచ్చిందేమో!"

"నా మీదెందుకు వస్తుంది కోపం? నేనేం చేశానని? మీరా కెప్పుడూ నా మీద కోపం రాదు" అరుణ అలా అనటంలో చాలా నమ్మకముంది.

"కోపం లేకపోతే యెందుకు రాదూ! ఎన్నాళ్ళయింది వచ్చి."

"ఆ రోజు మనం డాక్టరు దగ్గరకెళ్ళి వస్తేంటే కలవటమే! ఒకవేళ నేను లేనప్పుడు వచ్చి వెళ్ళిందేమో!"

"నువ్వింట్లోనే వున్నావుగా!"

"సుందరితో రెండు మూడు రోజులు తిరిగేనుగా" అలా అంటూ శేఖరం చేయి చూస్తూ అడిగింది అరుణ. "చేతిమీద ఏమిటి గాటులా వుంది? నేను చూడనేలేదు."

"వూరు వెళ్ళినప్పుడు బస్సులో గీసుకుంది." ఎటో చూస్తూ చెప్పేడు శేఖరం.

మీరాపై బెదిరింపుగా—"ఈ సిగిరెట్టుతో యెప్పుడూ గుర్తుండేట్టుగా ముంజేతిమీదివ్వనా—అద్దంలో చూసుకోగానే ముచ్చటగా కనిపించేట్టు బుగ్గమీదివ్వనా" అన్నాడు తను—కాని—ఆ పనీ మీరా చేసింది—ముంజేతిమీద పళ్ళగాటు—నుదుటిమీద మచ్చ. తనకి రెండు గుర్తులూ యిచ్చింది. అతను క్రాపు కాస్త ముందుకి దువ్వుకుంటున్నాడు ఆ మచ్చ కనపడకుండా. అది అరుణ కంట పడలేదు.

ఇంకో నాలుగురోజులు చూసిన అరుణ శేఖరంతో అంది. "అన్నయ్యా! జ్యోతి వస్తే వాళ్ళింటి కెళ్తాను."

"అన్నయ్యా" అనగానే మామూలుగా తలెత్తిన శేఖరం జ్యోతి పేరెత్తేసరికి చిరాకు పడ్డాడు. "వాళ్ళింటి కెళ్ళడానికి వీల్లేదు" ఖచ్చితంగా చెప్పేడు. (సశేషం)

జ్యోతి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

అడ్డొచ్చిన కన్నీటి కెరటం

ఓలేటి బుచ్చిబాబు

తెల్లారితే భోగిపండుగ!

ఆకాశం నిర్మలంగా వుంది. మచ్చుకయినా తెల్లటి మబ్బుతునక లేకపోవడంతో—చలిగాలి విజృంభించి రివ్వున వీస్తోంది. ఆ సాయం సమయంలో వీధంతా శుభ్రంగా కడిగిన ముత్యంలా వుంది. ఇళ్ళన్నింటికీ సున్నాలు వేసి, కిటికీలకీ, ద్వారాలకీ రంగులురాసి, ద్వార బంధాలకి పసుపుపూసి కుంకుమబొట్లు పెట్టడం వల్ల—'కళకళ'లాడుతున్నాయి ప్రతి యింటి ముందు కల్లాపి జల్లి రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దబడ్డాయి. రెండువేపులా రంగవల్లికల మధ్య సన్నని తారురోడ్డు-మరీ నల్లగా అగుపిస్తూ మెరిసిపోతోంది. ఓ ఇంటి అరుగుమీద రెండు కుట్టుమిషన్లు దడదడలాడుతూ తిరుగుతున్నాయి జోరుగా!

వంట పూర్తిచేసేసి, టీ చేసి ఫ్లాస్కులో పోసి వీధి అరుగుమీద తీరుబడిగా కూర్చుంది అన్నపూర్ణమ్మ. చళిగా వుండడంవల్ల పైట చెంగును నిండుగా కప్పుకుంది లైబ్రరీ నుంచి వచ్చే కూతురు సత్యకోసం రోజూ సాయంత్రం అలా ఎదురుచూడడం ఆమె దిన చర్యలో భాగంగా మారిపోయింది.

అలా కూతురుకోసం ఎదురుచూస్తున్న అన్నపూర్ణమ్మకి-ఎదిరింటి సుందరమ్మగారింటి ముందు రిక్షా ఆగడం, అందులోంచి సుందరమ్మ కూతురు పద్మ-భర్తతో, పిల్లల్తో పండక్కి కన్నవారింటికి రావడం కనిపించింది. నవ్వుతూనే లేచి, గడప దిగి

"బాగున్నారా?" అంటూ పలకరించింది అన్నపూర్ణమ్మ.

"మీ దయవల్ల బాగున్నాం" అని పద్మ, ఆమె భర్తా నమస్కరిస్తూ అంటుంటే,

"నాదేంవుందమ్మా అంతా ఆ భగవంతుడి దయ!' అంటూ పిల్లల్ని ముద్దులాడింది అన్నపూర్ణమ్మ.

ఇంటిముందు రిక్షా ఆగడంతో, చేస్తున్నపని ఆపి గబగబా వస్తోంది సుందరమ్మ.

"సత్య బాగుందా అత్తయ్యగారూ?" అడిగింది పద్మ.

"బాగుందమ్మా."

"ఇంకా లైబ్రరీ నుంచి రాలేదా?"

"లేదమ్మా-దానికోసమే చూస్తున్నాను"

రిక్షావాలాకి డబ్బులిచ్చేసి సూట్‌కేసూ, బ్రీఫ్‌కేసు పట్టుకుని నిలబడిపోయాడు పద్మ భర్త.

"వెళ్ళమ్మా - ప్రయాణం చేసొచ్చారు. అబ్బాయి నిలబడిపోయాడు" అంది అన్నపూర్ణమ్మ. సుందరమ్మ మనవడ్ని [illegible] పక్క మనవరాలినింకో పక్క ఎత్తు[illegible] దారితీస్తుంటే—కూతురూ అల్లుడూ [illegible] అనుసరించడంతో, తిరిగి గడపలోకొచ్చిం[illegible] అన్నపూర్ణమ్మ.

అలా కూర్చుని ఆలోచనల్లో మునిగిన అన్నపూర్ణమ్మకి, ఇంకా పెళ్ళికాకుండా వుండిపోయిన కూతురు గుర్తుకు రావటంలో—పద్మ సంసారాన్ని చూసిన ఆనందం మసకబారి పడిపోయి గుండె భారంగా కొట్టుకోసాగింది.

పద్మా సత్యా ఒకీడు పిల్లలే, కలిసి చదువు

కునేవారు. పద్మకి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు, మరి సత్య? ఇరవైమూడేళ్ళు నిండిపోతున్నా, తన అసమర్థతవల్ల, ఆర్థిక దుస్థితివల్లా-కళ్ళు చెదిరేంత అందంగా వుండికూడా-కన్నెపిల్లగానే కాలం నెట్టుకొస్తోంది.

ఆ స్తిపాస్తులుండడంవల్ల-సుందరమ్మ మంచి సంబంధం చూసి కూతురుపెళ్ళి దివ్యంగా జరిపించేసింది. పెళ్ళయి నాలుగేళ్ళు గడిచినా, ప్రతిపండుగకీ కూతుర్నీ పిల్లల్నీ అల్లుడ్నీ తనింటికి రప్పిస్తూ, పెట్టిపోతలు జరిపించి తన ముచ్చట తీర్చుకుంటోంది. కాస్త తీరికచిక్కి-నలుగురాడవాళ్ళూ ఒక గడపలో కూర్చున్నప్పుడు-ఎంతసేపూ తన కూతురి ముచ్చట్లు ఏకరువుపెడుతూ తెగ సం బర ప డి పో తూ వుంటుంది!

ఇలా సత్యకూ పద్మకూ వున్న వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనబడ్డంతో—అంతరంగంలో పద్మ సంసారంపట్ల ఆమెకు తెలియకుండానే అసూయలాంటి పొర కమ్ముకోవటంతో గతుక్కుమంది అన్నపూర్ణమ్మ!

ఛ-ఛ ఇదేఁవిటీ తనివాళ యిలా అయిపోతోంది? దానదృష్టం దానిది. పద్మ పచ్చగా వుంటే తనలో ఓర్వలేని తనఁవెందుకు చోటు చేసుకోవాలి? పద్మ తన బిడ్డలాంటిది కాదా? తన దిష్టితగిలి పద్మ కష్టాలుపాలు కాకూడదు. భర్తతో పిల్లలతో పదికాలాలపాటు సంసారం పచ్చగా చేసుకోవాలి భగవంతుడు వాళ్ళని చల్లగా చూడాలి. ఇలా అనుకుని, మనసు తేలిక పరుచుకుని, హాయిగా నిట్టూర్చింది అన్నపూర్ణమ్మ.

అదీ ఆమె సంస్కారం!

కూరలసంచీ చేతపట్టుకొని వస్తున్న భర్తను దూరంగా చూసి లేచి నిలబడింది. భర్తతో మాట్లాడి, కూతురి పెళ్ళికోసం అతను కదిలి పనిచేసేలా చేయాలని గట్టి నిర్ణయం తీసుకుందామె.

రామారావు యింటికి రావడంతో అతని చేతిలోని సంచీ అందుకొని లోనికిపోయి కూరలు సజ్జలో సర్దింది. భర్త పెరట్లోకెళ్ళి కాళ్ళు కడుక్కొని లోపలికొచ్చి తుడుచుకుని ఈజీ చైర్లో కూర్చోవడంతో, గ్లాసులో పోసి టీ అందించింది. భర్త టీ తాగి చుట్ట ముట్టించాక అతనికి చేరువగా కూర్చొని

"ఏఁవండీ!"

"ఊఁ"

"సుందరమ్మగారి పద్మా పిల్లలూ అల్లుడూ పండక్కి వచ్చారండీ" అంది.

"ముప్ఫైఏళ్ళ కిందట నేనూ మీ వాళ్ళింటికొచ్చేవాడ్ని" నవ్వుతూ అన్నాడు రామారావు. కమ్మని టీ తాగాక ఘాటైన చుట్ట పీలుస్తున్నాడేమో-అతనికిప్పుడు మంచి హుషారుగావుంది. పైగా వాతావరణం చలిగావుంది. భార్య తనూ మాత్రమేఁ యింట్లో వుండడంచేత ఆ వయసులో కూడా అన్నపూర్ణమ్మ ఆకర్షణీయంగానే అవుపిస్తోంది. ఏభై ఎనిమిదేళ్ళ వయసు పాతికేళ్ళ హుషారు నందుకొంది.

భర్త మాటలకి చోద్యంగా చూస్తూ కాస్త చిరాగ్గా—

"బాగుంది బాగుంది. ముసలికాలానికి ముచ్చట్లనీ మా బాగుందండీ మీ వరుస. అప్పటి ఊసులెందుగ్గానీ—అమ్మాయి పెళ్ళి విషయం పట్టించుకోరేం?" లోలోపల మండుకొస్తుంటే చురుగ్గానే అసలు విషయాని కొచ్చింది అన్నపూర్ణమ్మ.

రామారావు ఊహలకి కాస్త అంతరాయం కలిగింది!

"ఏం చెయ్యమంటావే సంబంధం కుదరొద్దూ? కాగడా పట్టుకుని వెతుకుతున్నా కరువైపోతున్నారు పెళ్ళికొడుకులు" తాపీగా జవాబిచ్చాడు.

"అలాగని ప్రయత్నాలు చెయ్యడం మానుకుంటావుఁటండీ? చేసుకున్నమ్మకి చేసుకున్నంతాని మన తాహతుకి తగ్గ సంబంధం తెచ్చి దాని పెళ్ళి జరిపించెయ్యాలిగానీ ఇలా నిశ్చింతగా కాలం గడిపేస్తుంటే ఎలా?" నిష్ఠూరంగా అంది అన్నపూర్ణమ్మ. ఆమె గొంతులోని తీవ్రతను గమనించి మౌనంగా చుట్ట కాలుస్తూ ఉండిపోయాడతను! కొద్ది క్షణాలు ఊరుకొని

రచయిత గురించి

జనవరి ఒకటి పంధొమ్మిది వందల ముప్ఫయ్యేడులో పార్వతీపురంలో పుట్టేను. అక్కడే టీచర్‌గా పని చేస్తున్నాను. భార్య కస్తూరిబాయ్, అబ్బాయి సుధాకర్.

ప్రధానంగా నాటక రంగానికి చెందిన వ్యక్తిని. గత ఇరవయ్యేడేళ్లుగా నాటక రంగంలో దీక్షతో చేసిన కృషికి గుర్తింపుగా—ఉత్తమ నటునిగా, ప్రయోక్తగా, సహనటీనటుల సమిష్టి కృషికి ప్రతిఫలంగా "ఉత్తమ ప్రదర్శనల"కు ప్రథమ బహుమతులను ఆంధ్ర, ప్రవాసాంధ్రల్లో జరిగిన నాటక పరిషత్తుల్లో అనేక పర్యాయాలు అందుకున్నాను. మా నాటక సంస్థ "చైతన్య కళాస్రవంతి."

గతంలో కొన్ని గేయాలు విశాలాంధ్ర, ఆంధ్ర ప్రభలలో ప్రచురితమయ్యాయి. మూడు నాటికలు, ఓ నాటకం రాసేను. తమ్ముడు శ్రీనివాసరావుభానుతో కలిసి



ఈ మధ్యే మరో నాటిక రాసేను. ఇప్పటి వరకు నేను రెండే రెండు కథలు రాసేను. మొదటి కథ "దాహం" విజయ ప్రచురించింది. "అద్దొచ్చిన కన్నీటి కెరటం" నా రెండో కథ. రెండో కథకి రెండో బహుమతి వచ్చింది. క్లుప్తంగా ఇదీ నా పరిచయం.

కథకి ద్వితీయ బహుమతి ఇచ్చిన న్యాయనిర్ణేతలకు, పోటీపెట్టి ప్రచురిస్తూ ప్రోత్సహిస్తున్న "జ్యోతి"కి నా కృతజ్ఞతలు.

అన్నపూర్ణమ్మే మళ్ళీ అందుకుంది.

"నా మాట కాస్త చెవిని పెట్టండి. మనమ్మాయి ఈడువాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయి ఇద్దరేసి ముగ్గురేసి పిల్లల్ని కూడా కంటూ హాయిగా సంసారాలుచేసుకుంటున్నారు. దానికన్న చిన్నపిల్లలకూడా పెళ్ళిళ్ళయి, నెలలు ఏప్పి గాజులు పెట్టించుకుంటున్నారు. యింకా పస్తాయిస్తూ కూర్చుంటే దానిపెళ్ళి చెయ్యడం మనవశం కాదు. పైగా అమ్మాయిని చూడండి అరబ్బీగుర్రంలా యెలా పెరిగిపోయిందో"

"నీ పోలికే దానీనూ! ఆ వయస్సులో నువ్వెలా వుండేదానివో నా కిప్పటికీ జ్ఞాపకం వుంది"

"చాలు చాల్లెండి పరసం. అయినా యీ వయసులో మీకివేం ఊహాలండీ! పిల్లదాన్ని గురించి ఆలోచించండి బాబూ అని మొత్తుకుంటుంటే మనరోజుల ముచ్చట్లు తలచుకుంటూ లొట్టలేస్తారేం?"

"లొట్టలెయ్యడం కాదు పూర్ణా యివాళెందుకో నాకా గతం అంతా గుర్తుకొస్తోందే... నీకు గుర్తుందా? మన పెళ్ళయిన మొదటి సంవత్సరం పండుగ ముందురోజున మీ వాళ్ళ యింటి వాకిట్లో నువ్వు ముగ్గువేస్తుంటే నేనొచ్చాను. నన్ను చూసి సిగ్గుతో నువ్వు లోపలికి

కుర్రు " అతని మధురస్మృతులకు ఆటంకంగా ఆ యింటిముందు పదిమంది పిల్లలు చేరి

"భోగీమంట—పొయ్యిలో కర్ర

ఇచ్చినమ్మకి పుణ్యం-ఇవ్వనమ్మకి పాపం" అంటూ కోరస్‌గా అరుస్తున్నారు. రామారావూ అన్నపూర్ణమ్మా మౌనంగా అలా వుండిపోవటంతో పిల్లలు రెచ్చిపోతూ "ఇచ్చినమ్మకి పుణ్యం—ఇవ్వనమ్మకి పాపం—పాపం "

"వెళ్ళే—ఓ కర్రపేడు వాళ్ళకి పడేసి పుణ్యం కట్టుకో-లేకపోతే రాత్రిక పెరటిగోడ గెంతి తడకలు పట్టికెళ్ళి భోగీమంటల్లో తగలేస్తారు!" అన్నాడు రామారావు. అన్నపూర్ణమ్మ పెరట్లో రెండు కట్టెలు తెచ్చింది. ఆ గుంపులో కొంచెం పుష్టిగావున్న కుర్రాళ్ళిద్దరు పొడుగాటి వెదురు దండెల్ని దండీలుగా పట్టుకున్నారు. వీధిలోని ప్రతి యింట్లోవాళ్ళూ తెచ్చివేస్తున్న కర్రలు ఆ దండీలమీద వున్నాయి. అన్నపూర్ణమ్మ కూడా కర్రలు వెయ్యడంతో వాళ్ళు ఉత్సాహంగా అరుచుకుంటూ ముందుకు సాగిపోతున్నారు.

ఆమె ఇంట్లోకొచ్చి—

"చూడండీ! మనకా కాలం చెల్లిపోతోంది. మనం కాస్త "హారీ" అనకముందే దానికి పెళ్ళి చేసెయ్యాలి. లేకపోతే మనకి పుట్టగతులుండవండీ" అంటూ మళ్ళీ ప్రారంభించింది. ఆమెగొంతు జీరపోవడం గమనించి మౌనంగా వుండిపోయేడు రామారావు. ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యంచేస్తోంది.

"ఏవిటండీ బెల్లంకొట్టిన రాయిలా అలా వుండిపోయారు? మాట్లాడ్రేం??"

"చూద్దాం చూద్దాం."

"ఆ మాట మీరంటూ వుండడం నే వింటూ వుండడం చాలా కాలంగా జరుగుతోంది."

"నన్ను కాస్త స్థిమితంగా ఆలోచించుకోనియ్యే."

"మీరు స్థిమితంగా ఆలోచిస్తూ కూర్చుంటారని అమ్మాయి వయస్సు పెరక్కుండా అక్కడే ఆగిపోతుందా?"

ఇరకాటంలో పడ్డాడు రామారావు. అన్నపూర్ణమ్మ యివాళతన్ని విడిచిపెట్టేటట్టులేదు. ఏంచెప్పి తప్పించుకుందుకి అతనికి తోచడం లేదు. ఇంతలో పక్కింటి వాళ్ళమ్మాయి శారద "సత్య వచ్చిందండీ?" అంటూ లోనికి రావడంతో నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు.

"శారమ్మా-ఏం" అడిగింది అన్నపూర్ణమ్మ.

"అబ్బే—ఏం లేదండీ మా వారొచ్చారుగా! ఊళ్ళో మూడు సినిమాలు చూసేసినవే! అతనికిక్కడ బోర్ కొడుతోందట! వచ్చేటప్పుడు ఏవైనా కొత్తపుస్తకాలు తెమ్మని పొద్దయం సత్యతో చెప్పాను. తెచ్చిందేమో అనొచ్చేను."

"అలాగా—తేగానే నీకిక్కేస్తాన్లే."

"మరిచిపోకండీ" అంటూ వెళ్ళిపోయింది శారద.

శారదను చూసేసరికి రామారావు మనస్సు మళ్ళా వెనక్కి పరిగెట్టింది. మొట్ట ఎర్రగా కాలోంది.

"పరువంతోవున్న పెళ్ళాన్ని పక్కన పెట్టుకుని బోర్ కొడుతోందట బోరు. నేనిలాగా అనేవాడ్నే మన రోజుల్లో? రాత్రీ పగలూ భేదా లెరక్కుండా మీ ఇంట్లోని ముందు గదిలో ముచ్చటగా గడిపేసేవాళ్ళం కదూ పూర్ణా? అబ్బే ఏం రోజులో ఏం కుర్రాళ్ళో "

"చాల్చాలూరుకోండి మీరూ మీ ప్రతాపాలూనూ. మన అమ్మాయి యీడు ప్రతిపిల్లకీ పెళ్ళయి భర్తతో హాయిగా గడుపుతుంటే— కన్నకూతురి కన్నెచెర విడిపించాలన్న జ్ఞానం లేకుండా-గతాన్ని తల్చుకుని మురిసిపోతూ లొట్టలేస్తున్నారు సిగ్గులేకుండా."

భార్య మాటలతో నీరుకారిపోయేడు రామారావు. అంత చలిలోనూ బిందెడు చన్నీళ్ళు తెచ్చి నెత్తిమీద గుమ్మరించినట్టనిపించి కిమ్మనకుండా వూరుకున్నాడు. ఆమె మళ్ళీ అందుకుని,

"చూడండీ! మీ కేం మగమారాజులు. నలుగుర్లోనూ తలెత్తుకోలేక మధ్యన ఛస్తున్నాన్నేను. పెళ్ళాసు తలపెట్టకుండా దాని జీతంరాళ్ళ కోసం యిలా వదిలేస్తున్నావనీ నలుగురూ గుసగుసలకిపోతున్నారు. ఇదిగో మీకిప్పుడే చెబుతున్నాను. ఏదోలా చేసి తొందర్లోనే దాని



పెళ్ళి జరిపించకపోతే వూరుకునేది లేదు."

"ఎలా జరిపిస్తావే? నీకు తెలియని సంచు లేవున్నాయి నా దగ్గర?"

"ఆ మాటనడానికి సిగ్గుపడండీ—కష్టపడి కూలీ నాలీ చేసుకుంటున్నవాడు కూడా కన్నె పిల్ల కాగానే పెళ్ళి జరిపించేస్తున్నాడు, నా దగ్గరే వుందీ అని మీ లాగ కాళ్ళు తేలేసేడంలేదే?"

"మన బతుకులు వేరు. కాని వాళ్ళకలా కాదే! ఓ రెండొందలు పట్టుకుంటే చాలు—పెళ్ళయిందనిపించేస్తారు వాళ్ళు."

"పేదవాడి బతుక్కి నూర్రూపాలు సంపాదించడం కూడా మీరనుకుంటున్నంత తేలికేం కాదండీ. ఎంత చెట్టుకంత గాలన్నారు; మన తాహతుకి తగ్గ సంబంధం కోసం ప్రయత్నం చెయ్యండి."

"చేతిలో ఏం పట్టుకోకుండా ప్రయత్నమేం చేస్తావే?"

"చేతిలో సొమ్ము చేరాక ప్రయత్నం చేద్దామని కూర్చుంటే మరో జన్మకి దాని పెళ్ళి చేయలేం. అయినా అంమీరి పోయివుంటే యిహ మీరుచేసే నిర్వాకం ఏమిటి?"

ఆరిపోయిన చుట్టను వీధిలోకి విసిరేసొచ్చి కొత్తచుట్టను ముట్టించాడు. అతనికేం లంగరందటంలేదు. పట్టినపట్టు వదలకుండా భర్త చేత సరే అనిపించాలని ఆమె కూర్చుంది.

"చూడండీ! ఈ యింటిమీద నాలుగువేలో అయిదువేలో అప్పు తీసుకురండి. దాంతో పెళ్ళి జరిపించేద్దాం."

మధ్యతరగతి మనిషి బ్రతుకులోని భయం అతని కళ్ళల్లో లీలగా దోబూచులాడుతోంది. వృద్ధాప్యంలో తమ జీవితాలు సాఫీగా సాగిపోయే రెండు కిటుకుల్ని కనిపెట్టి వాటిని తన గుండెలోపలి అరల్లో గుంభనంగా దాచుకున్నాడు రామారావు. అందులోని ఓ కిటుకు తనకు కాకుండా పోవడంతో మొదటి దానికీ రెండోదానికీ పరస్పరం బంధం వుండడంతో అతనికి కోపం వచ్చింది మరి.

"ఇంటిమీద అప్పుతీస్తే తీర్చేదెలా? నీకేమైనా మతిపోతోందా?"

"నిజమేనండీ మతిపోతోంది దాన్నలా చూస్తూంటే" వస్తున్న కన్నీళ్ళు తుడుచుకుంటోందామె. తన పథకం పునాదుల్లో కదిలిపోతుంటే అతనిలో అసహనం చిందులేస్తోంది.

"ఏడాదికి రిటైరయిపోతానన్న దగ్గర్నుంచీ 'ఇల్లు బాగు చేయించండీ' అంటూ సతాయించి చంపేసేవు. వచ్చిన ప్రావిడెండ్ ఫండంతా ఇంటి మరమ్మత్తులకే హరించిపోయింది. నేను వెలగబెట్టిన వుద్యోగానికి ఓ పెన్షనుందా పాడా? ఇప్పుడీ ఇల్లు అమ్మేసి దాని పెళ్ళి చేసేస్తే ఎక్కడుంటాం, ఏం తింటాం? ఈ వయస్సులో పస్తులు పడుకుంటూ చెట్లకింద బికేద్దామా? ఏమిటి నీ ఉద్దేశం?" చాలా తీవ్రంగానే అడిగేడు రామారావు.

"అయితే దాని పెళ్ళి పెటాకులూ జరిపించకుండా అలాగే వుంచేద్దామనా మీ ఉద్దేశం" అంత తీవ్రంగానూ భర్తనడిగిందామె! భర్త వైఖరి చూస్తుంటే ఆమెకు అనుమానంగానూ అయోమయంగానూ వుంది.

ఇహ తీర్పు చెప్పేసె సమయం వచ్చేసిందనుకున్నాడు రామారావు.

"చూడు పూర్ణా! నీ కూతురేం నువ్వనుకుంటున్నంత ముదిరిపోలేదు, బరితెగించేసి తిరగడమూలేదు. పెద్దపెద్ద చదువులు చదువుకుంటున్న అమ్మాయిలు ముప్ఫయ్యేళ్ళొచ్చేసినా పెళ్ళి కాకుండా వేలాదిమందున్నారు దేశంలో. ఆ ఘడియ దానికింకా రాలేదు. కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. ఈ లోగా నువ్వెంత మొత్తుకు చచ్చినా ప్రయోజనం వుండదు, ఇక నోరు మూసుకో" అంటూ విసురుగా లేచి ఆఖరిదమ్ము లాగి చుట్ట వీధిలోకి విసిరొచ్చి కూర్చున్నాడు. అంతే!

జీతంకోసం ఆశపడి ఆడపిల్ల పెళ్ళి జరిపించడం లేదని గుసగుసలకు పోతున్న అమ్మలక్కల తీరుకన్నా—కన్న కూతురి సుఖం కన్నా తమ బ్రతుకే ముఖ్యమని యింత ఖచ్చితంగా తేల్చిచెబుతున్న భర్త వైఖరి ఆమెకు మరీ బాధని, దుఃఖాన్ని కలిగిస్తోంది. లోకం అలా అనుకోవడంలో ఇప్పుడామెకు తప్పుగా అనిపించడంలేదు. కన్నీటికి అడ్డుకట్ట వెయ్యడం ఆమెకు శక్యం కాకుండా వుంది.



ముందు పుట్టిన ముగ్గురు మగబిడ్డలూ అల్పాయుష్కులై, పుట్టిన మూడునెలలకే గతించగా ఆఖర్ని పుట్టి, బట్టకట్టిన ఈ కూతురి బతుకు ఇంత వైభవంగా వెలిగిపోతున్నందుకు కంట తడిపెడుతూ మౌనంగా రోదించడం ఆమె వంతయింది.

వారిద్దరి మధ్యా కొన్ని క్షణాలు యెన్నో యుగాల్లా గడుస్తున్నాయి.

వీధిలో సత్యగొంతు వినిపిస్తోంది. పక్కింటి వాళ్ళమ్మాయి శారదతో మాట్లాడుతోంది. గొంతు తగ్గించి రామారావు హెచ్చరించాడు.


"అనవసరంగా రాద్ధాంతం చెయ్యకు, అమ్మాయి వచ్చేసింది? ఇహ నీ శోకాన్ని కట్టిపెట్టి వెళ్లి ముఖం కడుక్కో. నిన్నలా చూసిందంటే అది తినే తిండి కూడా తినదు" అలా హెచ్చరించడం కూతురుపట్లఅనురాగమో అవశరమో తేల్చుకోలేక కళ్లొత్తుకుని, పెరట్లో కెళ్లి ముఖం కడుక్కొచ్చి భర్త ఆజ్ఞను పాటించిందా ఇల్లాలు.

పుస్తకాలూ, పేకెట్లూ పట్టుకొస్తున్న కూతురు కెదురెళ్ళి "ఇంతాలస్యం అయిందేమమ్మా?" అడిగింది అన్నపూర్ణమ్మ; తన వదనంలో విషాదరేఖలు కనిపించకుండా గట్టి ప్రయత్నమే చేస్తోందామె.

"పండక్కదమ్మా—మూడ్రోజులు సెలవలొస్తున్నాయిగా. పాత పుస్తకాలిచ్చేసేవాళ్లూ కొత్త పుస్తకాలు తీసుకెళ్ళేవాళ్ళూ—ఇలా చాలా పని తగిలిందమ్మా. లైబ్రరీ కట్టేసి, టైలర్ దగ్గరకెళ్ళి నాన్నగారి లాల్చీ, మన జాకెట్లూ పట్టుకొచ్చేసరికి ఈ వేళయింది. ఇదిగో నాన్నారూ మీ షర్టు. తొడిగి చూడండి. పండగ తొందరలో యెలా కుట్టాడో ఏమో" కూతు రందించిన పేకెట్ విప్పి కొత్త షర్టును తేరపార చూసి—తను వేసుకున్న లాల్చీమీదే కొత్త షర్టు సర్దుకుని—

"బావుందమ్మా—బాగానే కుట్టేడు" అంటూ మురిసిపోతున్నాడు. భర్త ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనందాన్ని అదోలా చూస్తోంది అన్నపూర్ణమ్మ. అతని ప్రవర్తన ఆమెకు ఆశ్చర్యకరంగానూ, అసహ్యంగానూ వుండడంతో కూతురు చేతిలోని పుస్తకాలూ, పేకెట్లూ అందుకొని అలమారాలో దాచిందామె.

సత్య పెరట్లో కెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి ఒణికిపోతూ, "అబ్బ—ఎంత చలిగా వుందో" అంటూ తల్లి యిచ్చిన టీని అందుకుంది. సత్య టీ తాగుతుంటే అన్నపూర్ణమ్మ గబగబ కుంపటి రాజేసి తండ్రీ కూతుళ్ళ మధ్య వుంచింది. వేడి వేడి టీ తాగి వెచ్చగా చలి కాగుతూ తండ్రితో కబుర్లలో పడి కాలం



గానే గతుక్కుమంది సత్య. ఒకడు ప్రాజెక్ట్ కంట్రాక్టర్ కొడుకు. మరొకడు మాజీ ఎమ్మెల్యే సుపుత్రుడు.

ఆ యిద్దరూ కలిసి చేసిన ఘనకార్యాలు ఆ ఊరందరికీ తెలిసినవే.

బలిష్టమయిన నల్లని ఎలుగ్గొడ్డుకు తెల్లటి బట్టలు తొడిగినట్టుంటాడు మొదటివాడు. అంత లేసి చెంపలతో పెద్ద మీసాలతో, పిల్లి కళ్ళతో ఎర్ర బిందువలా వుంటాడు రెండోవాడు.

వచ్చినవాళ్ళు ఆ పుస్తకం కాదీ పుస్తకం తెమ్మని, ఈ పత్రిక కాదా పత్రి కిమ్మని లేని అథారిటీ చెలాయిస్తూ—గడగడ మాట్లాడుతూ, అవసరం లేకపోయినా తనను మాటిమాటికీ మాట్లాడిస్తూంటే తనకి ఒంటిమీద గొంగళీలు పాకుతున్నట్లనిపిస్తోంది. వాళ్ళ వాలకాలు చూస్తోంటే అక్కడికి చదువుకోడాని కొచ్చినట్టనిపించలేదు తనకి.

"లైబ్రరీ మూసే వేళయింది. మీకేవైనా నవల్స్ కావాలంటే చెప్పండి" అంటూ పేపర్లు పుస్తకాలు సర్దేసి బీరువామీద వుంచిన పెద్ద తాళంకప్పని టేబిల్‌మీద పెడుతూ అడిగింది తను

ఎలుగుబంటి దొంగచూపులు చూస్తుంటే ఎర్ర బిందు కళ్ళు మరీ ఎర్రగా మెరిసిపోతూ మింగేసేలా చూస్తుంటే వణుకు పుట్టుకొస్తోంది తనకి.

"మీరే కావాలి!"

"వాట్?"

"అనే నవలుందా?" ప్లేటు మార్చి అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు ఎలుగుబంటి. పిల్లి కళ్ళ యెర్ర బిందువ తన వంక పులిలా చూస్తున్నాడు.

"లైబ్రరీలో ఏయే పుస్తకా లున్నాయో ఆ రిజిస్టర్‌లో వున్నాయి. నన్నడగడం అనవసరం" సాధ్యమైనంతవరకూ భయాన్ని కోపాన్ని అణుచుకుంటూ చెప్పింది తను.

ఎలుగుబంటి కంగుతిన్నాడు. ఎర్రబిందువ వేపు చూసేడు. వాడికి లౌక్యం తెలీదులా వుంది, డైరెక్టుగా రంగంలోకి దిగి—

"చూడు పిల్లా నువ్వంటే మా కిష్టం. నీ కెంత డబ్బు కావాలన్నా యిస్తాం. మాతో ట్రావెలర్స్ బంగ్లాకి రావాలి. వస్తావ్ కదూ?" అంటూ తన చెయ్యి పట్టుకున్నాడు. పురుగుని విదిలించినట్టు వాడి చెయ్యిని విసిరేసి రెండో చేత్తో వాడి చెంప 'ఛెళ్ళు' మనిపించింది తను. తెల్లబోయి తేరుకోలేక పోయాడు యెర్ర బిందువ.

వెనకనుంచి ఎలుగ్గొడ్డు తనని భల్లూకప్పట్టు

పట్టాడు. పెనుగులాడుతూ చేతికందిన తాళం కప్పతో వాడి నెత్తిన దఫీ దఫీమని బాదేసింది తను. రక్తం చివ్వున చిమ్మడంతో మూలుగుతూ తన నోదిలేసి కూలిపోయాడు వాడు. ఎలుగుబంటి తెల్ల బట్టలనిండా, లైబ్రరీ నేల అంతా ఎర్రటి రక్తం పారడంతో తనకి భయం పట్టుకుంది. ఆ రక్తం కన్నా మరింత ఎర్రగా వున్న ఎర్రబిందువ చూపులు తనను భయపెడుతున్నాయి. పరుగు లంకించుకొంది. వరండామీద తనను వెంబడిస్తూ "మర్డర్ మర్డర్" అని అరుస్తున్నాడు ఎర్రబిందువ. అతనికి తోడుగా కొన్ని గొంతులు జత కలిసేయి. మరి కొన్ని జతల కాళ్ళు పరుగులు తీసేయి, పరుగు—ఒకటే పరుగు. గొంతు ఎండిపోతోంది. గుండె లవిసిపోతున్నాయి. నీరసం ఆవహిస్తోంది. శరీరంలో శక్తినంతా కూడదీసుకొని పరుగెడుతోంది తను. నాలుక పిడచకట్టుకు పోతోంది. భయం — పరుగు —పరుగు—పరుగు—ఎలుగ్గొడ్డు—తాళం దెబ్బ—రక్తం—చావు—ఖద్దరు లాల్చీలు—పొడుగు జేబులు—కాకీ బట్టలు—ఎర్రటోపీలు—నల్లకోట్లు—జైలు—ఉరి—అమ్మో ఉరి. పోవాలి—తప్పించుకోవాలి. వెనకాల జనం—కేకలు—అదిగో వీధి—అల్లదిగో ఇల్లు. జోగిపోతూ ఇంటికి చేరి తలుపులు మూసి గడియ బిడాయించేసి—హమ్మయ్య—కుప్పగా కూలిపోయింది తను—దాహం—దాహం—వీధిలో జనం—కేకలు—వీధిలో—దాహం—ఇంట్లో

తెలివొచ్చింది సత్యకి. బయట కేకలు లీలగా వినపడుతున్నాయి. పూర్తిగా తెలివి తెచ్చుకుంది తను. పాడు కల. ఎంతగా భయపెట్టింది తనని. బయట భోగిమంటలు వేస్తున్న కుర్రాళ్ళ కేకలవి. గొంతు తడారిపోయింది. నీళ్ళు తాగితేగాని దాహం కట్టేలా లేదు. గదంతా కటిక చీకటి. తడుముకుంటూ అలవాటుగా వెళ్ళి స్విచ్ వేసింది.

ఎదురుగా అగుబడ్డ దృశ్యాన్ని చూసి కొయ్యబారిపోయింది సత్య. మంచమ్మీద రామారావు, అన్నపూర్ణమ్మా ఇంచుమించు దిగంబరంగా వున్నారు.

కూతురు కళ్ళలోకి క్షణంలో సగం సేపు చూసింది అన్నపూర్ణమ్మ. ఆ కళ్ళలో శతకోటి భావాలు. అన్నపూర్ణమ్మకి తన తలని పాతాళాల్లోనికి బలంగా కుమ్మేస్తున్నట్టు అనిపించింది. తేరుకుంది. చేష్టలుడిగి ఆయాసపడుతూ అలాగే వుండిపోయిన భర్త ముఖంమీద పిడికిలితో పొడిచి, కూతుర్ని చూడలేక ముఖాన్ని రెండో వేపు తిప్పేసుకుందామె! రామారావిప్పుడీ లోకంలో కొచ్చి, బట్ట సర్దుకుని, దుప్పట్లో తల దూర్చేసేడు! ఆ తరువాతే చైతన్యం వచ్చిన సత్య చటుక్కున లైటార్పేసింది.

ఇదంతా కొద్దిక్షణాల్లో జరిగింది.

పక్కమీదకి రెండంగల్లో దూకి దుప్పటి కప్పేసుకుంది సత్య. ఆమెకు మతి పోయినట్లయిపోతోంది. ఛీఛీ—ఎంత పని చేసింది తను! వాళ్ళనాస్థితిలో చూస్తూకూడా తనలా నిలబడిపోయిందేవిఁటి? ఛీఛీ వెధవ కల—వెధవ దాహం—బాగా వచ్చిపడ్డాయి. తెల్లారితే పండగ! వాళ్ళనెలా చూస్తుంది తను? తనతో వాళ్ళెలా మెసలుతారు!

అయినా యీ వయస్సులో కూడా అమ్మా నాన్నా

ఇంత బాధలోనూ ఆమె నరాలు జివ్వున లాగేస్తున్నట్టూ, ఏదో కావాలనిపిస్తూ, శరీరం గాలిలో తేలిపోతున్నట్టూ, మతి పోతున్నట్టూ ఫీలౌతోంది సత్య!

అవును! ఆ వయసుకది సహజం మరి!

ఇలా పరిపరివిధాలా మనసు పరుగెడుతుంటే—వీధిలోని పిల్లల కేకలు లీలగా వినపడుతుంటే—వాటిమధ్య సన్నని వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి. ఊపిరి బిగబెట్టి, గట్టిగా కళ్ళు మూసుకుని చెవులకు పని కల్పించిందామె! వెక్కిళ్ళు ఎక్కువకాసాగాయి. అమ్మ ఏడుస్తోందని తెలుసుకుంది తను! నాన్న గొంతు గుసగుసగా ఏదో అంటున్నట్టు వినిపిస్తోంది తనకి. శరీరంలోని శక్తినంతా శ్రవణేంద్రియాల మీదే తను కేంద్రీకరించింది. మంచం కిర్రు

మంది — అమ్మ కాలిమట్టెలు చప్పుడౌతున్నాయి గచ్చుకు తగిలి—అమ్మ నడుస్తున్నట్టనిపిస్తోంది తనకి—పడకగది గడియ తీసిన చప్పుడు—మళ్ళీ నడుస్తున్నట్టు మట్టెల చప్పుడు—పెరటిగడియ తీసిన చప్పుడు—వెనక వీధిలో భోగీమంట వేస్తున్న కుర్రాళ్ళ అరుపులు పెద్దగా వినిపిస్తున్నాయి—చలిగాలి గదిలోకి రివ్వుమని ప్రవేశించింది-తల్లి అలికిడి లేదు. చల్లటి చలి—పెరట్లో పిల్లలకేకలు—అంతే తనకింకేం తెలియడం లేదు.

అమ్మ పెరట్లోకి వెళ్ళుంటుందా? టైమెంతవుతుందో? తెల్లారిపోయిందేవిఁటో? లేచి వెళ్ళి చూస్తే? అమ్మ మొహం తనిప్పుడెలా చూస్తుంది?

ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తూన్న సత్యకి నూతిలో ఏదో పడ్డట్టు పెద్ద శబ్దం వినిపించింది. తల్లి నీళ్ళు తోడుతుందేమో అనుకు[illegible]. గిలక చప్పుడుగాని, చేదబల్లకు త[illegible]లుతున్న శబ్దంగాని, వినబడకపోవ[illegible]ంత ఆమెకు అనుమానం వేసి[illegible]ద భయం పట్టుకుంది. దిగ్గునలేచి లైటు వేసింది. సమయానికి రామారావుకూడా లేచి కూర్చున్నాడు. కూతురి ముఖం చూసి తలవంచేశాడు.

"నూతిలో ఏదో చప్పుడైంది నాన్నా-రండి" అంటూ, పెరటి గదిలైటు, పెరట్లోలైటు వేసి పరిగెట్టింది సత్య. వెనక వీధిలోని ఎత్తుకు వేస్తున్న భోగీమంటల కాంతి, ఎలక్ట్రిక్ బల్బు కాంతి కలిసి పెరడంతా పగటిపూటలా వెలుగ్గా వుంది. పెరట్లో తల్లి కనబడలేదు. నూతిగట్టున లేదు. మరుగుదొడ్డి, స్నానాలకోసం తడికెలతో కట్టుకున్న గది ఆత్రంగా కలియజూసింది సత్య. వెళ్ళి నూతిలోకి చూసింది. నుయ్యంతా చీకటి గుయ్యారంలా వుంది. తండ్రి లోపలనుంచి తెచ్చిన టార్చిలైటు లాక్కొని నూతిలోనికి ఫోకస్‌చేసి "అమ్మా" అని పెద్దగా కేకేసింది సత్య. ఆమె చెయ్యి పట్టుజారి టార్చి నూతిలో పడిపోయింది. ఏడుస్తూ నూతి పళ్ళెమ్మీద కూలబడిపోయింది. ఆమె మెదడు మొద్దుబారింది.

రామారావు రోదిస్తూ పెద్ద పెద్ద కేకలేసి యిరుగు పొరుగు వారిని లాక్కొచ్చేడు. పదిమందీ చేరేరు. అంతా గందరగోళం. ఔనని, కాదని తర్జనభర్జనలు. గబగబా తాళ్ళూ, నిచ్చెనలూ నూతిలోకి దిగేయి. అన్నపూర్ణమ్మను బయటకు తీసేరు. "చనిపోయిందని" కొందరు "కాదు బతకొచ్చని" కొందరు మళ్ళా తర్కించుకుని, పెరటి వసారాలో లైటు వెలుతురులో పడుకోబెట్టేరు. నీళ్ళు కక్కించే ప్రయత్నం చేసి, వృధాప్రయాసని తెలుసుకుని పెదవి విరిచేసారు.

సత్య యాంత్రికంగా లేచి, కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళి తల్లి శవం దగ్గర కూర్చుంది. రామారావు వీధిగడపలోకి పోయి నోట గుడ్డ కుక్కుకుని కుమిలిపోతున్నాడు. ఇల్లంతా గోల, ప్రశ్నలు, ఊరడింపులు, రామరామలు, గుసగుసలు.

సత్య గుండెలాగే వెనుక వీధిలోని భోంగీమంట "భుగ భుగ"మని మండుతోంది. బల్బు కాంతి భోగీమంటల కాంతి కలగలిసి పోవడంతో అన్నపూర్ణమ్మ శవం వింతగా కనుపిస్తోంది. అరమూతగా వుండిపోయిన తల్లి కళ్ళల్లోకి చూస్తోంది సత్య.

"అమ్మా సత్యా! ఎదిగిన ఆడపిల్లకి పెళ్ళి చేసి అది పిల్లాపాపలతో హాయిగా కాపురం చేస్తోంటే నిండుగా ఆనందిస్తారమ్మా తల్లి తండ్రులు. కాని అలా వుంటే ఇక మా ప్రత్యేకత ఏవుంది? మమ్మల్ని చూసేవు కదమ్మా? కన్నెవయసులోని కూతురు కష్టపడి జీతం తెస్తోంటే నవరుచులూ కడుపారా తింటూ కొవ్వెక్కిన మమ్మల్ని కళ్ళారా చూసేవు కదమ్మా? చాలమ్మా ఈ బ్రతుక్కి. ఇంత జరిగేక కూడా యింకా నీ మొహం ఎలా చూడమంటావమ్మా!" అన్నట్లుగా వున్నాయి కన్ను అరమూతగా వున్న అన్నపూర్ణమ్మ చూపులు.

ఇంక తల్లి మొహంలోకి చూడ వీలు లేకుండా సత్య కళ్ళకి అడ్డొచ్చిందో కన్నీటి కెరటం! □



గ్లాస్ డోర్స్ తెరుచుకుని లోపలికొచ్చిన ఆమె వంక చూసి, సోఫాలోంచి లేచి 'రండి' అన్నాడు ధనరాజ్.

ఆహ్వానమొచ్చినా ఆమెలో సంకోచం విడిపోలేదు.

'నిలబడిపోయారేం. రండి. కూర్చోండి' అంటూ ఎదురుగా వున్న సోఫా చూపించి కూర్చున్నాడు ధనరాజ్.

ఆమె కూర్చుంది—అంతవరకూ లేని సిగ్గు ఆయనను చూసేసరికి ఒక్కసారి ఆవరించిందామెను.

"మీరు కాత్యాయిని కదూ."

తలెత్తి అతని ముఖంలోకి చూసి అవునన్నట్లు తలూపింది.

ఈ కథ వెనుక కథ:—

ఈ కథ వ్రాయడానికి నన్ను ప్రేరేపించినది ఒక విచిత్రమైన వార్త: "పిల్లలులేని తల్లిదండ్రులు ఎవరినో ఒకరిని పెంచుకోకుండా వారే కన్నె పిల్లల్ని ఎంగేజ్ చేసి వారికి పుట్టే పిల్లల్ని పెంచుకునే పద్ధతి అమెరికాలో వుంది.—ఒకమారు ఒకాయన పత్రికలో చేసిన ప్రకటనకు అతనికోసం కృత్రిమ సంపర్కంద్వారా పిల్లల్ని కనడానికి 200 మంది ఆడపిల్లలు దర ఖాస్తులుపెడ్తూ అలా కన్నందుకు 200 నుండి 10 వేల డాలర్ల వరకూ ఫీజు అడిగారట—"

మరి మన దేశంలోకూడ యీ పద్ధతి అమలులోకొస్తే ఏం జరుగు తుందీ అనే ఆలోచనలోంచి పుట్టిందే ఈ కథ.

రచయిత.

విషయాన్నెలా ప్రారంభించాలో అతనికి తోచకుండా వుంది—అతని నోటివెంబట ఎటు వంటి ప్రశ్న వస్తుందోనని ఆమెకు ఆందోళనగా వుంది.

'మేగజైన్స్ చూస్తూండండి' అంటూ లేచి లోపలికెళ్ళాడతను.

సంతృప్తిగా నిట్టూర్పు విడిచి తలెత్తి గదిని పరికించింది కాత్యాయిని—అందమైన అద్దాల పెట్టెలాంటి గది, ఖరీదైన సోఫాలు, నేలంతా పరుచుకున్న ఎర్రటి కార్పెట్టూ — గోడలకు మోడ్రన్ పెయింటింగ్సూ—

'ఈ నిర్ణయం తీసుకోడంలో తను తొందర పడలేదు గద' ఒక్కమారు తనను తాను ప్రశ్నించుకుంది కాత్యాయిని. నిర్ణయం తీసు కున్నప్పుడు లేని భయం యిప్పుడు కొత్తగా ఆమె మనసు నావరించింది.

తలుపు తెరచుకుని లోనికొచ్చాడు ధనరాజ్. ధైర్యంగా తలెత్తి అతని ముఖంలోకి చూసింది- వయసు నలభై అయిదుకి మించదు. వంకీల జుట్టు, ఎర్రని ధృఢమైన శరీరము—కత్తిరించిన మీసం ముఖానికెంతో గాంభీర్యాన్ని తెచ్చి పెడ్తోంది. సిల్కు లాల్చీ, పైజామా వేసు కున్నాడు. భుజంమీంచి ఖరీదైన షాల్ వ్రేలాడుకోంది.

చేతిలోనున్న ఫైల్ బల్లమీదుంచి ఆమె కెదురుగా కూర్చున్నాడు ధనరాజ్.

ట్రేతో కాఫీలు పట్టుకొచ్చాడు నౌకరు—

'తీసుకోండి' అంటూ తనూ తీసుకున్నాడు ధనరాజ్—

కాఫీ తీసుకుని సిప్ చేసింది కాత్యాయిని—

"మీరు బియ్యే చదివినట్లున్నారు-ఏ వుద్యో గానికైనా ట్రై చెయ్యలేదా" ఎడంచేత్తో ఫైల్ తిరగేస్తూ అడిగాడు.

"బియ్యే పాసయ్యాక ఏడాది క్రితం వరకూ నేను ఎప్లైయ్ చెయ్యని వుద్యోగమంటూ ఏం లేదు. కానీ యీ మధ్యే ఆ ప్రయత్నంనుంచి విరమించుకున్నాను."

"ఎంచేతో?"

"పరపతీ, డబ్బూలేని మావంటి వాళ్ళకీ రోజుల్లో వుద్యోగా లొస్తున్నాయా చెప్పండి!"

ఆ మాటకు ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు ధనరాజ్. ధైర్యమూ చలాకీతనంతో పాటు తెలివితేటలుకూడ కన్పించాయామె కళ్ళలో—

"అన్నీ ఆలోచించుకునే మీరీ నిర్ణయం తీసుకున్నారా?" అన్నాడు ప్రస్తుత విషయాని కొస్తూ—కాత్యాయినేం మాట్లాడలేదు. ఈలోగా ధనరాజే అన్నాడు-"నాకిది అత్యాసే కావొచ్చు-కానీ అసహజమైన కోరికమాత్రం కాదు—"

కాత్యాయిని తలెత్తి అతని వంక ఆశ్చర్యంగా చూసింది—

"ఈ ఎడ్వర్ టైజ్ మెంటు చూడగానే మీకే మనిపించింది?" అన్నాడు ఆమెవంక చూస్తూ-

"మొదట చాల ఆశ్చర్య మనిపించింది—ఎక్కడో ఏ విదేశాలలోనో యీ పద్ధతి వుందని విన్నాను గాని మన దేశంలోకూడ టెస్ట్ట్యూబ్ ద్వారా గర్భోత్పత్తి జరుగుతోందని నాకు తెలీదు—" అని, అనకూడనిదేదో అన్నట్లు తలొంచుకుంది—

"అయితే మీరు మనస్ఫూర్తిగా యిష్టపడే యిందుకు సిద్ధపడ్డారనుకుంటాను." అంటూ ఆమెవంక చూశాడు ధనరాజ్—

అవునన్నట్లు తలూపింది కాత్యాయిని

"మీ వివరాలన్నీ అప్లికేషన్ద్వారా తెలిసాయి కాబట్టి నా స్వవిషయాలుకూడ మీకు చెప్పాల్సిన బాధ్యత నాకుంది—ఇఫ్ యూ డోంట్ మైండ్ ప్లీజ్ ఫాలోమి" అంటూ లేచాడు ధనరాజ్.

అతని ప్రవర్తన కాశ్చర్యం కలిగినా అతని వెనుకే కదిలింది కాత్యాయిని. వెళ్ళి ఓ లైఫ్ సైజు ఫోటోదగ్గర ఆగాడు ధనరాజ్. ఆ ఫోటోలో వున్న ఆవిడకు పాతికేళ్ళుంటాయి. అందంగా కుందనపుబొమ్మలా వుంది. ఆ అందం వెనుక గర్వం, ఠీవి కన్పిస్తున్నాయి—

"నాకు కొన్ని లక్షల ఆస్థి వుంది—అంతస్తుకు సరిపోయే మేడలూ కార్లూ వున్నాయి. కానీ లేనిదొక్కటే! మనశ్శాంతి" అంటూ కాత్యాయిని ముఖంలోకి చూశాడు.

కాత్యాయిని అతనివంక చూట్టంలేదు—గదినంతా ఆసక్తిగా పరికిస్తోంది.

"మా తల్లిదండ్రులకు సంతానం నే నొక్కడినే. కానీ నాకు ఆ అదృష్టమూ లేదు—ఆ బెంగతోనే నా భార్య కుముదం పోయింది—" అంటూ ఫోటో వంక చూసి తలొంచుకున్నాడు.

"అప్పట్లో బిజినెస్లో పడి నే నంతగా పట్టించుకోలేదు. కానీ యీ వంటరి బ్రతుకు యిప్పుడు దుర్భరంగా తోస్తూంది. మళ్ళీ పెళ్ళి చేసుకునే ప్రసక్తి లేదు. కాని వారసుడు కావాలి. ఎట్లా? ఆ సమయంలోనే నా మిత్రుడు రాజేష్ నాకి ఆలోచన యిచ్చాడు. రాజేష్ అమెరికాలో చదివి అక్కడే కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసి చేయి తిరిగిన డాక్టర్గా తిరిగొచ్చాడు. అతని సలహా నాకూ నచ్చింది—నాతో శారీరక సంపర్కం లేకుండా నా కొక పిల్లవాడిని కనియిచ్చే అందము, ఆరోగ్యమూ తెలివితేటలూ గల కన్య కావాలని ప్రకటించాను—నా అపనమ్మకాన్ని గేలి చేసేటట్లు యిరవై అప్లికేషన్లొచ్చాయి—అందులోంచి మూడు మాత్రమే తీశాను. మీరు మొదటివారు."

కాత్యాయిని మాట్లాడకుండా ధనరాజ్ వెనకే నడుస్తోంది. క్రింది గదులూ, మేడ బాల్కనీ, అక్కడ్నించి చుట్టూ వున్న తోట అన్నీ చూపించాడు ధనరాజ్.

"సంతానంమీద అంత కాంక్ష వున్నవాళ్ళు మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు?" క్రింది కొచ్చి సోఫాలో కూర్చున్నాక అడిగింది కాత్యాయిని. తలెత్తి ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి యిబ్బందిగా కదిలాడు ధనరాజ్.

"కుముదం అందరిలాంటి స్త్రీ కాదు—నిజం చెప్పాలంటే ఆమె నాకు భార్యే కాదు. గురువు, దైవం అన్నీ—అందుకే భౌతికంగా దూరమైనా నా మనసునుండి మాత్రం దూరం కాలేదు" అన్నాడు.

కాస్సేపు యెవరూ యేం మాట్లాడలేదు. తర్వాత ధనరాజే అన్నాడు—"మీరు పూర్తిగా

అంగీకరించినట్లయితే రాజేష్‌కి యిప్పుడే ఫోన్ చేస్తాను. ముందుగా ఆరోగ్య విషయమై కొన్ని టెస్ట్‌లు అవసరమౌతాయేమో."

"నేనన్నీ ఆలోచించుకునే వచ్చాను—యింకా ఆలోచించే అవసరంలేదు—ఇక ఆరోగ్య విషయమంటారా! నాది గట్టి శరీరమే. మీ కా భయంలేదు" అంది కాత్యాయిని ధైర్యంగానే.

ధనరాజ్ లేచి లోపలికెళ్ళి రాజేష్‌తో ఫోన్‌లో మాట్లాడి వచ్చాడు.

"రాజేష్ రేపు వుదయం వస్తాడట. మీ ఆరోగ్యం విషయం మీకంటే డాక్టర్లకు బాగా తెలుస్తుంది అంచేత టెస్టులయ్యాక వీలైతే పది పన్నెండు రోజుల్లోనే మీరందుకు సిద్ధపడాల్సి వుంటుంది. అంతవరకూ మీరు కావలిస్తే మా అవుట్‌హౌసులో వుండొచ్చు" అన్నాడు.

"నో థాంక్స్. నేను వేరేగా పోర్షన్ తీసుకుని వుండాలనుకుంటున్నాను" అంటూ లేచింది కాత్యాయిని.

"ఓ యస్. యాజ్‌యూ ప్లీజ్."

ం ం ం

సీలింగ్‌ఫేను స్లోగా తిరుగుతూంది. రెండు చేతుల్నీ తలక్రింద పెట్టుకుని మంచంమీద వెల్లకిలా పడుకుని తదేకంగా చూస్తూంది కాత్యాయిని.

వారం రోజులయి తన శరీరంలో యేదో వింత మార్పు కన్పిస్తోంది. కడుపులో యేదో చలనం స్పర్శ డబ్బుకోసం పెళ్ళి కాకుండానే, పురుషుడి స్పర్శ లేకుండానే సంతానాన్నిచ్చే సాధనంగా తయారైంది తను. పదివేలంటే మాటలా! సంతానమన్నా మాటలు కాదు—తనకు డబ్బూ ఆయనకు సంతానమూ. అంతే! ఒక్క ఆర్నెల్లు—కళ్లు మూసుకుని యీ అజ్ఞాతవాసం గడిపేస్తే బాధగానైనా యీ బాధ్యతను నెరవేరిస్తే తన జీవితమంతా వెలుగే! డబ్బుందంటే పెళ్ళి చేసుకోవడానికి క్యూలో బోలెడంత మంది! లేదూ? మహా మంచిది! పున్నమినాటి పువ్వులా జీవితాన్ని గడిపేయగలదు—

కానీ కానీ యీ మధ్యలో యేమైనా అయితే?

డబ్బు గురించి బెంగలేదు—అయిదువేలూ తన పేర బేంకులో వేసి పాస్‌బుక్ చేతికిచ్చి మరీ వెళ్ళాడు ధనరాజ్. ఇక బెంగంతా తన శరీర పరిస్థితి గురించే—

ఆ మాటకొస్తే తనిప్పుడు ఆరోగ్యంగానే వుంది—శరీరానికి లావూ నిగారింపూ వచ్చాయి—రావూమరి? మూడు పూటలా పాలూ, పళ్ళూ, బలమైన తిండీ

అనుకోకుండా డొక్కలో వచ్చిన నొప్పికి గిజగిజలాడింది కాత్యాయిని. ఆమె మస్తిష్కంలోని ఆలోచనలన్నీ ఒక్కసారి పటాపంచలైనాయి.

ం ం ం

కాత్యాయిని మస్తిష్కంలోని ఆలోచనలన్నీ ఒక్కసారి పటాపంచలైనాయి ఆ గొంతు విని. కప్పుకున్న దుప్పటిని గుండెల మీదికి లాక్కుని సర్దుకుని చూసిం దతనివంక.

గోధుమ రంగు పట్టు లాల్చీ, పంచ, భుజాలమీంచి వేలాడే స్నఫ్ కలర్ కాశ్మీర్ శాలువా—

ఆ ముఖంలో ఎంతానందం?

"ఎలావుంది మీవంట్లో?"అడిగాడుమళ్ళీ—

ముఖానికి కాస్త నవ్వు పులుముకుని 'ఫర్వాలేదు' అన్నట్టు తలూపింది కాత్యాయిని.

తొట్టెలోని వారసుడివంక తదేకంగా చూస్తున్నాడు ధనరాజ్. అతని కళ్లు సంతృప్తిగా మెరుస్తున్నాయి.

"పుత్రోత్సాహము తండ్రికి " పద్యం గుర్తొచ్చింది కాత్యాయినికి.

"మీ ఆరోగ్యం జాగ్రత్త! మీకేది అవసరమైనా కబురు పంపండి."

వెళ్ళిపోతున్న ధనరాజ్‌వంకే చూస్తూండిపోయింది కాత్యాయిని.

ఆ తర్వాత రెండు మూడు రోజులు రోజూ సాయంత్రం డాక్టర్‌తోపాటే వచ్చి చూసేవాడు ధనరాజ్.

"నే నింకా యిక్కడ యెన్నాళ్లుండాలి డాక్టర్?" అడిగిందో రోజు.

"బాగా కోలుకునేవరకూ" అన్నాడు రాజేష్ ధనరాజ్ వంక చూస్తూ.

"నేను బాగానే వున్నాను డాక్టర్. ఇంకా ఎన్నాళ్ళు యిలా ఒకరికి భారమవడం నా కిష్టం లేదు" అంటూ ధనరాజ్ వంక చూసింది.

ధనరాజ్ కాస్సేపేం మాట్లాడలేదు. తర్వాత అన్నాడు—

"చూడండి కాత్యాయినిగారూ! ఏ విధమైన సంబంధమూ లేకపోయినా మనమొక బంధానికి కట్టుబడ్డాం. కాబట్టి పుట్టిన పాపడిపై మీకూ కొంత బాధ్యత వుంది."

"నో. నో—బాధ్యతలు నాకేం లేవు—ఒప్పందం ప్రకారం నా కర్తవ్యం నేను నెరవేర్చాను. నన్ను పంపిస్తే సంతోషిస్తాను" అంది కాత్యాయిని అతని మాటలకు మధ్యలోనే అడ్డు తగిలి.

ధనరాజ్ వెంటనే యేమీ మాట్లాడలేకపోయాడు.

"పోనీ మంచి ఆయా దొరికేవరకైనా మీరొక నెలపాటు వాడి పోషణ చూడాలని నా కోరిక—ఇది మన ఒప్పందంలో లేదు. ఒప్పుకుంటాను. దీనికి మీరెంత చార్జి చేసినా ఫర్వాలేదు."

ధనరాజ్ మాటలకు దెబ్బతిన్న పులిలా చూసింది—ఆ వెంటనే సంబాళించుకుంది. అవును! డబ్బుతో కాక తనకేం సంబంధం?

"మీ రాలోచించుకునే చెప్పండి. తొందర లేదు" అన్నాడు ధనరాజ్.

"ఒక్కనెలే అయితే నా అభ్యంతరంలేదు" అని రెండ్రోజుల తర్వాత తన అంగీకారాన్ని తెలియజేసింది కాత్యాయిని.

○ ○ ○

బోట్‌హౌస్‌లోకి అడుగుపెట్టిన ధనరాజ్ ఆశ్చర్యంగా వుండిపోయాడు. ఇంట్లో కాత్యాయినిలేదు—ఉయ్యాలతొట్టెలో బాబూలేడు—కానీ బాబు స్థానంలో ఉత్తరముంది. వణికే చేతులతో అందుకున్నాడు దాన్ని ధనరాజ్.

ధనరాజ్‌గార్కి—

ఈ రోజుతో నెల్లాళ్ళ గడువూ పూర్తయింది. మీకు చెప్పి వెళ్ళాల్సింది చెప్పకుండానే వెళ్ళిపోతున్నందుకు క్షమించండి. ఈపాటికి కారణం గ్రహించేవుంటారు. డబ్బుంటే ఏమైనా చెయ్యొచ్చని సంబరపడ్డాను. డబ్బుంటే మరేం అక్కర్లేదని విర్రవీగాను—ఆ గర్వంతోనే ఏ స్త్రీ చెయ్యలేని ధైర్యం చేయగలిగాను.

కానీ కానీ నే నోడిపోయాను ధనరాజ్‌గారూ. కన్యగా, ఓ పిల్లాడి తల్లిగా నే పొందిన అనుభూతి యీ జన్మలో మరువలేనిది. ఆ అనుభవం ఎంత అందమైంది? ఆ అనుభూతికోసం ఎన్ని పుణ్యాలు చేసి పుట్టాలో! తన రక్తంలోని వేరొక రూపం! ఆ స్పర్శ, ఆ చిన్ని నవ్వులు, ఆ కేరింతలు మాతృత్వం యింత తీయనిది కాబట్టే ప్రతి స్త్రీ యిందుకోసం ఆరాటపడుతుందని తెల్సుకున్నాను—పాలు పట్టడంలో, నీళ్ళు పొయ్యడంలో, ముస్తాబు చేయడంలో ఎంత అనిర్వచనీయమైన ఆనందముందో అనుభవపూర్వకంగా తెల్సుకున్నాను—అటువంటి నా బాబుని విడిచి వెళ్ళగలనా చెప్పండి ధనరాజ్‌గారూ!

'మీ అమ్మ ఎవరురా?' అని రేపు ఎవరైనా అడిగితే ఏమని చెబుతాడు నా బాబు? అయినా బాబు తప్ప నాకు మిగిలిందేమిటి? ఈ డబ్బు ఆనందాన్నిస్తుందా? మాతృత్వాన్ని సంపాదించగలదేమో గాని ప్రేమను సంపాదించగలదంటారా?

నా బాబును విడిచి వుండలేనని నిర్ధారించుకున్నాను ధన్‌రాజ్‌గారూ—మీకు చేస్తున్న ద్రోహం క్షమించరానిదే—నా కంఠంలో ప్రాణముండగా నా బాబుకే లోపం రానివ్వనని మాట యిస్తున్నాను. దయచేసి మా కోసం వెదికించకండి.

మీ వల్ల అన్నీ పొందికూడ యేమీ కాలేని— కాత్యాయిని." □

జ్యోతి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

చదరంగంలో చచ్చేది

అనాగత

రోగం ముదరగానే, ముందు ఎర్రబడి చర్మం తర్వాత తెల్లబడ్డట్టూ, పదిన్నర అవుతూన్న సమయానికి ఎర్రటి సూర్యుడు తెల్లబడి తీక్షణ తని పుంజుకొన్నాడు.

నగరం నడిబొడ్డులోవున్న పెద్ద భవనపు పన్నెండు అంతస్థుల్లోనూ హడావుడి మొదలైంది. ఆ భవనపు క్రింద ఆరంతస్తులూ బ్యాంక్ ఆఫ్ ఉటోపియావి. ఆ తర్వాత మూడంతస్థులూ ఓ చిట్‌ఫండ్ కంపెనీవి. ఆ పైవి కథకి అప్రస్తుతం.

బ్యాంకు, ముందుగేటు, పన్నెండు అడుగుల ఎత్తుగా—హుందాగా రాజభవనపు సింహద్వారంలా వుంది. దానిముందు నిలబడ్డ సెంట్రీ కర్తవ్య నిర్వహణకు కంకణం కట్టుకొన్న రాజభటుడిలా శిలలా నిలబడి, కేవలం కనుగుడ్లు తిప్పుతూ దారినపోయే ఆడవాళ్ళను చూస్తోన్నాడు.

దూరం నుంచి 'డబడబా' శబ్దం వినిపించింది.

అంటే చతుర్వేది డబ్బా కారు వస్తోందన్న మాట.

మరునిమిషంలో అదొచ్చి ఫుట్‌పాత్ ఎక్కి ఘోరంగా మూలిగి, ఆగిపోయింది. అందులోంచి క్రిందికి దిగేడు చతుర్వేది. కారుడోరు తాళం వేసేడు. తాళంచేతులు కోటుజేబులో వేసుకొని పర్సుతీసి, పదిపైసల బిళ్ళని గోడకానుకొని కూర్చొనివున్న ముసుగు మనిషివైపు విసిరేడు

బిళ్ళ తగలగానే మనిషి కొద్దిగా కదిలేడు. ముసుగు పక్కకి తొలగించి ఒంటికన్నుతో చతుర్వేదిని చూసి ఆ కన్నుతోనే నవ్వి "దండాలొరా" అన్నాడు.

చతుర్వేది మాట్లాడలేదు.

ఇండియన్ కాంట్రాక్ట్ ఆక్ట్ ప్రకారం, కాంట్రాక్ట్‌ని ప్రతిరోజూ పునర్ చర్చించాల్సిన పనిలేదు. అందుకే అతడు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయేడు. కుష్టువాడు ముసుగు కప్పుకొన్నాడు మళ్ళీ.

కాంట్రాక్ట్ ప్రకారం చతుర్వేది వాడికి రోజుకి పదిపైసలివ్వాలి. అయితే నెలకి మూడు రూపాయలు అప్పనంగా వదులుకొనేటంత మూర్ఖుడుకాదు చతుర్వేది. కానీ తప్పదు. గ్యారేజీకు ఖాళీలేని కారణంగా, అతడికన్నా సీనియర్లు వున్నవాటిని ఉపయోగించుకొంటున్న కారణంగా అతడు తన కారుని రోడ్డుపక్కగా పెట్టుకోవల్సి వస్తూంది. ఈ విషయమై అతడు మానేజిమెంట్‌ని తెగతిట్టుకొన్నాడు. తన స్టేటస్ సింబల్ అయిన 'కారు' ఎండకి ఎండి, వర్షానికి తడవటం అతడికి బాధకరంగా వుంది. అందులోనూ అది బ్యాంకులో అప్పు తీసుకొని కొన్న కారు

ఒక 'లెవల్' దాటిన ఆఫీసర్లకి బ్యాంకే కారునిస్తుంది. అయితే చతుర్వేది ఆ లెవల్‌కి సరిగ్గా ఒకమెట్టు కిందున్నాడు. అతడిపైన ఇంకా అయిదుగురు సీనియర్లూ, అతనికన్నా బాగా పని చెయ్యగలవాళ్ళూ వుండడంవల్ల అతడికి ఆ పదవి యిప్పుడే లభించేటట్టూ లేదు.

చతుర్వేది సీట్లో కూర్చొని, అద్దాల కిటికీలోంచి పైటకి, క్రిందకి చూసేడు. కారు దగ్గర నిల్చున్న కుర్రవాణ్ణి కుష్టువాడు దూరంగా అదిలిస్తోన్నాడు. ఆ కుర్రవాడు ఏదో అంటు

న్నాడు. అంటూ దూరంగా పరుగెడుతున్నాడు.

చతుర్వేది సంతృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. తన కారుకి రక్షణ కలిగించబడ్తూంది.

* * *

చతుర్వేది కూర్చొనేది బ్యాంక్ మూడో అంతస్తులో, కిటికీ దగ్గిర.

అక్కడ కూర్చొని చూస్తే అతడికి రోడ్డూ, రోడ్డు కవతలవైపున్న తన కారూ స్పష్టంగా కనబడ్తాయి. అతడు కారు అక్కడ పెట్టిన కొత్తలో మాటిమాటికీ దాన్ని చూసుకొనేవాడు. అయితే అతడి సంతృప్తి ఎక్కువసేపు నిలబడ లేదు. కారణం రోడ్డున పోయే కుర్రవాళ్ళు! ఇటూ అటూ వెళ్ళే కుర్రవాళ్ళు కారుమీద చేత్తో రాస్తూపోవటం అతనికి చికాకు కల్గించేది.

ఇంతకన్నా పెద్దప్రమాదం అతడికి మూడు రోజులతరువాత కల్గింది. సాయంత్రం అయ్యేక అతడు వెళ్ళిచూస్తే వెనుక చక్రంలో గాలిలేదు. ఎవడో కొంటెకుర్రాడు చేసిన పని అది.

అతడికేం చెయ్యాలో తోచలేదు. తన కారు నెలా రక్షించుకోవాలో అర్థంకాలేదు. ఈ సమస్య అతని దొక్కడిదే. ఎందుకంటే మిగతా వాళ్ళందరి కార్లూ బ్యాంకువాళ్ళిచ్చినవే.

ఈ సమయంలో ఆపద్బాంధవుడిలా కన పడ్డాడు ఆ కుష్టువాడు 'పది పైసలియ్యి దొరా జూసుకొంటా నీ కారు సంగతి' అన్నాడు. చతుర్వేది అతడి వైపు అనుమానంగా చూసేడు అసలు గాలి విప్పింది వీడేనేమో అని కానీ అతడి అనుమానం నిరాధారమని ఆ తరువాత తెలిసింది.

వాళ్ళిద్దరూ కాంట్రాక్ట్‌లోకి 'ఎంటర్' అవ గానే చతుర్వేది కారుమీద గీతలు పడటం మానేసినయ్. కుష్టువాడు తనపని జాగ్రత్తగా చేసుకుపోవటంతో సంతృప్తి చెందేడు అతడు. రోజుకి పదిపైసలు ఖర్చుపెట్టటం అంత కష్ట మనిపించలేదు కూడా. కుష్టువాడు కూడా సంతృప్తి చెందినట్టే వున్నాడు. ఇంకేం కావాలి?

సర్వేజనా సుఖినో భవంతు!

* * *

చతుర్వేది కిటికీ అద్దాల్లోంచి బైటికి చూసేడు. మరుక్షణం కుర్చీలో నిటారుగా అయి, మరింత ఉత్సుకతతో అటువైపు చూడ సాగేడు.

కుష్టువాడుతో వేసిన కుర్రాడు మరో ఇద్దర్ని తీసుకొచ్చినట్టున్నాడు. కారుని ముట్టుకోవడానికి ప్రయత్నం చేస్తోన్నారు. వాళ్ళందరి మధ్యా తన కారు ఏమవుతుందో అన్న భయంతో, వాచ్‌మెన్‌తో చెప్పటానికి చతుర్వేది కుర్చీ లోంచి లేచేడు. కానీ అతడు క్రిందికి వెళ్ళే అవసరం లేకపోయింది.

కుష్టువాడు తన వంటిచుట్టూవున్న దుప్పటిని నేలమీదకు జార్చి, వాళ్ళమీదకు వెళ్ళేడు.

అంతే!

ముగ్గురు కుర్రవాళ్ళు క్షణంసేపు అతడి శరీరాన్ని విభ్రాంతితో చూసి బాణంలా అక్కణ్ణుంచి పరుగుతీసేరు.

చతుర్వేది కూడా ఒకక్షణం కట్రాటే అయ్యేడు. అతడి వెన్నులో వణుకు పుట్టింది. అంతదూరం నుంచి కూడా ఆ బిచ్చగాడి శరీరం అతడికి గగుర్పాటు కలిగించింది.

పచ్చటి ఎండ అతడి శరీరపు శిథిలమయిన భాగాలమీద ఎర్రగా విశ్లేషిస్తూంది. మాంసపు కండరాలు అక్కడక్కడా వ్రేలాడుతున్నాయి. ముక్కు వుండాల్సిన చోట పెద్దరంధ్రం వుంది. కొబ్బరి పీచులాటి జుట్టు నెత్తిమీద అక్కడక్కడా అతికించినట్టుంది. కుడిభుజం మీద పెద్దకురుపు. అక్కడ తెల్లటిరంధ్రం ఘనీభవించినట్టుంది.

మూర్తీభవించిన అసహ్యంలా వున్నాడతడు.

అయితే అతడు ఆ కుర్రవాళ్ళని బెదర గొట్టిన విధానం మాత్రం చతుర్వేదికి భలేనవ్వు తెప్పించింది. కేవలం దుప్పటి తొలగించి, అతడు నిలబడగానే, పిస్తోలు దెబ్బకి బెదిరిన కాకుల్లా కుర్రవాళ్ళు పరుగెత్తేరు. అతడికి బ్రూస్‌లీ జ్ఞాపకం వచ్చేడు.

అతడు తనలో తను నవ్వుకొంటూ కిటికీ దగ్గిర్నుంచి కదిలి సీటు దగ్గిరకు వస్తూంటే మేనేజర్ దగ్గిర్నుంచి పిలుపొచ్చింది. అతడు

కొంచెం బెదిరి, తొందర తొందరగా వెళ్ళేడు.


'బ్యాంక్ ఆఫ్ ఉటోపియా' రీజనల్ మేనేజర్ సర్దార్ హరిభజన్ సింగ్ రివాల్వింగ్ చైర్‌లో తీరిగ్గా కూర్చొనివున్నాడు. చతుర్వేదితో కొంచెంసేపు ఆ విషయాలూ యీ విషయాలూ మాట్లాడి—

"ఏమిటి—ఆ ద్వివేది, త్రివేదీలు పనిలో ఏమీ ఇంట్రెస్ట్ చూపించటం లేదుట" అన్నాడు.

చతుర్వేదికి ఒకక్షణం అర్థంకాలేదు. అర్థం కాగానే అతడు ఆనందంతో పొంగిపోయేడు. ద్వివేది, త్రివేదీలు అతడిపైనవున్న సీనియర్ ఆఫీసర్లు, ప్రమోషన్‌కి అతడికన్నా పైన వున్న అయిదుగురిలో-ఇద్దరు.

చతుర్వేది విజృంభించేడు.

త్రివేది, ద్వివేది—బ్యాంకులో సీనియర్ ఆఫీసర్లయ్యిండీ యూనియన్ పన్లలో ఎలా పాల్గొంటున్నారో చిలవలు పలవలుగా వర్ణించేడు. వాళ్ళక్రింద పని ఎంత మిగిలిపోయి



వుంటుందో వివరించేడు. అలా అయిదు నిము షాలు మాట్లాడి గాలిలో తేలిపోతూ గదిలోంచి బైటకి వచ్చేడు.

అవును మరి రీజనల్ మానేజరంతటి వాడు తనని కాన్ఫిడెన్స్‌లోకి తీసుకొని బ్యాంక్ గురించి 'రహస్యం'గా అడగటం మామూలు విషయమేమీ కాదు.

ఆ ఆనందంలోనే అతడు లంచ్ అవర్‌లో బైటికి వెళ్ళినప్పుడు తన కారుని రక్షించ టంలో ధీరోదాత్తతని ప్రదర్శించినందుకు ఆ బిచ్చగాడికి ఓ అయిదురూపాయలు 'బోనస్'గా ఇచ్చేడు.

అదే ఈ కథని ఓ మలుపు తిప్పింది.

* * *

కుమారి ప్రతిమకి అరగంట నుంచీ అను మానంగా వుంది పెదాలమీద లిప్‌స్టిక్ చెరి గిందేమో అని. చేస్తున్న కూడిక సగంలో వదిలిపెట్టలేక అలాకే కూర్చొని పనిచేస్తూంది. ఆమె ముందున్న నల్లటి బౌండు పుస్తకం, షిఫాను చీరలో ఇమిడిపోయిన ఇరవై రెండేళ్ళ శరీరంలా వుంది ఆమె నుదుటిమీద బొట్టు కూడా అరిస్టోక్రాటిక్‌గానే వుంది. ఆమె చేతిలో పెన్ను జపాన్‌ది. ఆమె నోట్లో భాష బ్రిటన్‌ది.

ఇంగ్లీషులో కూడిక పూర్తిచేసి ప్రతిమ వేళ్ళు విరుచుకొంది. తేడా వచ్చిన పదిపైసల పొరపాటూ దొరికింది.

ఆమె పుస్తకం మూసి లేవబోతూ వుంటే ఎదుటి డెస్క్‌మీద నీడ పడింది. ఆ నీడ నెమ్మదిగా తన వైపు వస్తూవుండటం చూసి ఆమె తలెత్తింది.

అంతే.

ఆమె కెవ్వున పెట్టిన కేకకి బ్యాంక్ సిబ్బంది అంతా పని ఆపి చప్పున తల తిప్పి చూసేరు.

ఆమె ముందు కుష్టువాడు నిలబడి వున్నాడు.

అతడి భుజంమీద నుంచి దుప్పటి క్రిందికి వేలాడుతూంది. కుడివక్క, రోగం తినేసిన సగం చెవి కూడా అలానే వేలాడుతూంది. డెస్క్‌మీదున్న గాజు అద్దంలో—భుజం మీదున్న ఎర్రటి రక్తపు మరక ప్రతిబింబి స్తూంది. ఎడమవైపు గాజుకన్ను ప్రతిమనే చూస్తూంది. అతడు చెయ్యి చాపేడు. ముందుకు సాచిన చేతిలో—బొటనవేలు పక్క నుంచి కారిన చీముతో తడిసిన అయిదు రూపాయల నోటుంది.

ఆ అయిదురూపాయల నోటు ముందు కొస్తూంటే ఆమె మరోసారి "కెవ్వు"న అరిచింది.

* * *

చతుర్వేది అంతకు అయిదు నిముషాల క్రితమే వాణ్ణి తన కారుపక్క చూసేడు. వాడు అక్కణ్ణుంచి లేవటం చూసి ఆశ్చర్య పోయేడు. అతడి యిన్ని సంవత్సరాల అను భవంలో వాడు ఆ ప్రదేశంలోంచి లేవటం మొదటిసారి చూస్తున్నాడు.

చతుర్వేది చూస్తూ వుండగానే వాడు రోడ్ క్రాస్ చేసేడు. చతుర్వేది కిటికీలోంచి బాగా ముందుకు వంగి అతణ్ణి చూస్తూన్నవాడల్లా అమాంతం స్పృహ తప్పి మూడో అంతస్తు మీదనుంచి క్రింద పడిపోయేవాడే. ఎలానో నిల దొక్కుకొన్నాడు. అయినా—ఉద్వేగం తగ్గ లేదు.

అతడు చూసిన దృశ్యం అటువంటిది మరి!

పదిహేను వందల కోట్ల డిపాజిట్లతో, ఏడు వందల కోట్ల ఋణాల్తో, సంవత్సరానికి నాలుగు కోట్ల లాభాల్తో నడుస్తూన్న 'బ్యాంక్ ఆఫ్ఉటో పియా' ఎయిర్‌కండిషన్డ్ బిల్డింగ్‌లోకి-ఒక కుష్టువాడు ప్రవేశించటమా?

* * *

అందరికన్నా ఎక్కువ భయపడింది సెంట్రీ. ప్రతిరోజులాగే అతడు స్టూల్‌మీద కూర్చొని జోగుతున్నాడు. లోపలికి వస్తున్న వాణ్ణి చూడలేదు. ప్రతిమాదేవి కేకతో నిద్ర నుంచి తేరుకొని లోపలికి పరుగెత్తుకొచ్చేడు. కౌంటర్ దగ్గర నిలుచున్న కుష్టువాణ్ణి చూసి క్షణంపాటు నిశ్చేష్టుడైనా, అంతలోనే తేరు కొని చేత్తో తోయబోయి, అంతలోనే వాడు

జననం 1957లో. విద్యాభ్యాసం రోజరీ, రెడ్డీ కాలేజీలలో. ప్రస్తుత నివాసం 332, పి. యస్. నగర్, హైద్రాబాద్-27.

"చదరంగం " మొదటి కథ. ఆర్థర్ హెయిలీ మనీ ఛేంజర్స్ చదువుతూంటే ఈ ఆలోచన వచ్చింది. అయితే, బ్యాంకులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటానికి మాత్రం కొద్దిగా కష్టపడవలసి వచ్చింది. ఇలా ఇన్ఫర్మేటివ్‌గా వుండే కథలూ, నవలలూ వ్రాయటంలో వుండే తృప్తి మామూలు ప్రేమ కథల్లో వుండదని నా ఉద్దేశ్యం. నా అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి ఈమె రచన్లు 'చదివిస్తాయి' కాబట్టి.



పేరునిబట్టి గాక, మొదటి రచనకే బహుమతి నిచ్చిన జ్యోతి సంపాదక వర్గానికి కృతజ్ఞతలు.

—అనూగీత

కుష్టువాడని గుర్తుకొచ్చి, చేతిలోని లాఠీతో తోస్తూ, "జావ్ జావ్—బాహర్ జావ్" అన్నాడు.

"దండాల్దొరా అయిదు రూపాయలు వ్యాంక్‌లో ఎయ్యాల" అన్నాడు వాడు ఆ సెంట్రీయే బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరన్నంత నమ్రతతో.

వాడి మాటలు అందరికీ స్పష్టంగా వినిపించాయ్.

ఆ హాల్లో వున్న యాభైమందీ ఒకళ్ళ మొహాలొకరు చూసుకొన్నారు

ఈ లోపులో చతుర్వేది అక్కడికి మెట్లు దిగేడు.

క్షణంలో పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు.

"ఇధర్ నై ఆనా జావ్" అని పురుగుని తోసేసినట్టు తోస్తున్నాడు సెంట్రీ. అసలు వాణ్ణి గేటు దగ్గిరే ఆపు చెయ్యలేదన్న విషయాన్ని యెవరైనా గుర్తిస్తారేమో అన్న భయం వాడిది.

"బాంఛన్ యీ అయిదు రూపాయలు "

సెంట్రీ ఏదో అనబోతూ వుంటే చతుర్వేది కల్పించుకొంటూ, "మూడయింది. ఇప్పుడేసుకోరు. రేపొద్దున్నరా పో" అన్నాడు.

కుష్టువాడు చతుర్వేదిని చూసి, ఎడారిలో ఒయాసిస్ చూసినవాడిలా దగ్గర కొచ్చి, ఆనందం నిండిన మొహంతో "దండాల్దొరా" అన్నాడు.

చతుర్వేది చప్పున అడుగు వెనక్కి వేసి "సర్లే-సర్లే—రేపు రా పో" అన్నాడు

"గట్లంటావు ! సర్లె రేపొద్దు గాలె వాస్త" అని వెను దిరిగేడు. నెమ్మదిగా బైటకి వెళ్ళిపోయేడు.

కుమారి ప్రతిమ తేలిగ్గా వూపిరి పీల్చుకొంది అయిదు నిముషాల్లో ఎవరి పన్లలో వాళ్ళు మునిగిపోయేరు.

అప్పటివరకూ జరిగిందంతా చూస్తూ నిలబడ్డ ఓ వ్యక్తి కూడా, ఇక అక్కడ చేయవలసిందేమీ లేనట్టూ, అక్కడనుంచి కదిలేడు. అతడి చెప్పులు తెగటానికి సిద్ధంగా వున్నాయి. చేతిలో నల్లగొను చిరగటానికి సిద్ధంగా వుంది.

అతడి పేరు పంతులు.

లాయర్ పంతులు.

* * *

"చతుర్వేది చాలా తెలివితక్కువగా ప్రవర్తించేడు" అన్నాడు త్రివేది మేనేజింగ్ డైరెక్టర్‌తో. "మళ్ళీ రేపు రమ్మన్నాడట ఆ లెప్పర్‌ని. ఇది బ్యాంక్ అనుకున్నాడా—పెళ్ళివారిల్లు అనుకున్నాడా భోజనాల తరువాత రమ్మని చెప్పటానికి. రేపొస్తే ఏం చేస్తాడట? అసలు అతడికెందుకట మధ్యలో. ఆ సెంట్రీ వెళ్ళగొట్టేవాడుగా. గోటితో పోయేదానికి గొడ్డలితో చెయ్యటం అంటే ఇదే—"

సర్దార్ హరిభజన్‌సింగ్ తెల్లటి గెడ్డం సవరించుకొంటూ అంతా విన్నాడు. తరువాత బెల్‌కొట్టి చతుర్వేదిని పిలిపించేడు. చతుర్వేది రాగానే, గదిలో వున్న త్రివేదిని చూసి జరిగినదంతా చెప్పే వుంటాడని గ్రహించేడు.

"ఏమిటి కుష్టువాళ్ళతో అకౌంట్లు ఓపెన్ చేయిస్తున్నావట" అన్నాడు సర్దార్.

"అతడే వచ్చాడు సార్!"

"రేపు రమ్మన్నావుట."

"మరి మన టైమ్ అయిపోయిందిగా ఈ రోజు."

"అంటే—?" మానేజింగ్ డైరెక్టర్ చప్పున తలెత్తి అడిగేడు. "రేపు వాడి దగ్గిర్నుంచి ఆ డిపాజిట్టు తీసుకుందామనేనా?" ఆకాశం కూలినంత ఆశ్చర్యం కనపడింది అతడి కంఠంలో.

"తీసుకోకుండా రిజెక్ట్ చెయ్యగలమా?"

ఈ తిరుగుప్రశ్నని వూహించలేదు. ఓ క్షణం తెల్లబోయి చూసేడు. అతణ్ణి రక్షించవలసిన బాధ్యత తనమీదున్నట్టు త్రివేది అందుకొని అన్నాడు. "ఎందుకు చెయ్యలేం? అసలు వాణ్ణి లోపలికి రానిచ్చేదెవరు?" అని లేచినిలబడ్డాడు. "పర్మిట్ మి సర్. ఇంత చిన్న విషయాన్ని గురించి మీరెందుకూ ఆలోచించటం? నేను తేల్చేస్తాను"

మానేజింగ్ డైరెక్టర్ తలూపేడు.

త్రివేది చతుర్వేదివైపు గెలిచినట్టు చూసి బైటకు నడిచేడు. చతుర్వేదిని గెలవటం ఇంత సులభం అని త్రివేది అనుకోలేదు.

అయితే అది అంత సులభం కాదని మరుసటిరోజు తేలింది.

* * *

ఆ మరుసటిరోజు త్రివేది ఆజ్ఞ ప్రకారం కుష్టువాడు గేటుదగ్గిరే ఆపుచెయ్యబడ్డాడు.

బ్యాంకు పని ప్రారంభమయి పది నిముషాలయింది. డబ్బు వెయ్యటానికి వచ్చేవాళ్ళు, తీసుకోవటానికి వచ్చేవాళ్ళతో బ్యాంకు రష్‌గా వుంది.

ఆ టైమ్‌లో కుష్టువాడు తన ప్రదేశం నుంచి లేచి బ్యాంక్‌లోకి వచ్చేడు. మామూలుగానే అతడు గేటుదగ్గిర ఆపుచెయ్యబడ్డాడు.

"నేను లోపలికెల్లాల" అన్నాడు వాడు.

"కుదర్ద"న్నాడు సెంట్రీ.

"ఏం? ఎందుక్కుదరు."

దూరంగా కాష్ కౌంటన్ దగ్గిర నిలబడ్డ చతుర్వేది, ఇదేమీ తనకు పట్టనట్టూ, లెడ్జెర్ చెక్ చేస్తూ, ఓ చెవి ఇటు పారేసి వుంచేడు. నిజానికి ఆ క్రితం రోజు సాయంత్రమే ఆ కుష్టువాడికి యేం మాట్లాడాలో చెప్పివుంచాడు అతడు.

"ఇక్కడ డబ్బుల్దీసుకోరా—"

"తీస్కోర్ తీస్కోర్. జావ్."

కుష్టువాడు జోలిలోంచి తెల్లకాగితం తీసి "గట్టని రాసివ్వు" అన్నాడు.

సెంట్రీ తెల్లబోయేడు. ఈ పరిణామాన్ని అతడు వూహించలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. రెండో సెంట్రీని చప్పున త్రివేది దగ్గిరకు పంపించేడు.

చతుర్వేది పెదవులమీద సన్నటి చిరునవ్వు వెలిసింది. కనుకొలుకుల్లోంచి ఎడమపక్కగా చూసేడు. భుజానికి సంచి వేలాడేసుకొని, చేతిలో వున్న చిన్న నోట్‌బుక్ మీద పెన్సిల్‌తో వ్రాసుకొంటూ పోతున్నాడు ఓ కుర్రవాడు. చతుర్వేది అతడిని చూసి మరింత సంతృప్తిగా నవ్వేడు.

ఈ లోపులో రెండో సెంట్రీ మూడో అంతస్థులో వున్న త్రివేది దగ్గిరకు వెళ్ళి కుష్టువాడు ఇలా రాసిమ్మంటున్నాడనీ, ఏం చెయ్యాలో చెప్పమనీ అడిగేడు.



"అసలు వాడితో మాటలేమిట్రా—మెడ పట్టుకొని గెంటక." అని విసుక్కున్నాడు త్రివేది ఫైళ్ళ మధ్యనుంచి తలెత్తి.

కర్తవ్య నిర్వహణాపరుడైన సెంట్రీ కిందికొచ్చి అలానే చేసేడు. కుష్ఠువాడు మెట్లమీద జారిపడ్డాడు. అంతలో హాలులో ఒక మూల విజిటర్స్‌కోసం వేసిన బల్లమీద కూర్చొన్న వ్యక్తి లేచి బిగ్గరగా అరిచేడు.

"ఐ ప్రొటెస్టు దిస్ ఇన్ ఎ కోర్ట్ ఆఫ్ లా. ఈ అమానుష చర్యని నేను కోర్టులో సవాలు చేస్తాను. డబ్బు డిపాజిట్ చెయ్యటానికి వచ్చిన ఓ వ్యక్తిని గెంటెయ్యటానికి బ్యాంక్‌కి వున్న అధికారం ఏమిటి?"

హాలులో సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దం అలుముకొంది. అప్పటి వరకూ నవ్వుతూ చూస్తున్న చతుర్వేది కూడా ఈ ఆకస్మిక పరిణామానికి విస్తుపోయేడు. పెదాలమీద నవ్వు మాయమైంది. ఈ మలుపుని అతడు వూహించలేదు. ప్రాక్టీసులేని వో లాయరు ఈ పరిణామాన్ని క్రితం రోజు సాయంత్రమే వూహించేడనీ, అందుకే ఈ రోజు ప్రొద్దున్నే వచ్చి కూర్చొన్నాడనీ అతడికి తెలీదు. చాలా చిన్న గొడవతో ఇది తేలిపోతుందనీ, తన పై అధికారి అయిన త్రివేది తెలివితక్కువతనం పై అధికారులకి తెలుస్తుందనీ భావించేడు. అందుకే తనకి తెలిసిన ఓ దినపత్రిక కరస్పాండెంటుని పిలిచి తమాషా చెయ్యాలనుకొన్నాడు. పేపర్ చివరి పేజీలో చిన్న అక్షరాల్తో ఈ వార్తపడితే, అంతటితో పని సరి అనుకొన్నాడు.

కానీ మొదటి పేజీలోనే పెద్ద అక్షరాల్తో పడ్తుందనుకోలేదు.

* * *

'తాజా పత్రిక' అన్నది తెలుగుదేశంలో అధిక ప్రచారంలో వున్న దినపత్రిక. ఎల్లుండి వార్తల్ని కూడా ముందుగానే ప్రచురించటం దాని ప్రత్యేకత. అందులోనూ అందరికీ ఆసక్తిదాయకమైన విషయాలని మరీ ప్రముఖంగా ప్రచురిస్తుంది—అది అంత పెద్ద వార్త కాకపోయినా! అందుకే ఈ వార్తని మొదటిపేజీ మధ్యలో బాక్సు కట్టి ప్రచురించింది. ఇలా—

బ్యాంక్‌లోకి కుష్ఠువాడు ప్రవేశించటానికి అనర్హుడా? లాయర్ సవాల్!

జనవరి 14: నిన్న ప్రొద్దున్న బ్యాంక్ ఆఫ్ ఉటోపియా కాష్ కౌంటర్‌లో ఒక చిత్రమైన సంఘటన జరిగింది. ఒక కుష్ఠువాడు తన జీవితపు పొదుపు మొత్తాన్ని పొదుపు చేయటం కోసం రాగా, అతడిని సెంట్రీలు ఆపు చేసేరు. ఇది చూసిన లాయరొకరు ఈ అమానుష చర్యని గర్హించేరు. ఆ తరువాత లాయర్ పంతులు పత్రికా ప్రతినిధుల్తో మాట్లాడుతూ తను ఈ విషయాన్ని కోర్టు ద్వారానే తేల్చుకోదల్చామని అన్నారు.

* * *

ఈ వార్త పడిన మరుక్షణం తాజా పత్రి కాపీసుకి వందలమీద వుత్తరాలు రాసాగినయ్. కొత్తపల్లి నుంచీ కోటా రామలింగం, సరోజ పద్మా యింకా వారి మిత్రులూ, గడ్డి అన్నారం నుంచి యాదగిరి వగైరాలే కాక కొత్తగా ప్రాక్టీసు పెట్టిన లాయర్లు, ఒక రిటైర్డ్ జడ్జి కూడా తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చేరు.

దాంతో పత్రిక ఎడిటర్ సబ్ ఎడిటర్‌ని పిలిచి ఈ విషయాన్ని యిప్పట్లో ఆపుచెయ్యవద్దనీ, ప్రతిరోజూ కొద్దిగా స్థలం దీని గురించి కేటాయించమనీ చెప్పేడు.

* * *

బాంక్ ఆఫ్ ఉటోపియా నాలో అంతస్థు బోర్డ్ రూమ్‌లో అత్యవసర సమావేశం జరిగింది. ఎయిర్‌కండిషనర్లు నిశ్శబ్దంగా చప్పుడు చేస్తున్నాయి.

రీజనల్ మానేజర్ హరిభజన్‌సింగ్, ఆపరేషన్స్ మానేజర్ అరోరా, సెక్యూరిటీ చీఫ్ జె. జె విలియమ్స్, త్రివేది, ద్వివేది, చతుర్వేది, యింకా యితర ఎగ్జిక్యూటివ్స్, లీగల్ ఎడ్వైజర్ పండిత్ కూర్చొని వున్నారు.అందరి మొహాల్లోనూ టెన్షన్ కొట్టొచ్చినట్టు కనబడ్తూంది.

రీజనల్ మానేజర్ సెక్యూరిటీ చీఫ్‌వైపు చూసేడు. చీఫ్ యింగ్లీషులో అన్నాడు. "బాంక్‌లోకి రానివ్వటానికీ, రానివ్వక పోవటానికి బాంక్‌కి అధికారం వుంది. న్యూసెన్స్ కేస్ కింద ఆ లాయర్ మీద పోలీసు కంప్లెయింట్ యివ్వొచ్చనీ, తాజా దినపత్రికమీద డామేజెస్ కోసం కోర్టులో కేసు వెయ్యొచ్చనీ నా వుద్దేశ్యం."

"రైట్స్ ఆఫ్ అడ్మిషన్ అన్నది, హోటళ్ళకీ, బార్లకే పరిమితం అని నా వుద్దేశ్యం" అన్నాడు త్రివేది, బొల్లి వున్న చేతివేళ్ళ మధ్య పేపర్ వెయిట్ తిప్పుతూ.

చతుర్వేది మాట్లాడకుండా ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

అందరూ మాట్లాడటం అయిపోయేక లీగల్ అడ్వైజర్ టు ది బ్యాంక్, పండిత్ గొంతు సవరించుకున్నాడు. ఇతడికి అసలు సబ్జెక్టే రాదనీ, కేవలం ఎదుటివాళ్ళని కన్ఫ్యూజ్ చేసి పబ్బం గడుపుకొంటాడని ప్రతీతి.

అతడు చెప్పటం మొదలుపెట్టేడు.

"బ్యాంకింగ్ అనేది ఇవ్వటం—పుచ్చుకోవటం అనే కాంట్రాక్టు ఆక్టుమీద ఆధారపడి వుంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే. అటువంటప్పుడు "నేను పుచ్చుకోను" అని బ్యాంకరు అనొచ్చు. కానీ "డిపాజిట్ల" కోసం పేపర్లలో అడ్వర్‌టైజ్ చేస్తున్న మన బ్యాంకు, ఒకడు డబ్బు కట్టటానికి వచ్చినప్పుడు "కాదు" అనలేదు. అది ఓపెన్ ఆఫర్ కాబట్టి"

"కానీ చదువురాని వాణ్ణి వప్పుకోనక్ఖర్లేదు బ్యాంకు" అన్నాడు ద్వివేది పెద్ద పరిష్కారం కనుగొన్నవాడిలాగా. "సంతకం పెట్టలేనివాడు డిపాజిట్ యెలా చేయగలడు? ఆ కారణంగా అతణ్ణి తిరస్కరించవచ్చు" అని మెచ్చుకోలుకోసం మానేజింగ్ డైరెక్టర్ వైపు చూసేడు.

నిన్న రాత్రంతా ఈ కేసు విషయమే చదివేడు కాబట్టి పండిత్ తడువుకోలేదు.

"కేవలం చదువుకోని కారణంగా ఒక వ్యక్తిని మనం నిరాకరించలేం. ఒక గౌరవనీయమైన వ్యక్తిని యెదురుగా పెట్టుకొని, తన తరుపున ఎవరైనా ఏజెంటుగా నియమించటానికి కుష్ఠువాడికి అధికారం వుంది. అయితే ఆ ఏజెంటుతోపాటూ ప్రతిసారీ ఆ కుష్ఠువాడు కూడా బ్యాంకుకు వస్తూ వుండాలి."

"అది మరీ ఘోరం" అన్నాడు హరిభజన్ సింగ్.

సభ్యులకి జీడిపప్పూ, టీ సర్వ్ చేయబడింది. అవి తింటూ వాళ్ళు ఈ కుష్ఠు సమస్యను చర్చించసాగేరు.

"ఇది చాలా చిన్న సమస్య అని నా వుద్దేశ్యం" అన్నాడు ద్వివేది. అతడింతవరకూ మాట్లాడలేదు. "—బ్యాంక్ అన్నది పబ్లిక్ ప్లేస్. ఆ ప్రదేశంలోకి అంటురోగులు రాకూడదు అని "హెల్త్ ఆక్ట్" చెబుతుంది. ఇంత చిన్నవిషయానికి "కాంట్రాక్ట్ ఆక్ట్" వరకూ వెళ్ళక్ఖర్లేదు"అని గెల్చినట్టూ పండిత్ వైపు చూసేడు.

సాధారణంగా ఏ సంస్థలోనూ పెద్దస్థానాల్లో వుండే ఏ ఇద్దరికీ పడదు

పండిత్ మొహం పెనంలా మాడిపోయింది.

చతుర్వేది అంతలో చిన్నబాణం వదిలేడు-"కుష్ఠు అంటురోగమేనా?" అని.

అక్కడున్న వాళ్ళకెవరికీ తెలీదు—అది అవునో కాదో.

ఫస్ట్ సెక్రటరీ టుది మానేజింగ్ డైరెక్టర్, జనరల్ హాస్పిటల్ స్కిన్ స్పెషలిస్ట్‌కి ఫోన్ చేసి, అయిదు నిముషాల్లో కావల్సిన సమాచారం తెప్పించేడు-కుష్ఠు అంటురోగం కాదని,

సమస్య మళ్ళీ మొదలుకొచ్చింది.

అప్పుడు అక్కడున్న వాళ్ళందర్లోకి చిన్నవాడు ఒకడు లేచి నిలబడ్డాడు అతడు చిన్నప్పుడు కమ్యూనిష్టులోనూ పదవిలోకి వచ్చేక కార్లకోనూ తిరుగుతున్నాడు

"అసలు మనం ఆ డిపాజిట్టు వప్పుకొంటే నష్టం ఏమిటి?" అంటూ బల్లగుద్దేడు. "ఐదు రూపాయల గురించి కాబట్టి మనం యింత ఆలోచిస్తున్నాం. అదే అయిదు లక్షలిస్తానంటే వాడికి కుష్టుకన్నా వెయ్యిరెట్లు పెద్దరోగమున్నా వెళ్ళి నవ్వుతూ ఆహ్వానిస్తాం."

అది నిజమన్నట్టూ ఎవరూ మాట్లాడలేదు.

హరిభజన్ సింగ్ కొంచెం ఇబ్బందిగా కదిలి "అది కష్టం. ప్రతిమ వప్పుకోవటంలేదు వాడి దిగ్గర్నుంచి డబ్బు తీసుకోవటానికి—"

కమ్యూనిష్టు విస్మయం ప్రకటించేడు "హూ ఈజ్ షీ? తీసుకోకపోవటానికి ఆవిడెవరూ? ఐయామ్ సారీ మన బ్యాంకు—, క్లర్కుల దయాదాక్షిణ్యాలమీద నడుస్తూందని ఇప్పుడే తెలిసింది—"

"ఆవిడ్ని ట్రాన్స్‌ఫర్ చేస్తే—"

"తన ప్రతిష్ఠకి భంగం కల్గుతుందని ఆవిడ అనుకుంటుంది."

ఈ మాటలకి కమ్యూనిష్టు రెచ్చిపోయేడు. "ఆవిడకంత ప్రాముఖ్యత ఏమిటి?" అని అరిచేడు ఇంగ్లీషులో.

"ప్రాముఖ్యతే. "

"ఎందుకు?"

నిప్పూ - నీరూ

గుండెల్లో
రగులుతూంది
అగ్నిగుండం
కన్నుల్లో
పొరలుతూంది
గంగానది

—పద్మావతీ గంగాధర్

రీజనల్ మేనేజర్ నెమ్మదిగా తలెత్తకుండా అన్నాడు "ఆవిడ ఫైనాన్స్ మినిష్టర్ కూతురు కాబట్టి."

ఆ హాల్లో మళ్ళీ నిశ్శబ్దం అలుముకొంది. పెద్దపెద్ద ఆర్గనైజేషన్స్‌లో చిన్నచిన్న పదవుల్లో వుండే వాళ్ళ వెనుక కూడా పెద్ద 'పవర్' వుంటుందనీ—సంస్థకీలక నిర్ణయాలకి వాళ్ళు చాలా అడ్డుపడ్తారనీ అక్కడ అందరికీ తెలుసు.

చతుర్వేది కొంచెం కదిలి "నాదో సలహా" అన్నాడు. అందరూ అతడివైపు చూసేరు "కుమారి ప్రతిమని ఆఫీసర్‌ని చేసి, కాష్ దగ్గిర్నుంచి గౌరవంగా పంపించేస్తే" అన్నాడు.

మానేజింగ్ డైరెక్టర్ అతనివైపు మెచ్చుకోలుగా చూసేడు.

*　　*　　*

అయితే ఈ సమస్యని లాయర్ పంతులు అంత తేలిగ్గా వదిలిపెట్టదల్చుకోలేదు. కుష్ఠువాడికి ప్రతిరోజూ పావులా యిచ్చే కమిషన్ మీద. రోజూ వెళ్ళి ప్రొద్దున అయిదు రూపాయలు డిపాజిట్ చేసేటట్టూ, మధ్యాహ్నం వెళ్ళి దాన్ని తిరిగి తీసుకొనేటట్టు ఏర్పాటు చేసేడు.

దాని ప్రభావం మాత్రం బ్యాంకు ఆర్థిక వ్యవస్థ మీద విపరీతంగా పడింది.

రోజురోజుకీ డిపాజిట్లు తగ్గిపోసాగినయ్.

ఈ లోపులో తాజా పత్రిక ఫొటోలతో సహా ప్రచురించసాగింది వార్తనీ.

కుష్ఠువాడు కౌంటర్ దగ్గిరకి రాగానే

కాకుల్లా కష్టమర్లు చెదిరిపోయేవారు. అతడి చేయి తగిలినచోట తమ చెయ్యి పడకుండా జాగ్రత్తపడేవారు. అయితే పరిస్థితి అక్కడితో ఆగలేదు. 'ఎందుకొచ్చిన బాధ-ఇంకో బాంకు చూసుకొంటే పోలేదా' అని చాలామంది డబ్బు తీసేసుకోసాగేరు. పదిహేను రోజుల్లో బాంక్ డిపాజిట్లు సగానికి సగం తగ్గిపోయేయి.

ఈ విషయమై ఏం చేయ్యాలో రిజర్వ్ బాంక్‌కి సలహా అడుగుతూ వ్రాసిన వుత్తరానికి 'అతి మామూలుగానే' జవాబు రాలేదు.

ఈ పదిహేను రోజుల్లోనూ హరిభజన్ సింగ్ బరువు ముప్పై పవున్లు తగ్గిపోయింది. దిగుల్తో కళ్ళక్రింద గీతలు ఏర్పడినయ్. మనిషి రోజురోజుకి కుదించుకుపోసాగేడు.

అప్పుడు కల్సుకొన్నాడు చతుర్వేది అతణ్ణి.

పదిహేను నిముషాలు రహస్యంగా సమాలోచన్లు జరిపేడు. తాజాపత్రిక ఆఫీసుకి ఫోన్ చేసేడు. ఎడిటర్‌తో కాకుండా తిన్నగా గ్రూపు చైర్మెన్‌తోనే మాట్లాడాడు.

"హల్లో షెట్టీ—"

"హల్లో చతుర్వేదీ-లాంగ్‌టైమ్—"

"ఈ సాయంత్రం ఖాళీయేనా—"

షెట్టీ ఛార్టు చూసి, 'ఖాళీయే' అన్నాడు.

"అయితే సాయంత్రం కాక్‌టెయిల్స్‌కి ఎందుకు కలుసుకోకూడదు మనం."

"ష్యూర్."

ఆ సాయంత్రం క్లబ్‌లో వాళ్ళు కల్సుకొన్నారు. అరగంటలో విషయం సెటిల్ అయిపోయింది.

జనాన్ని మరింత దోచుకోవటం కోసం షెట్టీ పెడ్తూన్న మరో జంతర్ మంతర్ బిజినెస్‌కి బ్యాంక్ ఆఫ్ ఉటోపియా గ్యారంటీ ఇచ్చేటట్టూ, కుష్టువాడి విషయం పత్రిక మర్చిపోయేటట్టూ

ఇది జరిగిన రెండోరోజుకి లాయర్ పంతులు బ్యాంక్ ఆఫ్ ఉటోపియాకి అసిస్టెంటు లీగల్ అడ్వైజర్‌గా నియమింపబడ్డాడు

కుష్టువాడు మాత్రం చతుర్వేదికి కొద్దిగా ట్రబులిచ్చేడు.

"నేనెందుకు డబ్బు తీసేస్కోవాలి దొరా? ఆరోకలాసు వర్కూ- నేనూ సదువుకొన్నా. అదీగాక ఆ పంతులు సెప్పిండు కూడా. నేను డబ్బులుంచాలనుకుంటే ఎవ్వరొద్దన్లేరంట. సూద్దాం ఏమవుతదో—"

చదుర్వేది మొహం చిట్లించి "నేను చెప్తున్నా కదా" అన్నాడు.

"ఆ రోజు నువ్వయిదు రూపాలిచ్చిన్నప్పుడు నేనిన్ని పైసలేంజేస్కోన్దొరా" అంటే "మా బాంకులో ఏస్కో" అన్నది కూడా నువ్వే గదా "

చతుర్వేది గతుక్కుమని "సర్లెసర్లె-ఇప్పుడవన్నీ ఎందుకు" అన్నాడు. "ఇదిగో యీ అయిదురూపాయలు తీసుకొని, ఇంకా విషయం మర్చిపో. ఇక లోపలికి రాకు,"

వస్తానన్నాడు వాడు.

వీధిలో వాడితో ఎక్కువసేపు మాట్లాడటం చతుర్వేది కిష్టంలేదు. అప్పటికే ఒకళ్ళిద్దరు తమ వైపు కుతూహలంగా చూడటం అతడు గమనించేడు. తల వంచుకొని లోపలికి వచ్చేసేడు.

ఆ మధ్యాహ్నమే, 'ముట్టుకొని బెదిరించి' అడుక్కుంటున్నాడన్న కారణంగా పోలీసులు అరెస్ట్‌చేసి వాణ్ణి తీసుకుపోయేరు విషయం చాలా తేలిగ్గా తేలిపోయింది.

ఈ విషయం ప్రచురించటానికి పత్రికలేదు.

ఈ విషయాన్ని ప్రొటెస్ట్ చెయ్యటానికి లాయర్లేడు.

చతుర్వేది కారు చూడటానికి కాపలాదారు కూడా లేడు.

అయినా పర్లేదు. అతడికి ప్రమోషనొచ్చిన కారణంగా కారునీ డ్రైవర్నీ బ్యాంకువాళ్ళే యిచ్చేరు-పదిరోజుల క్రితవేఁ.

సర్వే జనా సుఖినో భవంతు.



"దయచేసి వినండి."

దయచేసి విందామని నిక్కబొడుచుకొన్నాయ్ చెవులు.

ఒకటి కాదు

రెండు కాదు

వందలు. వందల చెవులు.

"మద్రాసు నుండి హైద్రాబాద్ వెళ్ళు ఎక్స్‌ప్రెస్ సుమారు తొంభై నిముషములు ఆలశ్యముగా నడుచుచున్నది" ఆడా, మగా కాని గొంతుతో రైల్వే అనౌన్స్‌మెంట్.

నిక్కబొడుచుకొన్న చెవులు క్రమంగా వాలిపోయాయి

వెయిటింగ్‌రూం గోడమీద దక్షిణ మధ్య రైల్వేవారి ప్రకటన "ప్రజల సేవలో భారత రైల్వేలు."

అవును!

ప్రజల సేవలో భారత రైల్వేలు 90 నిముషాలు లేటు

కాదు కాదు. మన రైళ్ళు నడుస్తాయి కనుక ప్రజల సేవలో భారత రైల్వేలు 90 యుగాల

లేటు.

ప్లాట్‌ఫాంమీద జనం
గుంపులు గుంపులుగా జనం
పట్టు చీరెలు, సిల్కు చీరెలు, షిఫాన్, నైలెక్స్‌లు, సీతాకోక చిలుకల కోకలు, బెల్ బాటమ్స్ లంగాలు, లుంగీలు—
పరుగెడుతున్నాయ్
జిగ్‌జాగ్ బల్బుల్లా.
ప్లాట్‌ఫాంమీద జనం
గుంపులు గుంపులుగా జనం
ఎగుమతి కావడానికి
ఎగుమతి చెయ్యడాని
దిగుమతి చేసుకోవడానికి
జనం జనం
గుంపులు గుంపులుగా జనం
నేను ఎగుమతి కావడానికి కాదు
దిగుమతి చేసుకోవడానికి కాదు
ఎగుమతి చెయ్యడానికి
అనంతను పురిటికి పుట్టింటికి పంపడానికి.
వెయిట్, వెయిట్, వెయిట్'
ఇంకా రెండు గంటలు.
"కూర్చుందాం పదండి."
"పద."
ప్లాట్‌ఫాం చివర సిమెంటు బెంచి
ఆ సిమెంటు బెంచి మా జ్ఞాపకాల కేంద్రం. అనుభూతుల నిలయం.

దూరంగా రైల్వే క్వార్టర్స్ మీదుగా, కొబ్బరి ఈనెల మధ్యగా చందమామ. ఆకాశం తెల్లగా వెన్నెల సున్నం వేసినట్లు

ఎండలో ముత్యాలారబోసినట్లు వెన్నెల్లో ఆకాశం నిండా నక్షత్రాలు.

గగనం యవ్వనం బుగ్గమీద దంతక్షతాల్లా నక్షత్రాలు. కనుచూపు మేరా రైలుపట్టాలు సమాంతర రజిత ప్రవాహాలు.

అనంతా నేను పెళ్ళి చేసుకోక ముందు యిక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. పరస్పరం కళ్ళలోకి చూసుకొంటో, భవిష్యత్తు కలలు కంటో,

మొదటిసారి అనంత చేతిని నా చేతిలోకి తీసుకొన్నదీ, ఆమె వ్రేళ్ళు నా జుట్టులో ఆడు కొన్నదీ—ఇదిగో—ఈ చోటే. అందుకే ఇది మా జ్ఞాపకాల కేంద్రం. అనుభూతుల నిలయం.

అనంత పరిచయం కాకముందూ ఆ తర్వాతా రమణా నేను అనేక సాయంకాలాలు యిక్కడే కూర్చునేవాళ్ళం. నేటి సాహిత్య ధోరణులు, ప్రపంచ రాజకీయాలు మొదలుకొని రాంబాబు కవిత్వం వరకు మా కబుర్లలో దొర్లిపోయేవి.

"యిదీ మన చోటు. యిక్కడ కూర్చుందాం."

అనంతా నేనూ ఆ చివరి బెంచిమీద కూర్చున్నాం.

"ఏం మనిషివో బాబూ! ఇంత సెంటిమెంటు వుండకూడదు."

"యాంటీ సెంటిమెంట్ కూడా ఒక సెంటి మెంటే. బ్లయిండ్ సెంటిమెంట్స్ పనికిరావని, మనిషికి ఆనందాన్నిచ్చేవి, ఆ ఆనందాన్ని అభి వృద్ధిపరిచేవి అయిన సెంటిమెంట్సు వుండి తీరాలన్నాడు రస్సెల్ తెలుసా?"

"నీతోనా? ఎప్పుడు?"

"ఆయనెవరితోనో చెప్పాడు. వాళ్ళు మనతో అన్నారు సరేనా!"

అనంత చిన్నగా నవ్వింది ఆమె నవ్వితే వెన్నెల నవ్వినట్లుంటుంది.

తెల్లని శరీరానికి ఎర్రని చీరె, జాకెట్టు చాల అందంగా వున్నాయి. తెల్లని నుదుటిమీద ఎర్రని బొట్టు వుదయిస్తున్న సూర్యుడిలా వుంది


ఈ రాత్రి గగనంమీద, అనంత అధరం మీద మెరుస్తూ ద్విపాత్రాభినయం చేస్తున్నాయి నక్షత్రాలు.

అనంత చేతిని తీసుకొని గాజులు లెక్క పెడుతున్నాను. ప్రతి మూడు ఎర్రగాజుల నడుమ రెండు తెల్లగాజులు. మొత్తం పదమూడు గాజులు

"మీరూ వస్తే బావుండేది", అనంత కళ్ళు నిండా దిగులు.

"వస్తాను నిన్ను తీసుకురావడానికి."

"ఎప్పుడు? మూడు మాసాల తర్వాతా?"



ఫలితం పక్క పేజీలో

"అలాంటి ఆశలేం పెట్టుకోకు. డెలివరీ కాగానే తీసుకొస్తాను."

"ఇందులో ఆశేముంది? మా అమ్మావాళ్ళు పంపాలి గదా?"

తన ఎడమ చేతిలోకి నా కుడిచేతిని తీసుకొని కుడి చేత్తో నిమురుతోంది. తీయటి స్పర్శ.

స్పర్శ యెన్ని రకాలు!

ప్రేమ, వాంఛ, కోపం—విభిన్న మనః ప్రవృత్తుల సంకేతం స్పర్శ.

కొంచెం ఎత్తయిన పొట్టతో కొత్త కాంతుల్ని తెచ్చుకొని అనంత అందంగా వుంది.

మాతృత్వం యిద్దరు స్త్రీ పురుష ప్రకృతి సహజమైన సంగమ ఫలితమే కావచ్చు. కాని కేవలం ఒక భౌతిక విషయంగా మాత్రమే తీసుకోలేము. అది ఒక అవ్యక్తానుభూతి.

అనంతదగ్గర నుండి 'పాండ్స్' పరిమళాలు ఆగి ఆగి వస్తున్నాయి.

"పాపకేం పేరు పెడదామంటారు!"

"నీ కిష్టమైన పేరు."

"పాప పేరు చాల అందంగా వుండాలి. లావణ్య బాగుంది కదూ!"

"చాల పాత పేరు. అయినా పేరులో ఏముంది?ఇవాళ నువ్వు కనవలసింది సుబ్బమ్మలనూ, లావణ్యాలను కాదు అనంతా. ఒక పాణిగ్రాహిని. ఒక నిర్మలను కనాలి. ఒక కవి యేమన్నాడో తెలుసా? "ప్రతి తల్లీ ఒక సూర్యున్ని ప్రసవిస్తే చాలూ" అని.

"మన పాపో, బాబో పెరిగి పెద్దవాళ్ళయ్యేంతవరకు మీరు కావాలనుకొనే వర్గాలు లేని సమాజం రాదంటారా?"

"రావాలనే మనం కోరుకుంటాం! వస్తుంది కూడ. మారిన ఆ నూతన సమాజాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఎప్పుడూ వుంటుంది. ఆ బాధ్యత వాళ్ళదే గదూ?"

అనంత సుదీర్ఘమైన చర్చల్లోకి ఎప్పుడూ వెళ్ళదు. విషయాల్ని కదిపి వూరుకోవడం తప్ప.

"పుస్తకాలేమైనా తీసుకెడుతున్నావా?"


"చలం ప్రేమ లేఖలు, బిడ్డల శిక్షణ."

"బిడ్డల శిక్షణ సరైన వేళలో సరైన పుస్తకం. ప్రేమలేఖలు ఇప్పుడెందుకు?ఇంకెన్ని సార్లు చదువుతావ్?"

"ప్రేమ లేఖలే కాదు, చలం ప్రతి రచనా నిత్యనూతనమే. ఎన్నిసార్లు చదివినా మొదటి సారి చదివినట్లే వుంటుంది."

ఇక్కడి మౌనం నా వంతు. చలాన్ని అర్థం చేసుకోవడంలో నాకూ అనంతకూ కొన్ని తేడా లున్నాయి. అయినప్పటికీ చలం మా యిద్దరికీ అభిమాన రచయితే.

లూప్ లైన్లో వున్న కంపార్టుమెంట్లో



నుంచి నలిగిపోయిన పూలవాసనా, చౌక రకం పౌడర్ వాసనా వుండి వుండి గుప్పుమని మా మీదుగా వెళ్తున్నాయి. ఆ వాసనలు మన ప్రజాస్వామ్యంలా ఎబ్బెట్టుగాను, జుగుప్సాకరంగాను వుండి గబ్బుకొడుతున్నాయి.

మేము కూర్చున్న బెంచీకి కొంచెం దూరంలో చింకి గుడ్డల మధ్య ముసలి బిచ్చగత్తె స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తర్వాత భారత దేశంలా మూలుగుతూ ముడుచుకు నుంది.

రెండు గంటల లేటుగా వచ్చిన తిరుమల ఎక్స్‌ప్రెస్ కొంచెంసేపు చేపల మార్కెట్‌లా చేసి ప్లాట్‌ఫాంను వదలి వెళ్ళిపోయింది

బెల్ కొట్టారు.

"దయచేసి వినండి."

ఈసారి చెవులు నిక్కబొడుచుకోలేదు.

"మద్రాసు నుండి హైదరాబాద్ వెళ్ళు ఫిఫ్టీత్రీ ఎక్స్‌ప్రెస్ మరి కొన్ని నిముషములలో నాల్గవ నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చుచున్నది—"

అనౌన్సుమెంటు పూర్తికాలేదు. ఫిఫ్టీత్రీ ప్లాట్‌ఫాం పైకి దూసుకొచ్చింది.

ఎన్నికలకు ముందు కొద్ది రోజులూ, అయిన తర్వాత వెంటనే కొద్దిరోజులూ ప్రజల చుట్టూ తిరిగి ఆ తర్వాత కనిపించని రాజకీయ నాయకుల్లా మన రైళ్ళు రెండు స్టేషన్లమధ్య నెమ్మదిగా నడచి స్టేషన్లో మాత్రం పరుగెత్తుతుంటాయి.

అనంతకు కిటికీ ప్రక్కనే సింగిల్ సీటు దొరికింది. తను తెచ్చుకొన్న ఒక్క సూట్‌కేసు తన కాళ్ళదగ్గర పెట్టుకుంది.

"శనివారం వస్తారుగా' తప్పక రావాలి. రెండురోజుల కొక లెటరయినా రాయాలి. ఆరోగ్యం జాగ్రత్త. హోటల్ తిండి తినకండి. అత్తయ్యను పిలిపించండి."

"ఇక ఆపు తల్లీ! అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను నువ్వే జాగ్రత్త. మామయ్య స్టేషన్ కొస్తార్లే. లెటర్స్ రాయడం మర్చిపోకేం. ఆరోగ్యం జాగ్రత్త."

"ఇక ఆపు తండ్రీ' అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను,"

ఇద్దరం నవ్వుకున్నాం.

గార్డు విజిలేసాడు.

పచ్చలైటు వూగుతుంది.

"బిబ్బూ"—అవ్యక్తానుభూతుల అంచుల చివరకి వెళ్తేనే అనంత అలా 'బుజ్జీ'ని తిరగేసి పిలుస్తుంది.

"ఏమిటోయ్?"

"బిబ్బూ! రియల్లీ ఐ లవ్ యు. ప్లీజ్ రిమెంబర్ మి."

"ఏమిటి? రియల్లీ అని ఇంత తొందరగానా చెప్తున్నావ్."

అనంత గొంతులో దుఃఖం.

అనంత కళ్ళలో దుఃఖం.

"ఏమిటి చిన్నపిల్లలా? ఇప్పుడేమైందని?" అనాలనుకుకొన్నాను. కాని మాట గొంతు చించుకొని రావడంలేదు.

అనంత నా చేతిని తన పెదాలతో చిన్నగా 'టచ్' చేసి వదిలింది ట్రైన్ కదిలింది. బయట గాలిలో ఎర్ర గాజులతో అనంత తెల్లని చేయి వూగుతోంది.

నా చూపులే ఆమెకు వీడ్కోలు చెప్పాయి.

* * *

స్టేషన్ బయటికొచ్చాను. టైం రెండూ ముప్పావు కావొస్తోంది. ఈమధ్య డే అండ్ నైట్ టీ స్టాల్స్ వూళ్ళో బాగా పెరిగాయి. ఒకసారే కాఫీ తాగి పోవచ్చు అనుకొంటూ టీ స్టాల్ లోపలి కెళ్ళాను టేబుల్ ముందు కూర్చున్నాను. లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. టేబుల్‌మీదున్న ఈవెనింగ్ ఎడిషన్ న్యూస్ పేపరు తీసుకొన్నాను

చీకటిరాజ్యంలో దుర్మార్గపు రాజకీయాలు పేపరు నిండా అత్యవసర పరిస్థితి పెట్టిన తరువాత పిల్లలు సరిగ్గా టైముకు వస్తున్నారట. సిగ్గులేకపోతే సరి. పిల్లలు సరిగ్గా స్కూలుకు రావడానికి యెమర్జెన్సీ అవసరమైన దేశం మనది.

"అరేయ్ చంద్రా!"

పేపర్లోంచి ముఖం బయటకు తీసాను.

నా ఎదురు కుర్చీల్లో యిద్దరు యువకులు ఎక్కడో చూసిన గుర్తు. చెవులమీదుగా గడ్డం క్రిందుగా మఫ్లర్ చుట్టుకున్నారు. కొంచెం పెరిగిన గడ్డం, దట్టంగా మీసాలు. మీసాల మధ్య చిరునవ్వు.

అవును' ఆ నవ్వు రామసూరి రామసూరి. అవును రామసూరే. మరి—అతను—కొనదేరిన ముక్కు, గంభీరమైన కళ్ళు—ఇంకెవరివి? అంజిరెడ్డివే.

నా ఆనందం అవధులు దాటుతోంది.

వాళ్ళను చూసి దాదాపు తొమ్మిదేళ్ళనుతోంది.

"ఏమిటిరా గుర్తు పట్టలేదా! నేను రామసూరిని. వీడు అంజిరెడ్డి."

"బావున్నార్రా?" అన్నాను.

"ఏం చేస్తున్నార్రా?" అనబోయి మానేసాను.

వాళ్ళేం చేస్తున్నారో నాకు తెలుసు.

అటువంటి వాళ్ళేం చేస్తారో కూడా నాకు తెలుసు.

నా ఆలోచనలకు పదేళ్ళ వయస్సు తగ్గింది.

మా వూరు పల్లెటూరే అయినా ఒక హైస్కూలుంది.

మా స్కూలుకు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా విద్యార్థులు వస్తుండేవాళ్ళు. మొత్తం అరువందలదాకా వుండేవాళ్ళం. మాది కమిటీ స్కూలు.రామసూరి,అంజిరెడ్డి ఎస్సెల్సీ నేను ఫెన్తూ చదువుతున్నాం. మా వూరిమీదా, స్కూలుమీదా మా గ్రామ భూస్వాములదే పెత్తనం. మా స్కూలు హెడ్‌మాస్టారు, మిగతా టీచర్లందరూ దాదాపు ఆ కుటుంబాల వారే మా గ్రామ పెత్తందార్లందరూ పాలక వర్గ రాజకీయ పార్టీ అనుచరులే. ఒకే ఒక వ్యక్తి తప్ప. ఆ ఒక్క వ్యక్తి రామసూరి నాన్న. రామసూరి నాన్నను మా వూళ్ళో అంతా 'కమ్యూనిస్టు ప్రకాశరావు" అని పిలుస్తారు. ఎన్నికల్లో తప్ప కమ్యూనిస్టు రాజకీయ సంచలనం మా వూళ్ళో దాదాపు కనిపించేది కాదు.

రామసూరి నాన్న రామసూరికోసం మంచి మంచి పుస్తకాలు, సోవియట్ పిల్లల పుస్తకాలూ, నార్ల చిరంజీవి బాలసాహిత్యం తెస్తుండేవాడు ఎవరింటిలోనూ లేనన్ని పుస్తకాలు వుంటుండేవి వాళ్ళింట్లో. రామసూరి తను చదువుతూ ఇతర్ల చేత చదివించాలని ప్రయత్నించేవాడు. "కమ్యూనిస్టు సూరి" "కమ్యూనిస్టు పుస్తకాలు" అంటూ యెవరూ చదివేవారు కాదు.

రామసూరి స్కూల్ డిబేట్సులోను, మోడల్ పార్లమెంటులోను చురుగ్గా పాల్గొనేవాడు. మా స్కూల్‌లో ప్రతి శుక్రవారం ఈవెనింగ్ లాస్ట్ పిరియడ్ డిబేట్‌గాని, పార్లమెంటు గాని వుండేది.

ఒకరోజు "భారతదేశంలో ప్రజాస్వామ్యం"

గురించి డిబేటు జరుగుతుంది. ఆ రోజు సూరి ఆ విషయమై మాట్లాడుతూ "ఉత్పత్తి సాధనాలమీద ప్రజలకు అధికారం వుండటమే నిజమైన ప్రజాస్వామ్యమని, వ్యక్తిగత ఆస్తి రద్దు కాకుండా ప్రజలందరూ సమానహక్కులతోనూ' నిజమైన స్వేచ్ఛతోను బ్రతకడం సాధ్యంకాదని మన దేశంలో చలామణి అవుతున్న ప్రజాస్వామ్యం పాక్షికమైనదని" చెప్పాడు. ఈ చర్యకు అధ్యక్షత వహించిన మా తెలుగు మాస్టారు సుబ్బారెడ్డిగారు సూరిని ఎగతాళి చేస్తూ మాట్లాడారు. ఆయన తన ఉపన్యాసంలో "సూరి చెప్తున్నది రష్యా కమ్యూనిజం గురించి. వాళ్ళు సమానత్వం సమానత్వం అని గొడవ చేస్తారు. సమానత్వమంటే వాళ్ళ ఉద్దేశంలో ఏమిటి? రష్యాలో యేం జరుగుతుంది. ఇవాళ చైనాలోం ఏం జరుగుతుంది, ఉదాహరణకు సూరి పొట్టివాడు. అతని స్నేహితుడు అంజిరెడ్డి పొడవుగా వుంటాడు రష్యాలోనో, చైనాలోనో అయితే సూరి ఎత్తుతో సమానంగా అంజిరెడ్డి తల నరికేస్తారు. అవును హెచ్చు తగ్గులు వుండనివ్వరు వాళ్ళు. సొంత ఆస్తి వుండకూడదు. సొంత పెళ్ళాం ఉండకూడదు. నీ పెళ్ళాం నా పెళ్ళాం అని తేడా వుండదు. నా పెళ్ళాం అందరి పెళ్ళాం అవుతుంది. కనుక అది మన దేశానికి పనికిరాదు. మనకు గాంధీ, నెహ్రూ " మాస్టారి ఉపన్యాసం పూర్తి కాలేదు. రామసూరి స్టేజిమీదికి పరుగెత్తాడు.

"తెలుగుమాస్టారిలాంటి కమ్యూనిస్టు వ్యతిరేకులు కమ్యునిజానికి ఇలాంటి వక్రభాష్యాలు చెప్పడం కొత్తేమీ కాదు, రాజకీయ అవగాహన స్పష్టంగా లేని, అర్ధం చేసుకొనే స్థితిలో లేని విద్యార్థుల్లో యిలా కమ్యూనిస్టు వ్యతిరేకత రెచ్చగొట్టడం దుర్మార్గమైన చర్య" అని, పెద్దగా ఉద్రేకంగా మాట్లాడాడు.

ఆ తరువాత క్లాసులో యేదో నెపం పెట్టి రామసూరిని తెలుగుమాస్టారు పిచ్చి కొట్టుడు కొట్టారు.

రామసూరి భూస్వాముల బిడ్డలతో కాక మిగతావాళ్ళతో స్నేహం చేసేవాడు. వాళ్ళు కూడా అతని రాజకీయాలతో తప్ప అతనితో స్నేహంగా వుండేవారు. వాళ్ళు యెక్కువ భాగం సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో వుంటుంటారు. హాస్టలు తిండి, అక్కడి అధ్వాన్న పరిస్థితులలను పరిశీలించి ఆ విద్యార్థులతో చర్చించేవాడు. ఇతని అభిప్రాయాలతో ఏకీభవించినా పరిస్థితుల మార్పుకోసం కృషి చేసే వాళ్ళు కాదు.

'రామసూరి, అంజిరెడ్డి మంచి స్నేహితులు. నేను కూడా రామసూరితో కలిసి తిరుగుతూ అతనివద్ద నున్న పుస్తకాలు చదువుతూ దగ్గర వాణ్ణయ్యాను.

మా వూరు పొగాకు పంటకు ప్రసిద్ధి. కొన్ని వందలమంది కూలీలు పొగాకు బ్యారన్లలోను, పొగాకు కంపెనీలోను పని చేస్తుంటారు ముఠా కార్మిక సంఘం పెట్టాలని సూరి ప్రయత్నించాడుగాని అది సాధ్యపడలేదు.

చేనేత కార్మికులు జరిపే భావనారుషి పండుగకు యువకులందరినీ ఒకచోట చేర్చి ప్రతి యేడూ వుండే రికార్డు డ్యాన్సులకు బదులు ఒక సాంఘిక నాటిక ప్రదర్శింప' చేయడం కుల పెద్దలకూ, ఊరి పెద్దలకూ గిట్టలేదు.


రామసూరి వాళ్ళ నాన్నవల్ల లేని ప్రమాదాన్ని తీసుకొస్తున్నాడు.

ఇదే సమయంలో ఎస్సెల్సీ పబ్లిక్ పరీక్షలొచ్చాయి.

నైన్త్, టెన్తు, ఎస్సెల్సీ మూడు సంవత్సరాలు చదివిన సైన్సూ హిందీ పరీక్షలు ఒకే రోజు జరిగేవి. దీనికి వ్యతిరేకంగా అన్ని స్కూలు విద్యార్థులు సమ్మె చేస్తున్నారు.

రామసూరి మన స్కూల్లో కూడా చేయించాలన్నాడు. విద్యార్థులతో మాట్లాడితే కొందరు అవునని కొందరు కాదనీ అన్నారు. మనం సమ్మె చేయించలేకపోయినా కనీసం మన అసంతృప్తిని, మన కోర్కెల్ని ప్రజలకు చెప్పాలి. డిమాండ్స్ గోడలమీద రాద్దాం అన్నాడు.

ఇది మాకు ఒక కొత్త అనుభవం. నేను, సూరి, అంజిరెడ్డి, శివప్పిరెడ్డి గోడలమీద నినాదాలు, డిమాండ్స్ రాయాలని నిర్ణయించు



కొన్నాం. చిన్న చిన్న డబ్బాల్లో కాకిరాయి రంగు కలుపుకొన్నాం. ఈతపుల్లలు నమిలి బ్రష్‌లు తయారుచేశాం

రాత్రి పదిన్నరకే మా వూరు నిదుర పోయింది.

రామసూరి యింటి దగ్గరనుండి మేము బయలుదేరాం.

డబ్బాలో కుంచెలు మునుగుతున్నాయ్.

గోడల మీద అక్షరాల్లా తయారవుతున్నాయ్.

తెల్లని గోడమీద ఎర్రటి అక్షరాలు.

పచ్చని చెట్టుకి ఎర్రని మందారాలు.

"ఎస్. ఎస్. యల్. సి. పబ్లిక్ పరీక్షల్లో రోజుకొక పరీక్ష మాత్రమే పెట్టాలి."

"కొఠారి కమీషన్ సిఫార్సులు అమలు చేయాలి."

"లేబొరేటరీ వసతులు కల్పించాలి"

"హాస్టలు గ్రాంటు పెంచాలి."

"హాస్టల్లో అధ్వాన్నపు పరిస్థితులు నశించాలి."

"ఫీజులు తగ్గించాలి."

రంగులో మునుగుతున్న కుంచెలు
గోడమీద నినాదాలు
నినాదాలు కావవి
మా చైతన్య పరిమళాలు
ఊరు తెల్లవారింది
తూర్పు ఎర్రబడింది
మా స్కూలు గోడ ఎర్రబడింది.
మా వూరి గోడల నిండా ఎరుపు
మా వూరి కామందుల కళ్ళ నిండా మెరుపు

"ఎరుపంటే కొందరికి (కామందులకి) భయం భయం."

"పసిపిల్లలు (మేము) వారికన్న నయం నయం."

మరునాడు మేము మామూలుగా స్కూలుకు వెళ్ళాం.

మా హెడ్మాస్టారు, ప్రసాదరెడ్డిగారు, సుబ్బారెడ్డిగారు మా ఐదుగురిని ఒక గదిలోకి పిలిచి లోపల గడియపెట్టారు.

మొదట ఎగతాళి చేశారు. తరువాత ప్రశ్నల వర్షం కురిపించారు. మా సమాధానాలు నచ్చలే

దన్నారు. మాకు రెటమతం ఎక్కువన్నారు. పొగరు బాగా ఎక్కిందన్నారు.మా వూరి పరువు, మా స్కూలు 'గుడ్ నేమూ' గంగలో కలిసాయన్నారు ఇలా వదిలితే మేము వాళ్ళ కొంప ముంచుతామన్నారు. చివరికి మా అందరికీ తలా నాలుగంటించి బయటకు పంపారు.

"హెడ్మాస్టర్ దురాగతం" పేరుతో ఈ సంఘటనను రామసూరి యింటికి వచ్చే ఒక పత్రిక మోసుకొచ్చింది.

ఎస్సెల్సీ విద్యార్థులు తమ కోర్కెల్ని సాధించారు.

దీనితో రామసూరి మాట వినడం ప్రారంభమైంది. రామసూరి, అంజిరెడ్డి మా గ్రామ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించి, యువజన సంఘాలు, కూలి సంఘాలు అని యేర్పాటు చేశారు.

ఎస్సెల్సీ అయిపోగానే రామసూరి, అంజిరెడ్డి పి యు. సి. కోసం టౌను కెళ్ళడం, అక్కడ స్టూడెంట్ ఫెడరేషన్లో పని చేయడం, ఇంతలో నక్సల్బరీలో వీచిన గాలి శ్రీకాకుళం, గోదావరి జిల్లాల్లోకి జోరబడటం, ఆ విప్లవ రాజకీయాల్లో పని చేస్తూ అజ్ఞాత వాసంలోకి వెళ్ళడం—ఇలా ప్రజలకోసం పాటుపడే క్రమంలో వాళ్ళు.

డిగ్రీ పూర్తిచేయడం, ఉద్యోగం దొరక్కపోవడం, అనంతతో పరిచయం ఆ తరువాత పెళ్ళి కావడం, నేను పైపు ఇన్స్యూట్ పెట్టుకోవడం, అనంత హైస్కూల్లో తెలుగు టీచరుగా పని చేస్తూండడం, పుస్తకాలు చదవడం—విషయాలు తెలుసుకోవడం, ఏవో కవితలూ, కథలూ రాయడం — ఈ పరిధి దాటని జీవితం సాగిస్తూ నేను.

"మీ అమ్మా నాన్నా బావున్నారా? మీ చెల్లెలి పెళ్ళి చేశారా?"

—అప్పుల్లా కుటుంబ క్షేమ సమాచారం.

నిజమైన చుట్టాలు మరింకెవరు?

నేను సమాధానాలు చెప్పాను.

"పత్రికల్లో నీ రచనలు చూస్తున్నాను. నీలో వ్యక్తివాదం, ఆత్మాశ్రయవాదం పూర్తిగా పోలేదు."

"నేనేమీ ప్రజలకు వ్యతిరేకంగా రాయడం లేదు కదా? అయినా భావాలన్నీ ఆత్మాశ్రయాలే కదా?"

"ప్రజలకు వ్యతిరేకంగా వ్రాయకపోవడం ఒక్కటే చాలదు. వ్రాయగల శక్తి, ఆ స్వభావము వున్నప్పుడు ప్రజల గురించి వ్రాయకపోవడం కూడా తప్పే. భావాలన్నీ ఆత్మాశ్రయాలని అంటున్నావు నువ్వు. కాని యిది కొత్త వాదనేమీ కాదు. ఇది కాలం చెల్లిన సూత్రీకరణ. ఆలోచనలు, భావాలు, ఆనాటి సామాజిక వ్యవస్థలో వున్న ప్రజల జీవన పరిస్థితులను ఆశ్రయించుకొని వుంటాయి. ఆ భావ ప్రకటనా రూపాలే సాహిత్యము, కళలు. దీనర్థం సాహిత్యమూ, కళలు ప్రజల జీవితాల్లోంచి పుట్టుకొస్తాయని.

ప్రజల జీవితం, ప్రజల పరిసితులు, వాటి కారణాలు, వాటిని మార్చడానికి ప్రజలు చేసే ప్రయత్నాలు—అన్నీ అధ్యయనం చేయాలి. ప్రజలు ఆ పరిస్థితులు మార్చుకోవడానికి కావాల్సిన చైతన్యం కలిగించడం, ఆ ప్రయత్నాలకు ఊపిరి పోయడం, ఆ ప్రయత్నాల విజయాలను నిలబెట్టుకొనే శక్తిని వారికివ్వడం—ఇవే నేటి దశలో సాహిత్యం, కళలు యొక్క ప్రయోజనం"

రామసూరి ఒక వ్యక్తి కాడు
రామసూరి ఒక పాఠశాల
రామసూరి ఒక మంచి పుస్తకం.


రామసూరి మాట్లాడని విషయం లేదు. రామసూరి సంచిలో నుండి యేవో తీసాడు. తీసి నాకిచ్చాడు. నాకిచ్చి చదవమన్నాడు.

కరపత్రాలు, సైక్లోస్టయిల్ చేసిన పత్రికలు.

అత నెక్కడుంటే అక్కడ విప్లవం
అత నెక్కడుంటే అక్కడ చైతన్య భాండాగారం

మూడు కాఫీ లొచ్చినయ్.

కరపత్రాలు, పత్రికలు జేబులోకి నెట్టాను.



ఫలితం పక్క పేజీలో

కాఫీ త్రాగడం పూర్తిచేసి కప్ టేబులు మీద పెట్టి తల పైకెత్తాను.

రామసూరి, అంజిరెడ్డికి రెండువైపులా— వెనుక పోలీసులు.

నా ముఖంలో షాక్ కనిపించిందేమో సూరి వెనక్కి తిరిగాడు. తన చుట్టూ పోలీసులు. పరిస్థితి అర్థమైంది.

రామసూరి, అంజిరెడ్డి నిల్చున్నారు.

రామసూరి పిడికిలి ఎత్తి పెట్టాడు.


"ప్రియమైన ప్రజలారా! కామ్రేడ్స్"

అక్కడున్న పాతికమందీ అంతకు ముందు నుంచీ యిటే చూస్తున్నారు.

"నా పేరు రామసూరి. ఈ కామ్రేడ్ పేరు అంజిరెడ్డి. మేము కమ్యూనిస్టు విప్లవకారులం. మన దేశాన్ని రెండువందల సంవత్సరాలపాటు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలించారు. 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి అధికార మార్పిడి తతంగం జరిగింది. దాన్నే మనం "స్వాతంత్ర్యం" అని ప్రకటించుకొన్నాం. స్వాతంత్ర్యం గురించి ప్రజలు కన్న కలలు కలలుగానే మిగిలిపోయాయి. ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లోకి రాలేదు మనది వ్యవసాయక దేశం ప్రధానమైన వుత్పత్తి సాధనం భూమి. ఆ భూమిని అతి కొద్దిమంది భూస్వాములు తమ చేతుల్లో వుంచుకొని, వీరే పాలక వర్గంగా తయారయ్యారు. 1947కు ముందు ఒక బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి మాత్రమే గురయిన మనం ఈ రోజు ప్రపంచంలోని అన్ని సామ్రాజ్యవాద దేశాల, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల దోపిడీకి గురవుతున్నాం. ఆర్థిక, రాజకీయ, మిలటరీ, సాంస్కృతిక రంగా లన్నిటిమీదా విదేశీ సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజ్యవాదుల పెత్తనం బలంగా వుంది అందుకనే మేము ఈ సామాజిక వ్యవస్థను "అర్ధవలస, అర్ధఫ్యూడల్ స్వభావం కలిగిన వ్యవస్థ" అని అంటున్నాం.

ఈ దేశంలో భూస్వామ్య వ్యవస్థ నిర్మూలించబడి, ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి ప్రజల పరం కావడం ద్వారాను, విదేశీ జోక్యాన్ని, వారి పెట్టుబడులను, వారి పెత్తనాలను అన్ని రంగాల నుంచి ఎత్తివేయడం ద్వారాను భారత ప్రజలు దోపిడీనుండి విముక్తి సాధించగలరని మా విశ్వాసం.

"ప్రస్తుత దశలో శ్రామికవర్గ నాయకత్వాన కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా మధ్యతరగతి ప్రజలు, జాతీయ బూర్జువా వర్గంతో ఐక్య సంఘటన యేర్పాటు చేసుకొని సాగే జనతా ప్రజాతంత్ర విప్లవ" మొక్కటే ఈ కర్తవ్యా



లను నిర్వర్తించగలదు. ఈ కర్తవ్య నిర్వహణకు ప్రజలను సిద్ధం చేయడమే మా కార్యక్రమం.

ఈ కార్యక్రమంలో భాగంగానే మేము ఏజెన్సీ ప్రాంతాల్లో రైతు కూలి సంఘాలను పెట్టాము. వారి స్థానికసమస్యలమీద వారిని కదిలించి వారికి పోరాట చైతన్యం కలిగించడమే మేము చేస్తున్న కృషి.

"చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా కూలద్రోయాలని మేము కుట్ర పన్నామని, మామీద కుట్రకేసు బనాయించింది ప్రభుత్వం. దోపిడీలతోను, హత్యలతోను మాకు సంబంధాలున్నాయని ఆరోపణలు వేసింది. ఇంటా బయట అత్యవసర పరిస్థితి ప్రకటించి నామ మాత్రమైన ప్రజాస్వామ్య హక్కులను సైతం కాలరాసి తన నియంతృత్వాన్ని, నిర్బంధాన్ని ప్రజలమీద ప్రయోగిస్తుంది. ఎంత నిర్బంధం ప్రయోగించినా అంతిమ విజయం ప్రబలదేనని ప్రజలు జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తిచేసి సోషలిస్టు విప్లవానికి పునాది వేయగలరని మా గాఢ విశ్వాసం. ఈ రోజు మీ అందరి ముందే అరెస్టు చేస్తున్న వీళ్ళు విచారణ లేకుండా యేళ్ళపాటు జైల్లో వుంచవచ్చు. నానా చిత్రహింసలపాలు చేయవచ్చు. ఎదురు కాల్పుల్లో చనిపోయామని ప్రకటించవచ్చు. మేము పోయినా పోరాటం ఆగదు. అంతిమ విజయం ప్రజలదే. ప్రజలే చరిత్ర నిర్మాతలు."

పీలగావుండే రామసూరి కంఠంలో ఎక్కడిదీ గాంభీర్యం?

ఈ శక్తి ఎక్కడి నుండి వచ్చింది?

ఈసారి అంజిరెడ్డి పిడికిలి ఎత్తాడు.

"విప్లవం."

"వర్ధిల్లాలి"—రామసూరి గొంతు అందుకుంది.

"కమ్యూనిష్టు విప్లవకారులు."

"వర్ధిల్లాలి."

ఇదేమిటి? వీళ్ళు వ్యక్తుల పేర జేజేలు కొట్టడంలేదు.

నా చిన్నతనంలో నినాదాలన్నీ వ్యక్తులకు జేజేలు కొట్టడంతోనే పూర్తయ్యేవి.

"ప్రజా ఉద్యమాలమీద నిర్బంధకాండ"

"నశించాలి."

హోరు—హోరు—నినాదాల హోరు.

"కమ్యూనిస్టులం మేము కష్టజీవులం."

పాట సాగుతుంది.

"అరచేతిని అడ్డు పెట్టి సూర్యకాంతి
నాపలేరు.
అరెస్టులను సాగించి ప్రజా శక్తి నడ్డ
లేరు."

పాణిగ్రాహి పాట రామసూరి, అంజిరెడ్డి గొంతుల్లోంచి ప్రపంచంలోకి—

పాట పాడే గొంతుల్ని పోలీసులు తీసుకెళ్ళి పోతున్నారు.

పాట వారి వెంట సాగిపోతుంది

వాళ్ళు కనుచూపు దాటిపోయారు.

ఆ పాట గాలిలో కలిసి యిటువైపింకా వస్తూనే వుంది.

జనంలో గుసగుసలు

"ఎవరు వాళ్ళు? ఎవరు వాళ్ళు?"—అని

కాని—

"ఎవరి వాళ్ళు? ఎవరి వాళ్ళు?"—అని అనరేం?

* * *

ఆ రోజు ఆదివారం ఆలస్యంగా నిద్ర లేచాను

ప్రక్కనే టీపాయ్‌మీద ఉత్తరం.

అనంత దగ్గరనుండి వచ్చిన ఉత్తరం.

తన ఆరోగ్యం బాగానే వుందని, నన్ను శనివారం రమ్మని మంగళవారం పోస్టుచేసిన ఉత్తరం.

నాకు శనివారం అందిన ఉత్తరం.

పేపర్‌బోయ్ పడేసిన పేపరు కిటికీలోంచి వరుగెత్తుకొచ్చింది.

మంచంమీద పడుకొనే పేపరు తిప్పుతున్నా.

అత్యవసర పరిస్థితి సాధించిన నూరు విజయాలతో పేపరు నిండిపోయింది.

ఇదో పేజీ చివర్లో—

"ఎదురు కాల్పుల్లో యిద్దరు
నక్సలైట్ల మృతి."

" ఏజెన్సీ ప్రాంతంలో మొన్న రాత్రి నక్సలైట్లకు పోలీసులకు జరిగిన సంఘర్షణలో ప్రముఖ నక్సలైటు సూరన్న అనబడే రామసూరి, అతని అనుచరుడు దాసు అనబడే అంజిరెడ్డి చనిపోయినట్లు, మరి నలుగురు తప్పించుకుపోయినట్లు. వీరి వద్ద రెండు నాటు తుపాకులు, నక్సలైటు సాహిత్యం, చేతిబాంబులు దొరికినట్లు యిక్కడ కందిన సమాచారంవల్ల తెలుస్తుంది."

రామసూరి అంజిరెడ్డి యిక కనిపించరు.

నా గుండెనిండా నిశ్శబ్ద విషాదం.

కంటినుండి చెవులమీదుగా నా జుట్టులోకి వెచ్చగా జారుతున్న దుఃఖం.

ఈ రోజు మూడు రంగుల జండా క్రిందకు దిగదు.

పత్రికలు సంపాదకీయాలు రాయవు.

రేడియోలో విషాద సంగీతం వినబడదు.

కాని

నాకు తెలుసు

అక్కడ—అడవి ఎరుపెక్కుతుంది. నేల ఎరుపెక్కుతుంది. అడవి పూలు ఎరుపెక్కుతాయి—కొండలూ కోనలూ యెరుపెక్కుతాయి. రామసూరి, అంజిరెడ్డి గొంతులతో "విప్లవం వర్ధిల్లాలని" ఆ అడవీ, ఆ కొండలూ ప్రతిధ్వనిస్తూనే వుంటాయి.

ఎప్పుడో, ఎక్కడో విన్న పాట అస్పష్టంగా గుర్తుకొస్తుంది.

"ఎవరు వాళ్ళు
ఎవరు వాళ్ళు
ఎవరి వాళ్ళు
ఎవరి వాళ్ళు
ఎవరికోసం వచ్చినారు
ఎవరికోసం పోయినారు"

కళ్ళు తుడుచుకొంటూ లేచి బ్యాగులో రెండు జతలు బట్టలు సర్దుకొన్నాను అనంత దగ్గరకైనా వెళ్దామని. □

సినిమా

'బుర్రిపాలెం బుల్లోడు'


శ్రీ తిరుపతి ఇంటర్‌నేషనల్ పతాకంపై యువ నిర్మాత కె. విద్యాసాగర్ నిర్మిస్తున్న వినోదభరిత చిత్రం "బుర్రిపాలెం బుల్లోడు" చిత్రంలో తమిళ కథానాయిక రతీదేవి ఒక ప్రధాన పాత్ర పోషిస్తోంది.

ఇరవై ఏండ్లు గల రతీదేవి మొదటి తమిళ చిత్రం "పాపాత్తి"లో కథానాయికగా నటించారు. బొంబాయిలోని రెడ్‌లైట్ ఏరియానుండి రతీదేవిని యెన్నుకున్నట్లు ఆ చిత్ర దర్శకుడు చేసిన ప్రకటన తమిళ ప్రేక్షకులలో గొప్ప సంచలనాన్ని కలుగజేసింది. రతీదేవి పాపాత్తి చిత్రంలో వ్యభిచారిణిగా నటించడం మరో విశేషం.

నూతన దర్శకుడు వీరం మస్తాన్‌రావు దర్శకత్వంలో తయారవుతున్న ఈ చిత్రంలో కృష్ణ, శ్రీదేవి, సత్యనారాయణ, గిరిబాబు, అల్లు రామలింగయ్య, నాగభూషణం, కాంతారావు, పండరీబాయి, జయమాలిని, జయవిజయ నటిస్తున్నారు.

జంధ్యాల, సత్యానంద్ సంయుక్తంగా రూపొందించిన ఈ చిత్రకథకు, జంధ్యాల సంభాషణలను, చక్రవర్తి సంగీతాన్ని, నరసింహారావు కూర్పును, భాస్కరరాజు కళను, బాల

'మహాశక్తి'లో జ్యోతిలక్ష్మి, జయమాలిని





'శృంగార రాముడు'లో లత, రామారావు

కృష్ణ ప్రొడక్షన్సు, నాగేశ్వరరావు సహకార దర్శకత్వాన్నీ నిర్వహిస్తున్నారు.

'శంకరాభరణం'

కె. విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్ఠాత్మక సంగీతభరిత చిత్రం "శంకరాభరణం" చిత్రనిర్మాణం రాజమండ్రివద్ద గల "రఘుదేవ పురం"లో ప్రారంభం అయ్యింది.

పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు నిర్మిస్తున్న యీ రసవత్తర చిత్రంలోని పాటలన్నీ విజయా గార్డెన్స్‌లో రికార్డ్ కాబడ్డాయి.

సంగీత రసప్రధానంగా రూపొందించబడుతున్న యీ చిత్రంలో చంద్రమోహన్, జె.వి. సోమయాజులు, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, గోకిన రామారావు. అర్జా జనార్దన రావు, భార్గవి, నిర్మల, ఝాన్సీ, పుష్పకుమారి. బేబి తులసి, బేబీ వరలక్ష్మి నటిస్తున్నారు. రాజ్యలక్ష్మి అనే నూతన నటిని కథానాయికగా పరిచయం చేస్తున్నారు.

స్వరబ్రహ్మ కె.వి. మహాదేవన్ సంగీతాన్ని, అవార్డు విన్నింగ్ ఛాయాగ్రాహకుడు బాలుమహేంద్ర ఛాయాగ్రహణాన్ని, జంధ్యాల సంభాషణలను, వేటూరి సుందరరామమూర్తి పాటలను, జి. జి. కృష్ణారావు కూర్పును, తోట కళను,నండూరి విజయ్ సహకారదర్శకత్వాన్ని, పృథ్వీరాజ్ నిర్మాణాన్ని నిర్వహిస్తున్నారు ఈ చిత్రానికి.

'దేవుడు మామయ్య'

శోభన్‌బాబు హీరోగా నటిస్తున్న రాజా ఆర్ట్ ఎంటర్‌ప్రయిసెస్ వారి రంగుల చిత్రానికి "దేవుడు మామయ్య" అన్న పేరు నిర్ణయించారు. నటి విజయలలిత తొలిసారిగా సమర్పి

స్తున్న చిత్రం ఇది. బాలల ఇతివృత్తం ప్రధానాంశంగా గల ఈ చిత్రాన్ని బాలల సంవత్సర కానుకగా నిర్మాతలు అందిస్తున్నారు. బాల నటులు అనేకమంది ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆంధ్ర మెహమూద్ పేరుతో నూతన బాలనటుడ్ని ఈ చిత్రంద్వారా పరిచయం చేస్తున్నారు. శోభన్‌బాబు, వాణిశ్రీ హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ చిత్రంలో విజయలలిత, శ్రీధర్, పద్మనాభం, అల్లు రామలింగయ్య, మాడా, బేబి గౌరి, బేబి వరలక్ష్మి, బేబి రాణిలు ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు.

మాటలు: సత్యానంద్, సంగీతం: చక్రవర్తి కెమెరా: కె.యస్. ప్రకాష్. కళ: కొండపనేని రామలింగేశ్వరరావు, కూర్పు: రవి. ప్రొడక్షన్: రాంబాబు. ప్రముఖ నిర్మాత జి. రాజేంద్రప్రసాద్ నిర్మాణ సారధ్యంలో నిర్మించబడుతున్న ఈ చిత్రం యువదర్శకుడు కె. వాసు దర్శకత్వంలో తయారవుతోంది. నిర్మాతలు: టి. వెంకట్రామయ్య, త్రినాధ్.

'మునసబుగారి అల్లుడు

విజయప్రభ మూవీస్ పతాకంపై యస్.డి. విజయబాబు కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో నిర్మితమైన గ్రామీణ కుటుంబ కథాచిత్రం "మునసబుగారి అల్లుడు" ఆగస్టు నెలాఖరులోగా రీరికార్డింగ్ కార్యక్రమాల్ని ముగించుకొని సెప్టెంబరు మూడవవారంలో విడుదల చెయ్యటానికి నిర్మాత లక్ష్మి విజయ్‌బాబు సర్వసన్నాహాలు గావిస్తున్నారు.

పూర్తి గ్రామీణ వాతావరణంలో నిర్మితమైన యీ చిత్రంలో గిరిబాబు-శ్రీగీత, విజయ్‌బాబు-రాణీచంద్ర రెండు జంటలుగా నటించగా సురేంద్రనాధ్-శ్రీకళ అనే నూతన హాస్య జంట యీ చిత్రంద్వారా పరిచయం అవుతున్నారు. క్రొత్త తరహా పాత్రలో త్యాగరాజు నటించగా నాగరాజారావు, రావికొండలరావు, గురునాధ్, చందన, రాధాకుమారి, బేబి సరళ, సురేష్, కిషోర్, శివరామయ్య, జి. సత్యనారాయణ, విజయకుమార్, ఇతర పాత్రధారులు

'పారిజాతం'లో రాజేశ్వరి



ే గ్లామర్ గర్ల్‌లోని నటిపై వెలుగులు చిమ్మి ప్రేక్షకులకు చూపింది.

నెమ్మది నెమ్మదిగా చిత్ర చిత్రానికీ అనుభవాన్ని పునాదులుగా వేసుకొంటూ కేవలం 'స్టార్' కాకుండా ఆర్టిస్టుగా రూపొందింది జయసుధ. ఇటీవలనే 'డ్రైవర్ రాముడు' 'ఇంటింటి రామాయణం' 'కల్యాణి' చిత్రాలను కొన్ని రోజుల తేడాలో చూడటం జరిగింది. ఎంతటి వైవిధ్యమున్న పాత్రలు! ఎంత సునాయాసంగా వాటికి రూపకల్పన చేసింది నటి జయసుధ. పాత్రలో లీనమై నటించిందన్న ప్రయోగం కాదు నేను చేసేది, పాత్రకు సరైన రూపకల్పన చేసిందన్నదే! ఈ కొలమ్స్ ద్వారా ప్రత్యేకంగా అభినందించకుండా ఉండలేనంతటి ఉన్నతంగా ఉంది జయసుధ నటన ఆ చిత్రాల్లో. రియల్ హార్ట్‌ఫెల్ట్ కంగ్రాచ్యులేషన్స్ టు ది ఆర్టిస్టు జయసుధ.

యువతరం కదిలింది!

దాదాపు అయిదేళ్ళ క్రితం, నూతన నటుడుగా పరిచయం చేస్తూ ఇంటర్వ్యూ చేశాము నటుడు రంగారావును. పోస్టు గ్రాడ్యుయేట్ పట్టా, రంగస్థల నటనానుభవం, ఆకర్షణీయమైన రూపం, వీటన్నిటికీ పైన అనుకొన్నది సాధించే పట్టుదలా, అన్యాయం జరుగుతుందనుకొంటే సహించలేని మనస్తత్వమూ ఉన్న ఈ నటుడికి ఆశించిన రీతిలో అవకాశాలు రాలేదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ వచ్చాడు. అయితే నటుడిగా తను చేరుకొన్న స్థాయికి మించి ఎన్నో రెట్లు పైమెట్టున వ్యక్తిగా నిలబడగలిగాడు. ఈ వ్యవస్థలో మనిషికీ మనిషికీ పెరిగిపోతున్న తారతమ్యాలు, ఆర్థిక స్థితిగతులలో తేడాలూ రంగారావుని డక బాధించే అంశాలు. సంభాషణ అవసరమైనప్పుడు యెప్పుడూ ఆవేశంగా మాట్లాడతాడు. ఈ అన్యాయాల నెదుర్కోవాలనీ, అలా చేయలేకపోతున్నదనీ ఆవేదన వ్యక్తపరుస్తాడు. ఇతి అతని వ్యక్తిత్వం. 'జరుగుతున్న దోపిడీలకూ, అక్రమాలకూ, మనిషయిన ప్రతి



'అమ్మ ఎవరికైనా అమ్మ'లో శ్రీప్రియ

వాడూ యెదురొడ్డి పోరాడవలసిన బాధ్యత ప్రతి సామాజిక సభ్యుడికీ ఉంది. తమకంటూ స్వంత బాధ్యతలు లేని దశ యువతరానిది. అలాంటి



'మండే గుండెలు'లో కృష్ణ, శోభన్ బాబు



యువతరాన్ని ప్రక్కదారులు తొక్కనీయకుండా, అన్యాయాలకూ, అక్రమాలకూ అడ్డుగోడలుగా మలచగలిగిననాడు సాంఘిక న్యాయం తప్పనిసరిగా జరిగితీరుతుంది. ఈ సందేశం ఊపిరితో, ఈ సందేశం అందరికీ చేరేందుకు అవసరమయిన వినోదాన్ని రంగరించి చలనచిత్ర నిర్మాణం చేపట్టాను" అన్నాడీ 'యాంగ్రీ యంగ్‌మాన్' తన సారధ్యంలో నిర్మించబడుతున్న 'యువతరం కదిలింది' చిత్రం గురించి వివరిస్తూ. వి. మధుసూధన రావు దర్శకత్వంలో తయారయే ఈ చిత్రంలో మురళీమోహన్, రంగనాధ్, గిరిబాబు, యం. రంగారావు, నాగభూషణం. రావుగోపాలరావు, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, పద్మనాభం, కె. వి. చలం, శారద, నిర్మల ముఖ్య పాత్రధారులు. రచన: బొల్లిముంత శివరామ కృష్ణ.

సిద్ధం కండి!

ఒకప్పుడు జ్యోతిలక్ష్మి నృత్యమంటే వెర్రెత్తి చూసింది ప్రేక్షకలోకం. ఆ పిమ్మట



‘లంబాడోళ్ళ రాందాసు’లో జయలక్ష్మి, చలం, రోజారమణి

ఉన్నాయి నటుడయేందుకు. సినిమా నటుడివి అయిపోదా మేంటి’ అని అతన్తో ముచ్చట్లాడింది అతని అంతరాత్మ. అలాగే కానిమ్మని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నటుడిగా పట్టా పుచ్చుకొన్నాడు. చిత్రాల్లో అవకాశాలూ వచ్చాయి. నటుడయ్యాడు. ఈ కథకి కథానాయకుడు చిరంజీవి పేరు గలవాడు. ఆ చిరంజీవికి ఇంతవరకూ వచ్చిన ‘ఛాలెంజింగ్ రోల్ కోతల రాయుడులోనిది’ అంటాడతను. కోతల రాయుడే అయినా హృదయం వున్న మనిషై, మారిన పరిస్థితులలో పశ్చాత్తాపంతో పునీతుడైన కథానాయకుడిగా నటించాడు ‘కోతల రాయుడు’లో చిరంజీవి. నవరసభరితమై నిలిచింది ఈ పాత్ర, హాస్యం, శృంగారం, కరుణ...ఒకటేమిటి అన్నీ కలసివున్న పాత్ర. నటుడిగా నాకెంతో నచ్చిన పాత్ర’ అన్నాడు చిరంజీవి ఒకటికి రెండుసార్లు ఆ పాత్రగురించి వివరిస్తూ. కె. వాసు దర్శకత్వంలో తమ్మారెడ్డి వి. కె. నిర్మించిన ఈ చిత్రంలో గిరిబాబు, చక్రపాణి, కె. వి. చలం, సారథి, హేమ సుందర్, మాధవి, కె. విజయ, శైలజ,మంజు నాగ[illegible] నిర్మల కూడా నటించారు. సంగీతం: చక్రవర్తి; మాటలు: సత్యానంద్; కెమెరా: రామారావు; కూర్పు: నాయని మహేశ్వరరావు; నృత్యం: తార; కళ: కృష్ణమూర్తి; సహకార దర్శకత్వం: ఎం. పార్థసారథి నిర్వహిస్తున్నారీ చిత్రానికి.



‘కుడి ఎడమైతే’లో (జయ) నూతన్‌ప్రసాద్.



'దేవుడు మామయ్య'లో శ్రీధర్, వాణిశ్రీ, శోభన్ బాబు

టైగర్

తెలుగు చలనచిత్ర నిర్మాణ సంస్థలలో నవశక్తికొక ప్రత్యేక స్థానముంది. హైదరాబాద్‌లో నిర్మించబడ్డ మొదటి తెలుగు చిత్రం "మా యింటి మహాలక్ష్మి" నుండి అంతా కొత్తవాళ్ళతో నిర్మించబడిన "నీడలేని ఆడది, అమ్మాయిలు జాగ్రత్త" వరకు ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన సంస్థ ఇది. ఆ సంస్థ అధిపతి పి. గంగాధరరావుగారి కుమారులు పి. నారాయణరావు, పి. నాగేంద్రరావులు నవశక్తి పిక్చర్స్ పతాకంపై నిర్మించిన మొదటి రంగుల చిత్రం "టైగర్."

ఈ చిత్రంలో అన్యాయంపై పంజా విసరి న్యాయానికి పందిరి వేసిన కథానాయకుడు టైగర్ రాజా పాత్రలో ఎన్. టి. రామారావు నటించడం, యిప్పటివరకు ఎన్నో భారతీయ భాషలలో నటించి రికార్డు స్థాపించిన హిందీనటి రాధా సలూజా మొదటిసారిగా తెలుగులో రామారావు సరసన నాయికగా నటిస్తోంది. సంచలన నటుడు రజనీకాంత్ మొదటిసారిగా రామారావు కాంబినేషన్‌లో పోటీపడి నటించిన చిత్రం "టైగర్." యితర ముఖ్యపాత్రలలో సుభాషిణి, అంజలీదేవి, జయమాలిని, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, గుమ్మడి, అల్లు రామలింగయ్య, వంకాయల, సారథి, సాక్షి రంగారావు, నూతన నటుడు నవకాంత్, మాస్టర్ బబ్లూ, మాస్టర్ గణనాధ్ నటించిన యీ చిత్రానికి సంభాషణలు కణ్వశ్రీ-ప్రభాకర్, కెమెరా: యస్. యస్. లాల్, ఆర్ట్: కుదరవల్లి, పాటలు: వేటూరి, డా॥ నారాయణరెడ్డి, సంగీతం: సత్యం. సహకార దర్శకులు: సాయిబాబా, రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్: లక్ష్మణరావు, ప్రొడక్షన్ నిర్వహణ: పి. హరిప్రసాదరావు, దర్శకత్వం: నందమూరి రమేష్, నిర్మాత: పి. నారాయణరావు, సమర్పణ: పి. నాగేంద్రరావు.

లంబాడోళ్ళ రాందాసు

మంచి కథల నెన్నుకొని క్లీన్ ఫిలింస్ తీసే సంస్థ రామవిజేతా. ఆ సంస్థ పతాకంపై ప్రముఖ రచయిత కొర్రపాటి గంగాధరరావు

హైదరాబాద్ ఫిలిం క్రిటిక్స్ నూతన కార్యవర్గం

హైదరాబాద్ ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ యిటీవల సమావేశమై యీ క్రింది సభ్యులను ఏకగ్రీవంగా యెన్నుకొంది.

అధ్యక్షులు: శ్రీ జి. యస్. వరదాచారి (ఆంధ్రభూమి).

సెక్రటరీ. శ్రీ గుడిపూడి శ్రీహరి(హిందూ)

సంయుక్త కార్యదర్శి శ్రీ పి. శరత్ కుమార్ (సినీరమ).

కార్యవర్గ సభ్యులు శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి (సినీ హెరాల్డ్)

శ్రీ సి. కనకాంబరరాజు (ఆంధ్రభూమి)

శ్రీ భగీరథ (జ్యోతిచిత్ర)

శ్రీ యం. యస్. శర్మ (ఆనంద జ్యోతి)

శ్రీ డి. ప్రభాకర్ (స్వాతి) యీ సంస్థకు ఆడిటర్‌గా నియమితులైనారు.

నవదర్శకా రా!రా!

"రారా కృష్ణయ్య" రంగుల చిత్రాన్ని అత్యంత ప్రతిభావంతంగా రూపొందించిన నవ దర్శకుడు యోగికి అభినందనలు తెలుపకుండా వుండలేము. 'సెంటిమెంట్' ప్రధానంగా వున్న కథను ఏమాత్రం అసభ్యత లేకుండా అనవసరాలూ పెద్దగా లేకుండా కథను తెరపైకి దృశ్యంగా మలచడంలో దర్శకుడు యోగి తన ప్రతిభ నిరూపించుకున్నాడు. కథకు ఆసక్తికరమైన రూపు నివ్వడంలోనూ, మాటలు, పాటలు సమకూర్చడంలోనూ రచయిత గోపి ఈ చిత్రం ద్వారా వ్యక్తిగత విజయం సాధించాడు. సోమయాజులు, నిర్మల, జగ్గయ్య, చంద్రమోహన్, మాధవి, పొట్టిప్రసాద్ మొ॥లయినవారు నటించిన ఈ చిత్రం త్వరలో విడుదలవుతుంది.

—యస్వీనారాయణ

'బొమ్మలకొలువు'లో జయమాలిని



నవలాచిత్రం


అనగనగా—బెజవాడలో ఓ గాడిద వుండేది.

అది ముఖ్యంగా పుస్తకాలు పబ్లిష్ చేసేవాళ్ల ఆఫీసుల వెనక సందుల్లో తిరుగుతూ ప్రూఫుల రూపంలో దొరికిన సాహిత్యం మేస్తూ వుండేది. దానికి ఓ రోజు "బ్రహ్మాండంగా రెండు థియేటర్లలో ఒకేసారి విడుదలైన ఓ నవలా చిత్రరాజాన్ని" చూడాలని బుద్ధిపుట్టింది. అలా ఓ థియేటర్ వైపు విలాసంగా షికారు బయలుదేరింది. ఒక హాలు నుంచి మరో హాలుకు రీళ్ళు పట్టికెళ్ళడంలో—రిక్షాలోంచి ఓ రీలు ఓ చెత్తకుండీదగ్గర పడిపోయింది. మళ్ళీ సినిమా చూడ్డం ఎందుకని ఆ గాడిద మునిపంట, ఆ రీల్లో ఓఅడుగు ఫిలిం ముక్క కొరికి, నమిలి అసహ్యంగా మొహంపెట్టి "థూ" అని వుమ్మేసి "ఇంతకంటే నవచే లక్ష రెట్లు బెటర్‌గా వుంది" అని, మళ్ళీ పబ్లిషర్ల సందుల్లోకి పోయింది.

నీతి. నిర్మాతలుతీసే నవలా చిత్రరాజాల కంటే తెలుగు సినిమాకోసం రచయితలు రాసే నవలలే ఆరోగ్యం.

సి. వి. గన్నా


మీ అందానికే తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి. పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి
జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్. శిష్ట్లా, ఫోన్ 73467, 77052



TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER
TRIVENI
TRIVENI NUT POWDER MFG. CO.,
Proprietor DESU VENKATA SUBBA RAO
PORT ROAD MACHILIPATNAM-521 001 A.P.
PHONES 458 & 270

నవలల పోటీ

ప్రథమ బహుమతి : రు. 2000-/
ద్వితీయ బహుమతి : రు. 1000-/
తృతీయ బహుమతి : రు. 750-/

పోటీలో పాల్గొను రచయితలు పాటించవలసిన నిబంధనలు·

1. నవలలు 'జ్యోతి నవలానుబంధం' సైజులో 128 పేజీలకు మించకుండా 96 పేజీలకు తగ్గకుండా (ముద్రణలో) ఉండాలి.
2. స్వీయరచనలే పంపాలి. అనువాదాలూ, అనుకరణలూ అంగీకరింపబడవు. రచన స్వీయమేనని, అనువాదంగానీ, అనుసరణగానీ కాదని హామీ పత్రం జతపరచాలి.
3. కాగితానికి ఒకేవైపు రాయాలి.
4. రచనలు తిప్పి పంపగోరువారు తగినన్ని పోస్టల్ స్టాంపులు అతికించిన స్వంత చిరునామాగల కవరు జతపరచాలి.
5. **నవలలు మాకు చేరవలసిన ఆఖరుతేది 15 అక్టోబర్, 1979**
6. కలం పేర్లతో రచనలు పంపినా రచయితలు తమ పేర్లనును విధిగా తెలియజేయాలి.
7. రచనలు పంపే కవర్లపై 'నవలలపోటీకి' అని తప్పక రాయాలి.

గమనించండి !


* బహుమతులు పొందని నవలలో ప్రచురణార్హమైన వాటిని జ్యోతిలో సాధారణ ప్రచురణకు ఎన్నుకొనే హక్కు మాకుంటుంది.
* పోటీ నవలలో సాధారణ ప్రచురణకు ఎన్నుకోబడిన నవలలకు రు. 500/- చొప్పున పారితోషికం ఇవ్వబడుతుంది.
* ఎన్నుకోబడిన నవలలు 'జ్యోతి నవలానుబంధం'లో ప్రచురింపబడుతాయి.
* ప్రచురణ సౌలభ్యంకోసం అవసరమైన మేరకు నవలను సంక్షిప్తీకరించే హక్కు మాకుంటుంది.
* పోటీకి సంబంధించి జ్యోతి సంపాదకులదే తుది నిర్ణయంగా ఉంటుంది.

ఈ పోటీలో రచయితలు వైవిధ్యమున్న రచనలతో పాల్గొని సహకరిస్తారని ఆశిస్తున్నాము.

— ఎడిటర్

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001

JYOTI OCTOBER 79 RS:3/- Regd NO M.8669





అందమైన ప్రతియువతి
ఒంపు సొంపులలో
ఆకర్షణీయంగా
ప్రతిబింబిస్తుంది...



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600001.